ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 108 పేజీలు: 8+4 వెల: 6.50



## కేరళం పీఠంపై వీడి సతీశన్

మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆశా వర్కర్లకు గౌరవ భృతి పెంపు

-సిఎంగా తొలి సంతకం

5లో



సోమవారం ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

## పోలవరం నిర్వాసితుల తరలింపు

# వచ్చే ఏప్రిల్‌కు పూర్తి

- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారమే ప్రాజెక్టు పనులు
- పోలవరం ఎడమ కాల్వ, చంపావతి లింక్‌పై అధ్యయనం
- జలధార-జలహారతి పనులకు ప్రాధాన్యం
- జలవనరులశాఖ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 18. ప్రభాతవార్తప్రతినిధి:** ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25 సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు

**లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు:** సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93శాతం పూర్తైందని, నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఈ యేడాది ఏప్రిల్ 2వతేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రీనీవా ఫేజ్1లో భాగంగా కాలువల వెడల్పు 92శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్‌నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ >>2



## ప్రధాని మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్'ను ప్రదానం చేసిన నార్వే రాజు హెరాల్డ్ వి

నార్వే రాజు హెరాల్డ్ వి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రధాని మోడీ

**ఓస్లో, మే 18:** ప్రధాని మోడీ తన విదేశీ పర్యటనలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవ పురస్కారం అందుకున్నారు. నార్వే పర్యటనలో ఉన్నప్రధానికి ఆదేశ అత్యున్నత పుర స్కారం లభించింది. 'గ్రాండ్‌క్రాస్ ఆఫ్ రాయల్ నార్వేజియన్ ఆర్డర్' పురస్కారం అందుకున్నారు. ఓస్లోలో నార్వే రాజు హెరాల్డ్ వి నుంచి ప్రధాని ఈ పురస్కారం అందుకున్నారు. ప్రపంచదేశాల నుంచి మోడీ 32వ ప్రధాన పురస్కా >>2

## ఎపి లాసెట్‌లో 80% ఉత్తీర్ణత

పిజి లాసెట్‌లో 79.07శాతం

### ఫలితాలు విడుదల చేసిన అధికారులు

**తిరుపతి, మే 18ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన ఎపి లాసెట్, పీజీ లాసెట్ 2026 ఫలితాలను అధికారులు విడుదల చేశారు. మే 4న రాష్ట్రవ్యాప్తంగా వంద పరీక్షా కేంద్రాలలో ఈ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు. మొత్తం 30,021మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, వారిలో 23,996 మంది పరీక్షలకు హాజరయ్యారనీ,వీరిలో 19,197 మంది అర్హత సాధించగా, మొత్తం ఉత్తీర్ణత 80శాతంగా నమోదైందని పద్మావతి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం తెలిపారు.

రెండేళ్ల ఎల్ఎల్.ఎం/ఎం.ఎల్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీ లాసెట్‌లో 1,904 మంది పరీక్షలకు హాజరై, 1,752 మంది అర్హత సాధించారు. ఈ విభాగంలో అత్యధికంగా 92.02శాతం ఉత్తీర్ణత నమోదైంది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించిన లాసెట్‌లో 17,533మంది పరీక్ష రాయగా 13,863మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణతశాతం 79.07గా నమోదైంది.ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో 4,559 మంది పరీక్షలకు హాజరై, 3,582మంది అర్హత సాధించగా, ఉత్తీర్ణత శాతం 78.57గా నమోదైంది. స్త్రీ,పురుష అభ్యర్థుల డేటా పరిశీలిస్తే, పురుష అభ్యర్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తం 15,809 మంది పురుష అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 13,079మంది అర్హత సాధించడంతో 82.73 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మహిళా అభ్యర్థుల్లో 8,187 మంది పరీక్షలకు హాజరుకాగా, 6,118 మంది అర్హత సాధించి 74.73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

అభ్యర్థులు తమ ఫలితాలను హెచ్‌టిటిపిఎస్://సిఇటిఎస్.ఎపిఎస్‌హెచ్ఇ.ఎపి. జివోవి. ఇన్/ లాసెట్‌లో పరిశీలించవచ్చు. మరింత సమగ్రసమాచారం కోసం వాట్సాప్ నంబర్ 9552300009ను సంప్రదించవచ్చు.

## జూన్ 1నుంచి

# కాలువల్లోకి సాగునీరు



### పూడిక తొలగింపు నెలాఖరులోగా పూర్తి కావాలి

### అందుబాటులో 461టిఎంసిల నీరు

### అధికారులతో సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల

**విజయవాడ.మే 18.ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు విడుదల చేస్తామని వ్యవసాయ, జలనీటివనరుల శాఖా మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు ప్రకటించారు. ఖరీఫ్-2026 సాగునీటి విడుదలపై మంత్రులు సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాలువల్లో పూడిక తొలగింపు పనులను మే చివరికి పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలుజారీచేశారు. గత సీజన్‌లో 2025-26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని, రబీ సీజన్‌లో 23.67లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామని మంత్రులు తెలిపారు. రాష్ట్ర రిజర్వాయర్లలో 461 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని వెల్లడించారు.ఇరు శాఖల ఉన్నతాధికారులతో సుధీర్ఘ చర్చ అనంతరం ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు నీటి విడుదలపై షెడ్యూల్ విడుదల చేయడం జరిగింది. ఇందులో పెన్నా డెల్టాకి ఇప్పటికే మే4వ తేదీ నుండి సాగునీటిని విడుదల చేశామని, గోదావరి డెల్టాకు జూన్1వ తేదీ నుండి, గాలేరునగరి సుజల స్రవంతి (జిఎన్ఎస్ఎస్) కింద ఉన్న ఆయకట్టుకు జూన్10వ తేదీనుండి, టిజిపి కడప (ఎస్పీవీబీఆర్ కడప)కు జూన్15 నుండి సాగునీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని వంశధార ఆయకట్టుకు జూన్15వ తేదీ నుండి, తోటపల్లి ఆయకట్టుకు జూలై1 నుండి, కృష్ణా డెల్టా ఆయకట్టుకు జూలై1వ తేదీ నుండి, ఏలేరు రిజర్వాయర్ కింద >>2

## డిప్యూటీ స్పీకర్‌కు సుప్రీంలో చుక్కెదురు

### రామాలయ వివాదంలో యధాతథ స్థితికి ఆదేశం

**విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు(ఆర్ఆర్ఆర్) సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ గోదావరిజిల్లా ఆకివీడు మండలం పెదపేటలోని రామలయం నిర్మాణంపై జోక్యం చేసుకున్న సుప్రీంకోర్టు అక్కడ యథాతథ స్థితినిపాటించాలని ఆదేశించింది. ఇటీవల ఏపీ హైకోర్టు ఈ నిర్మాణం మరియు కూల్చివేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ,సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో అక్కడ పనులకు బ్రేక్‌పడింది ఆకివీడు మండలం పెదపేటలోని చారిత్రాత్మక రామ మందిరం వద్ద నిర్మాణాలు, కూల్చివేతలకు సంబంధించిన అంశంపై హైకోర్టు గతంలో స్టేటస్ కో విధించింది.అయితే, ఈ వివాదంపై ఇటీవల ఏపీ హైకోర్టు పిటిషన్‌ను కొట్టివేసి నిర్మాణాలకు అనుమతి ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు, ఈ వివాదంపై స్పందించి రామాలయం నిర్మాణం, పునరుద్ధరణ పనులపై తక్షణమే స్టేటస్ కో (యథాతథ స్థితి) కొనసాగించాలని స్పష్టం చేసింది.

## 'పంచాయతీ' మరింత పారదర్శకం



సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

### గ్రీన్ షాప్ విధానం ప్రజల్లోకి తీసుకెళ్లండి

### రోడ్ల పురోగతి తెలిసేలా ప్రత్యేక డాష్ బోర్డు

### సమీక్షలో డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థలు చేసే అభివృద్ధి పనులు మరింత పారదర్శకంగా ప్రజలకు తెలియాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ఇందు కోసం ప్రత్యేకంగా ఒక పబ్లిక్ డాష్ బోర్డును తయారు చేయండి. దీనిలో రాష్ట్రంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణం, సంబంధిత అభివృద్ధి పనులు, అలాగే రోడ్ల పరిస్థితి ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు ప్రతి ఒక్కరికి కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ 2025- 26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్ లైన్ విధానంతో పారదర్శకంగా పన్నులు వసూళ్లు చేసిందని చెప్పారు. పంచాయతీలు ఆదాయ వనరులు మరింత పెంచుకొని ముందుకు సాగాలని, ఇదే రీతిలో సమష్టి కృషిని కొనసాగించి వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఆ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. పంచాయతీరాజ్‌శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖల ఉన్నతాధికారులతో సోమవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పవన్ కళ్యాణ్ ఇటీవల పంచాయ తీరాజ్ శాఖ ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ"శాలిడ్ వేస్ట్ మేనేజ్మెంటులో భాగంగా తీసుకొచ్చిన స్వచ్ఛరథాల విధానం మంచి ఫలితాలను ఇస్తోంది. స్వచ్ఛందంగా ప్రజలు రథాల వద్దకు వచ్చి పొడి వ్యర్థాలను ఇచ్చి, నిత్యావసరాలను తీసుకెళ్లడం బాగుంది. దీన్ని ప్రతి నియోజకవర్గంలోనూ అమలు చేస్తున్నాం. ఈ విధానాన్ని మరింత విస్తరించేలా ఆలోచన చేయండి. దీంతోపాటు గ్రీన్ షాప్ పేరుతో తిరుపతి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చిన విధానాన్ని మరింత విస్తరించి, రాష్ట్రమంతటా అమలు చేయాలి. స్వచ్ఛరథాల ద్వారా ఏప్రిల్ నెలలో 18.86 లక్షల కేజీల చెత్తను సేకరించాం. ఆ వ్యర్థాల విలువ రూ. 3 కోట్ల వరకు ఉంటుంది. గ్రీన్ షాపులను ఇదే స్ఫూర్తితో ప్రజలకు దగ్గర చేయాలి. >>2



## 3 రోజులు వర్ష సూచన

### తర్వాత ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

**విజయవాడ మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వాసులకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. నైరుతి రుతుపవనాల రాక, ఉపరితల ఆవర్తనద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ వర్షాల సమయంలో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయని ఏర్కొంది. ఆ తర్వాత రోజుల్లు ఉష్ణోగ్రతలు కూడా 3 నుంచి4 డిగ్రీలు పెరుగుతాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఈ సోమవరం మే 18న ఆగ్నేయ అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు కొమరిన్ ప్రాంతంలోని కొన్ని భాగాలకు, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాంతోలని మరికొన్ని ప్రాంతాలకు, ఆండమాన్ సముద్రంలోని చాలా ప్రాంతాలకు మొత్తం అండమాన్ అండ్ >>2

## నమ్మించి.. భయపెట్టి 9వ తరగతి బాలికపై అత్యాచారం

### ఉమ్మడి ప.గో జిల్లాలో అరాచకం

### నలుగురిపై పోక్సో కేసు

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, మే 18:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒకరు. నలుగురిలో అల్లరి చేస్తామని బెదిరించి మరో ఇద్దరు తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం విస్సా కోడేరు గ్రామంలో జరిగిన ఈ సంఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసింది. ఒక పక్క ఎన్ని కఠినమైన చట్టాలను తీసుకొచ్చినా, ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముక్కుపచ్చలారని చిన్నారుల నుంచి మైనర్ బాలికల వరకూ ఎంతోమంది బాలికలు మృగాల చేతుల్లో బలైపోతున్నారు. చట్టం తీసుకువచ్చి అరెస్టు చేసి జైలుకు తరలించడం తప్ప కామాంధులు భయపడేలా శిక్షలు >>2

## 'నీట్' నిందితుడు రఘునాథ్ అరెస్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మే18:** దేశవ్యాప్త ప్రకంపనల నీట్ యుజి లీక్ వ్యవహారంలో సిబిఐ మరొకరిని ఆరెస్ట్ చేసింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్(ఆర్‌సిసి) కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు శివరాజ్ రఘునాథ్‌ను అరెస్టు చేసింది. ఆయనను తొమ్మిది రోజుల సిబిఐ కస్టడీకి ప్రత్యేక న్యాయస్తానం అనుమతించింది. ఇప్పుడు జరుగుతున్న విచారణల క్రమంలో ఈ కోచింగ్ సెంటర్ పాత్ర కీలకం అని తేలింది. దీనితో నిర్వాహకుడిని ఆదివారం రాత్రి అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు సోమవారం తెలిపాయి. మహారాష్ట్రలోని లాతూర్‌లోని ఆయన నివాసంలో జరిపిన సోదాలలో స్వాధీన పర్చుకున్న >>2

## 'న్యూక్లియర్ ఆర్థికం'లో ఎపి ముందంజ




సోమవారం న్యూఢిల్లీలో జరిగిన 'యుఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో పాల్గొన్న మంత్రి లోకేష్

### ప్రపంచంలో నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం

### 'యుఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో మంత్రి లోకేష్

**విజయవాడ, మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** భవిష్యత్ అణు ఇంధన (న్యూక్లియర్ ఎనర్జీ) ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన ప్రపంచ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో ఇది అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు.న్యూఢిల్లీలో న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్ (ఎన్ఈఐ), యూఎస్ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్‌ఫోరం (యూఎస్ఐఎస్ పీఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన 'యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా' సదస్సులో లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

**ఆంధ్రప్రదేశ్‌లో సహజసిద్ధ ప్రయోజనాలు:** ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలైన స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరి తరం రియాక్టర్ సిస్టమ్స్‌కు విస్తృత అవకాశాలున్నాయి. భారత్‌లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో నైపుణ్యం, తక్కువ ఖర్చుతో కూడిన ఉత్పత్తి వంటివి కలిసొచ్చే అంశాలు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక మౌలిక వసతులు, పోర్టులు, లాజిస్టిక్స్, వేగవంతమైన అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఏపీకి ఒక చరిత్రాత్మక అవకాశం" అని వివరించారు. రాష్ట్రానికి ఉన్న సువిశాల తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మక పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ వంటివి అదనపుప్రయోజనాలని తెలిపారు.పారిశ్రామికీ కరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యమని, ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖపాత్ర పోషిస్తుందన్నారు.

**ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం:** ప్రపంచ దేశాలు ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ >>2

## ఘోర ప్రమాదం

## పెళ్లి బృందం వ్యాన్‌ను ఢీకొన్న కంటైనర్

### 12 మంది దుర్మరణం



**ముంబై, మే 18:** మహారాష్ట్రలోని పాల్‌ఘర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా, మరో 25 మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు >>2

# పోలవరం నిర్వాసితుల తరలింపు వచ్చే ఏప్రిల్‌కు పూర్తి

>> సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ గ్యాప్1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగెడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధారానాగావళికంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గెడ్డనుంచి వంపావతి లింక్‌కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపు పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి అని సీఎం సూచించారు.

**వెలిగొండకు హై ప్రయారిటీ:** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతక్రమం తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికపూడిశెల కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతర్రాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరికావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**ఖరీఫ్‌కు నీరిచ్చే అంశంపై జలవనరులశాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం:** ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి...గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా ప్రత్యేక నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేది. తుఫాన్ల ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేది. పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చామన్నారు. ఈసారి సీజన్‌ను ముందుకు తీసుకు వచ్చేలా నిర్ణయాలు తీసుకున్నామన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్‌లో ఇది కీలకమైన అంశమన్నారు. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధారజలవనరుల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ.17వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నామని పేర్కొన్నారు. భూగర్భజలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుందని, అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతుందన్నారు. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



సోమవారం న్యూఢిల్లీలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో భేటీ అయిన మంత్రి లోకేష్

## రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో లోకేష్ భేటీ

**విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఢిల్లీలో భారత దేశంలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. క్లీన్ ఎనర్జీ, మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాలపై చర్చించారు. ఆయా రంగాల్లో రష్యాతో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలాంటి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా నమ్మకమైన భాగస్వామ్యం ఉందని లోకేశ్ గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని అర్థవంతమైన సహకార అవకాశాలను అన్వేషించడానికి ఎదురుచూస్తున్నానని మంత్రి లోకేశ్ తెలిపారు.

# 'న్యూక్లియర్ ఆర్థికం'లో ఏపి ముందంజ

>> ట్రాన్స్‌ఫర్మేషన్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటివి ఏకకాలంలో ఎలా సాధించాలని ఆలోచిస్తున్నాయని లోకేష్ అన్నారు. వాతావరణ మార్పులపై ఇచ్చిన హామీలను పాటిస్తూ, ఏఐ యుగానికి అవసరమైన విద్యుత్‌ను తక్కువ ఖర్చుతో, సురక్షితంగా ఎలా అందించాలన్నది పెద్ద సవాల్ అని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఇంధన భద్రత (ఎనర్జీ సెక్యూరిటీ) మాకు అత్యంత ప్రాధాన్య అంశం. నేడు ఏపీ దేశంలోనే కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ కేంద్రంగా మారుతోంది," అని లోకేష్ స్పష్టం చేశారు.

**ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి:** రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతున్నామని లోకేష్ తెలిపారు. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, అక్కడ 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు రాబోతున్నాయని వెల్లడించారు. భవిష్యత్ పరిశ్రమలకు భారీ పరిమాణంలో, 24/7 నిరంతరాయంగా, కాలుష్యరహిత, తక్కువ ఖర్చుతో కూడిన విద్యుత్ అవసరమని, అందుకే ఇంధన ప్రణాళిక ఆర్థిక ప్రణాళికలో కీలకంగా మారిందని వివరించారు. "మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, గ్రిడ్ ఆధునీకరణ వంటి రంగాల్లో సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నాం," అని ఆయన ప్రకటించారు.

**భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం:** భవిష్యత్ పారిశ్రామిక వృద్ధికి కేవలం పునరుత్పాదక శక్తి సరిపోదని తాము వాస్తవికంగా ఆలోచిస్తున్నామని లోకేష్ అన్నారు. ఏఐ కంప్యూటింగ్ విస్తరిస్తున్న కొద్దీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని, ఒక హైపర్‌స్కేల్ ఏఐనేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణానికి సమానమైన విద్యుత్‌ను వినియోగిస్తుందని ఉదహరించారు. గ్లోబల్ కంపెనీలు విశాఖలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐనేటివ్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయని, వీటికి భారీ విద్యుత్ అవసరమవుతుందని తెలిపారు.

**డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్:** తమ దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదని, దాని చుట్టూ ఒక పూర్తిస్థాయి తయారీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని లోకేష్ స్పష్టం చేశారు. కూలింగ్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, బ్యాటరీ స్టోరేజ్ వంటి వాటిని స్థానికంగా తయారు చేయడాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు. ఏఐ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్ల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి సంస్థలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

**న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్‌లో భాగస్వామ్యం:** న్యూక్లియర్ ఎనర్జీని కూడా ఒక పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థగా చూడాలని లోకేష్ అభిప్రాయపడ్డారు. కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, పూర్తి న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే ఏపీకి దీర్ఘకాలిక అవకాశమని అన్నారు. కీలక విడిభాగాలు తయారు చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలు నిర్మించడం, ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు నెలకొల్పడం, భవిష్యత్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం వంటి వాటిపై దృష్టి సారిస్తామని వెల్లడించారు.

**ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం:** న్యూక్లియర్ ప్రాజెక్టులకు బదులుగా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇదే సరైన సమయమని లోకేష్ పేర్కొన్నారు. అణుశక్తి విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్‌ను అందిస్తుందని, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దీర్ఘకాలంలో పోటీ ధరలకు విద్యుత్‌ను అందిస్తుందని వివరించారు. ఆధునిక న్యూక్లియర్ టెక్నాలజీల వల్ల భద్రతా ప్రమాణాలు కూడా గణనీయంగా మెరుగుపడ్డాయని గుర్తుచేశారు.ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్ ఏఐ విప్లవంవల్ల ఇంధనానికి డిమాండ్ పెరిగిందని, దీనివల్ల న్యూక్లియర్ ఎనర్జీ ప్రాముఖ్యతను ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయని లోకేష్ అన్నారు. "ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్తులో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్‌లోడ్ విద్యుత్ తప్పనిసరి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలు సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటోంది," అని ఆయన తెలిపారు.

**యూఎస్‌ఇండియా న్యూక్లియర్ అధ్యయం:** భారత్‌అమెరికా సహకారం ఇప్పటికే టెక్నాలజీ, రక్షణ, సెమీకండక్టర్లు వంటి రంగాల్లో మార్పులు తెచ్చిందని, ఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో తదుపరి ప్రధాన అధ్యాయం అణుశక్తి రంగమే కాగలదని లోకేష్ బలమైన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఇంధన భాగస్వామ్యంగా కాకుండా, పారిశ్రామిక, తయారీ, ఆవిష్కరణల భాగస్వామ్యంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం పటిష్ఠమైన ఇంధన, పారిశ్రామిక పునాదులు నిర్మిస్తున్నామని, దీర్ఘకాలిక దార్శనికత కలిగిన గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.



సోమవారం రాత్రి తిరుమలలో కురిసిన భారీ వర్షం

# పలకరించిన నైరుతి: తిరుమలలో జోరువాన

**తిరుమల,మే 18పభాతవార్తప్రతినిధి:** నైరుతిరుతుపవనాల ప్రవేశంప్రభావంతో సోమవారం రాత్రి తిరుమలలో ఈదురుగాలులతో భారీ వర్షంకురిసింది. వాతావరణంలో మార్పుతో సాయంత్రం చల్లటిగాలులు వీచి జోరువాన అతలాకుతలం చేసింది. రాత్రి కూడా చిరుజల్లులతో పడుతూనే ఉంది. కురిసిన వరద నీటికి ఆలయం పరిసరాలు,ఘాట్‌రోడ్లు జలమయంగా మారాయి. బలమైన చలిగాలులు వీస్తున్నాయి. కొండను పూర్తిగా పొగమంచు కప్పేసింది. ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు వానలో తడుస్తూనే గదులకు చేరుకోవాల్సి వచ్చింది.

# వేటకు విరామం..నేడు 'మత్స్యకార చేయూత' ఆరంభం

## గంగపుత్రులకు అండగా ప్రభుత్వం

## కావలిలో నిధులు విడుదల చేయనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ మే 18. ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవల్లో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

**రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం:** వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ.10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ.20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# ప్రధాని మోడీకి నార్వే అత్యున్నత పురస్కారం

>> రాన్ని అందుకున్నారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమని మోడీ పేర్కొన్నారు. ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనల భాగంగా సోమవారం మోడీ నార్వేకు చేరుకున్నారు. ఓస్లోలో ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ జరిగింది. అనంతరం నార్వేకు చెందిన అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌ను మోడీకి ప్రదానం చేశారు. విదేశాల నుంచి ప్రధాని మోడీ అందుకున్న 32వ ప్రధాన అంతర్జాతీయ పురస్కారం ఇది. గ్రాండ్ క్రాస్ అనేది రాయల్ ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో అత్యున్నత శ్రేణి పురస్కారమని, అసాధారణమైన సేవలు అందించిన వ్యక్తులకు మాత్రమే దీనిని ప్రదానం చేస్తారని నార్వే ప్రభుత్వం పేర్కొంది. గౌరవాన్ని అందుకున్న అనంతరం మోడీ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ గ్రాండ్ క్రాస్‌ను అందుకోవడం నాకు గౌరవంగా ఉంది. ఈ గౌరవాన్ని భారతదేశ ప్రజలకు, బలమైన భారత్‌నార్వే స్నేహానికి అంకితం చేస్తున్నాను. ఇది ప్రపంచ పురోగతికి మన ఉమ్మడి నిబద్ధతను ప్రదర్శిస్తుందని పేర్కొన్నారు.

# 'పంచాయతీ' మరింత పారదర్శకం

>> పొడి వ్యర్థాలను గ్రీన్ షాపుల్లో ఇస్తే, ప్రజలు నిత్యావసరాలను తీసుకెళ్లొచ్చని విస్తృత ప్రచారం కల్పించండి. తద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన పెంచండి

**రోడ్లు పూర్తి చేయడానికి నిర్దిష్ట సమయం:** పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులు నిర్దుష్ట సమయంలో నాణ్యతతో పూర్తయ్యేలా చూడండి. రోడ్ల నిర్మాణం, పనుల పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురండి. రోడ్ల నిర్మాణ పనులను అధికారులు బాధ్యతగా తీసుకోవాలి. ప్రతి పని మొదలుపెట్టే ముందు కచ్చితంగా ఎప్పటిలోగా పూర్తి చేస్తామనేది సమయం పెట్టుకోండి. ప్రజల వినతుల ద్వారా వచ్చే ప్రతి రోడ్డు పని చక్కగా జరగాలి. ప్రజలకు శాఖ తరఫు నుంచి పూర్తి జవాబుదారీ తనం కనిపించాలి. రోడ్ల విషయంలో నాణ్యతకు పెద్దపీట వేయాలి. నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలనలు ఉంటేనే రోడ్ల పరిస్థితి అర్థం అవుతుంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి" అని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ బాలునాయక్ పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

**విజయవాడ,మే 18,ప్రభాతవార్తప్రతినిధి:** మచిలీ పట్నంలోని కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా వెంటనే అప్రమత్తమైన పోలీసులు పురుగులమందు డబ్బాను లాక్కున్నారు. బాధితురాలు భట్టిప్రోలు మం డలం పెద్దపుల్లేరుకు చెందిన సంధ్యారాణిగా గుర్తించారు. గతేడాది తన సోదరి సుధారాణి అనుమానాస్పదంగా మరణించిందని సంధ్యా రాణి తెలిపారు. తన సోదరిమృతి కేసును పోలీ సులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పీజీఆర్ఎస్‌లో పలుసార్లు ఫిర్యాదు చేసి నా పట్టించుకోలేదని సంధ్యారాణి వివరించారు.

# 'నీట్' నిందితుడు రఘునాథ్ అరెస్టు

>> సెల్‌ఫోన్‌లో నీట్ ప్రశ్నాపత్రం ప్రతి కూడా కనుగొన్నారు. నీట్ పేపర్స్ విక్రయాల గొలుసుకట్టు వ్యవస్థీకృత గ్యాంగ్‌లో రఘునాథ్ చురుకైన వ్యక్తిగా ఉన్నట్లు నిర్ధారించారు. పరీక్షకు పది రోజులముందు ఈ వ్యక్తి ఇతర కుట్రదారుల నుంచి ప్రశ్నాపత్రాలను సంపాదించాడు. జవాబులు కూడా సేకరించుకుని అక్రమానికి పాల్పడ్డట్లు ప్రాథమికంగా గుర్తించారు.దీనితో ఆయనను అరెస్టు చేసినట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి. బేరాలు కుదుర్చుకున్న వారికి ప్రశ్నాపత్రాలను రాతప్రతుల రూపంలో సమకూర్చారని వెల్లడైంది. పరీక్షలు రాయగానే ఈ కాగితాలను సంబధితులు నలిచి చెత్తబుట్టల్లో వేశారని గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకూ పలువురిని అరెస్టు చేసిన సిబిఐ లెక్చరర్లు పివి కులకర్ణి, మనీషా అరెస్టుతో కేసు విచారణను వేగవంతం చేసింది. వీరికి వాంఘ్మరే అనే వ్యక్తి ప్రధానంగా సహకరించాడని వెల్లడైంది. ఇప్పుడు సిబిఐ కస్టడీకి వెళ్లే రఘునాథ్‌ను సిబిఐ విచారిస్తుంది. ఈ వ్యక్తి ఆర్‌సిసి కోచింగ్ సెంటర్‌ను చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అరెస్టు అవుతున్న పలువురితో రఘునాథ్ ఫోన్‌లో మాట్లాడుతున్నప్పటి వీడియోలు కూడా సిబిఐ సేకరించింది. ఇప్పుడు సిబిఐ అరెస్టు చేసిన వారిలో కీలకమైన ముగ్గురు నలుగురు కూడా మహారాష్ట్రకు చెందిన వారే కావడంతో అక్కడి పోలీసు వర్గాలు , నిఘా సంస్థలు ముంబై , పుణే ఇతర చోట్ల కోచింగ్ సెంటర్లపై దృష్టి పెట్టాయి.

# భగీరథ్ కేసు మల్కాజిగిరి పోక్సో కోర్టుకు బదలీ

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** బండి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు మేడ్చల్ కోర్టు నుంచి మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోక్సో కోర్టుకు బది అయ్యింది. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు కాగా తొమ్మిది రోజుల తరువాత అతన్ని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. ప్రస్తుతం అతను చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్నాడు. ఈ కేసుకు సంబంధించిన విచారణ ఇప్పటి వరకు మేడ్చల్ పరిధిలో వుండగా కేసు తీవ్రతను దృష్టిలో వుంచుకుని దీనిని మల్కాజిగిరి ప్రిన్సిపల్ ఫోస్కో కోర్టుకు బదిలీ చేశారు. మరోవైపు భగీరథ్ అరెస్టు, తదనం తరం జరిగిన పరిణామాలు, ఈ కేసులో అతని పాత్రకు సంబంధించి సిట్ అధికారులు కోర్టుకురిమాండు రిపోర్టు ఇచ్చినట్లుతెలిసింది.దీనికి సంబంధించిన వివరాలను పోలీసులువెల్లడించేందుకు నిరాకరిస్తున్నారు. దీనిపైమంగళవారం నిర్ణయంతీసుకునే వీలుంది.

## వారం - వర్జ్యం

19-05-2026, అధికజ్యేష్ఠ మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
తదియ మ.2.22
మృగశిర ఉ.8.43
వర్జ్యం : సా.4.14-5.40
దు.ఉ.8.10-ఉ.9.02, 2)రా.11.43-రా.12.35
శుభసమయం: ఉ.9.30-10.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** అదృష్టాన్ని కన్నా, కృషిని నమ్ముకుంటారు. అధికంగా కృషిస్తారు. ఫలితాలను కూడా తగిన విధంగా పొందుతారు.

**వృషభం:**అంతర్లీనమైన వేదాంత ధోరణిని కనబరుస్తారు. వివాదస్పద అంశాలకు అయినంత దూరంగా ఉండండి.

**మిథునం:** ఉద్యోగంలో అధికశ్రమ. అబద్ధాలు చెప్పి పని తప్పించుకునే వారి వలన ఇబ్బందులు సంభవిస్తాయి.

**కర్కాటకం:**మీ నైపుణ్యాన్ని అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొనడానికి శారీరకంగా మానసికంగా శ్రమిస్తారు.

**సింహం:**ప్రయాణాలు ఎప్పుడు చేయాలో నిర్ణయించుకుంటారు. ఈ ప్రయాణాలు ముఖ్యమైనవి ప్రభుత్వపరమైన ఉత్తర్వులు అనుకూలంగా వస్తాయి.

**కన్య :**వెన్ను నొప్పి, కీళ్ళ నొప్పి ఇబ్బంది కలిగించవచ్చు. గడియారంతో పాటు పరిగెడుతారు. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :**మంచి అవకాశాలు వచ్చినా సంతృప్తి పడని వాళ్ళతో మీకు ఇబ్బందులు వస్తాయి. శుభకార్యాలు చర్చలు ఫలిస్తాయి.

**వృశ్చికం:**స్వంత వాళ్ళుగా భావించిన వ్యక్తులు రహస్యాలు మీ దగ్గర దాచడం మీ కోపానికి, అసంతృప్తికి కారణం అవుతుంది.

**ధనుస్సు:**భూమి సంబంధమైన విషయాలు కొనుగోలు అమ్మకాలకు సంబంధించిన వ్యవహారాలు లాభిస్తాయి. వస్త్రలాభం.

**మకరం:** గతంలో ఆగిపోయిన అమ్మకం వల్ల లాభం పొందుతారు. ఆశించిన వాటిపై అంతగా లాభాలురావు.బంధువుల కలయిక.

**కుంభం:** యాదృచ్ఛికంగా చేసిన కార్యక్రమాల వల్ల ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. కపటం లేని మనుషులు సాయంగా ఉంటారు.

**మీనం :** నూతన బాధ్యతలు సంతోషంగా కలిగిస్తాయి. బాధ్యతల వెనుక ఉన్న సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 3 రోజులు వర్ష సూచన

>> నికోబర్ దివులకు, తూర్పు మధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాలకు దగ్గరగా చేరుకున్నాయని స్పష్టం చేసింది. రాబోయే 3 4 రోజుల్లో ఈ నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ అరేబియ3ఆ సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలు కొమొరిన్ ప్రాంతం , నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంఓలని మిగిలిని భాగాలు తూర్పు మధ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని దీంతో మే 24 నాటికి అంటే 4రోజుల ముందుగానే ఈసారి రుతుపవనాలు కేరళా తీరాన్నితాకే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ప్రస్తుతం ఉపరితల ఆవర్తనం దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ దాని పరిసర ప్రాంతాలపై సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల మధ్య ఎత్తులో విస్తరించి ఉందని ద్రోణి అంతరాయం, దక్షిణ లక్షద్వీప్ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ ఆరేబియా సముద్రం నుండి కేరళ దక్షిణ అంతర్గత కర్ణాటక, రాయలసీమ మీదుగా దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ యానాంలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ఈ వర్షాల సమయంలో గంటలకు 30-40 కిలోమీటర్ల వేగముతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందని వాతావరణశాఖ స్పష్టం చేసింది. ఇక దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లోనూ రాబోయే 3 రోజులు ఇదే తరహా వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. అలాగే కొస్తో ఆంధ్రప్రదేశ్ యానాంలో మంగళవారం వేడి తేమ, అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశముందని తెలిపారు. ఆ తరువాత 5 రోజుల్లో వడగాలులు ఒకట లేదా రెండు చోట్ల వీచే అవకాశముంది. రాయలసీమలో రాగల 5రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40-43 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు కావచ్చని తెలిపారు.

# జూన్ 1 నుంచి కాలువల్లోకి సాగునీరు

>> ఉన్న ఆయకట్టుకు జూలై10 నుండి, కేసి కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బిసి, టిబిపిఎల్ ఎల్సి,తాడిపూడి, పుష్కర ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టుకు జూలై15 నుండి, టిబిపిహెచ్ఎల్సి కింద ఉన్న ఆయకట్టుకు జూలై20 నుండి, హంద్రీనీవా సుజలస్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఆయకట్టుకు జూలై31 నుండి, నాగార్జున సాగర్ ఆయకట్టు కింద జోన్1 (పల్నాడు, గుంటూరు, బాపట్ల)కు జూలై 31న, జోన్2 (ప్రకాశం, మార్కాపురం) ఆయకట్టుకు ఆగష్టు చివరి వారంలో సాగునీటి విడుదల చేయనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ప్రత్యేక ప్రధానకార్యదర్శి శశిభూషణ్, వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఈఎన్సీ నరసింహమూర్తి,మరియు ఇరు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డెల్టా ప్రాంతాలకు నీటి విడుదల షెడ్యూల్:** గోదావరి డెల్టాకు జూన్ 1 నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు మంత్రులు ప్రకటించారు. కృష్ణా డెల్టాకు జూలై 1 నుంచి, నాగార్జున సాగర్ ఆయకట్టుకు జూలై చివరికి, కె.సి. కెనాల్‌కు జూలై 15 నుంచి, వంశధార ఆయకట్టుకు జూన్ 15నుంచి సాగునీరు విడుదల చేస్తామని తెలిపారు.

**అధికారులకు హెచ్చరికలు:** రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. ఖరీఫ్2026 ప్రణాళికలు, ఎల్‌నినో ప్రభావంపై సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఎరువులు పక్కదారి పడితే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. యూరియా సరఫరా కోసం రైతులకు ప్రత్యేక కార్డులు అందజేస్తామని, అవసరం మేరకు ఆ కార్డు ద్వారా యూరియా తీసుకోవచ్చని తెలిపారు. ముందస్తు నిల్వలు వద్దని, రెండుమూడు దశల్లో నానో యూరియా వినియోగించాలని సూచించారు. యుద్ధం కారణంగా యూరియా దిగుమతులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశంతతతఉందని, అందువల్ల యూరియాను అవసరం మేరకు మాత్రమే వాడాలని రైతులకు అచ్చెన్నాయుడు సూచించారు.

# బాలికపై అత్యాచారం

>> పడకపోవడంతో ఈ ఘాతుకాలకు అంతమన్నది లేకుండా పోతోంది. వివరాల్లో కెళితే విస్సా కోడేరు గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఒక యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి, భయపెట్టి మరో ఇద్దరు అత్యాచారం చేసి గర్భవతిని చేశారు. ఈ ముగ్గరితోపాటు మరొకరి పైన పోక్సో కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పాలకోడేరు మండలానికి చెందిన ఒక బాలిక ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. అదే గ్రామానికి చెందిన వెంకట గణేష్ ఆ బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2024 నుంచి పలుమార్లు శారీరకంగా కలిశాడు. ఇదే అదునుగా గణేష్ స్నేహితుడు దుర్గ మహేష్ (బాబి) బాలికను బలవంతంగా లోబరుచుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన భోగేశ్వరరావు కూడా ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న బాలికను భయపెట్టి అత్యాచారం చేయడంతో పాటు ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. గొరగనుమూడి గ్రామానికి చెందిన లక్ష్మణుడు ఈనెల 9న రైల్వే గేటు సమీపంలో సపోటా తోటలోకి బాలికను బలవంతంగా లాక్కొనివెళ్లి బలాత్కారం చేయడానికి ప్రయత్నంచగా ఆమె పారిపోయి ఇంటికి చేరింది. బాలిక ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు రావడంతో ఈ నెల 15న భీమవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా ఐదు నెలల గర్భవతిగా వైద్యులు తేల్చారు.

దీంతో బాలికను నిలదీయ డంతో ఈ దారుణం బయటపడింది. ఆమె తల్లి దండ్రుల ఫిర్యాదు ఆధారంగా విచారణ నిర్వ హించి నలుగురిపై పోక్సో చట్టంతో పాటు, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ రవి వర్మ తెలిపారు.

# 12 మంది దుర్మరణం

>> చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రక్కును వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. కంటైనర్ ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా దెబ్బతిన్నది. ఘటనాస్థలిలోనే పదిమందికిపైగా మృతి చెందారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని సమీపఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉందని మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఈ ఘటన జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

పోలీసులు సహాయక చర్యలు చేపట్టి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ విషాద ఘటనతో పెళ్లి ఇంట్లో తీవ్రవిషాదం నెలకొంది.

# తిరుమల సమాచారం



## తెలుగు ప్రజలు సంతోషంగా ఉండాలి

**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని వేడుకున్నట్లు హైకోర్టు న్యాయమూర్తులు తెలిపారు. సోమవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎవి రవీంద్రబాబు, హైకోర్టు రిజిస్ట్రార్ (ప్రోటోకాల్) జస్టిస్ ఎవి రాఘవస్వామి కుటుంబంతో కలసి వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## వరుస సెలవులతో తిరుమల భక్తజనసంద్రం

**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవిసెలవులు కావడంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్ణాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్ర నుండి తరలి రావడంతో సోమవారం ఉదయానికి తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 10గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఎనిమిది గంటలు సమయం కేటాయిస్తున్నారు. గత వారంరోజుల నుండి తిరుమలలో విపరీతంగా భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## శ్రీవారి భక్తులకు పటిష్ట భద్రత

### రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి పనులు: హోంమంత్రి అనిత



**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీస్‌శాఖ అన్ని విధాలా భద్రతను పర్యవేక్షిస్తూ భక్తుల భద్రతే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రాష్ట్ర అభివృద్ధికి శ్రీవారి ఆశీస్సులు కలగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్‌కు మరింత శక్తిని ప్రసాదించాలని వేడుకున్నానన్నారు. సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన హోంమంత్రి అనిత ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఉదయంవేళ కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనంతో మనసు ఉల్లాసంగా ఉందన్నారు.



## గోవిందరాజస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా

## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో సోమవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 23 నుండి 31వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు సంప్రదాయబద్ధంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. గోవిందరాజస్వామి సన్నిధితో పాటు పార్థసారథి స్వామిసన్నిధి, ఆండాళ్ అమ్మ ఆలయం, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, పుండరీకవల్లి అమ్మ ఆలయ ప్రాంగణాలను పవిత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తి పరిమళాలతో నిండిపోయింది. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ వి.ఆర్. శాంతి, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఆలయ ఏఇఒ ఏబీ నారాయణ చౌదరి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రంజిత్, అర్చక బృందం పాల్గొన్నారు.

# బుల్లెట్ వేగంతో రాయల్ ఎన్ ఫీల్డ్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు

● సింఎంతో రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధుల భేటీ ● బుల్లెట్ వాహన మోడళ్లను పరిశీలించిన చంద్రబాబు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** బుల్లెట్ వేగంతో రాష్ట్రంలో రాయల్ ఎన్ ఫీల్డ్ ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఏర్పాటు చేయనున్న రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రాజెక్టును 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని సీఎం వెల్లడించారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సిఇఒ గోవింద రాజన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్ కు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ (ప్రోత్సాహకాలను కల్పించడంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండర్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తామని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల మోటార్ సైకిళ్ల ఉత్పత్తి చేయనున్నట్టు రాయల్



ఎన్ ఫీల్డ్ సిఇఒ గోవిందరాజన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. త్వరలో ఫ్లైయింగ్ ఫ్లీ సీ6 పేరిట ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా తీసుకురానున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌లో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. సౌర, పవన విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ప్రాజెక్టుల గురించి వారికి తెలియచేశారు. అనంతరం రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రతినిధులు సిఎంకు బుల్లెట్ 350 మినియేచర్ మోడల్‌ను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా బుల్లెట్ 350 మోటార్ సైకిళ్లకు సంబంధించిన మోడళ్లను సిఎం పరిశీలించారు. హెల్మెట్ ధరించి చంద్రబాబు బుల్లెట్ ఎక్కారు.

## భాకరాపేట ఘాట్‌లో ఏనుగుల గుంపు

### గంటపాటుగా స్తంభించిన రాకపోకలు

**చంద్రగిరి, మే 18 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం భాకరాపేట కనుమ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు సంచారంతో సుమారు గంటపాటు రాకపోకలు స్తంభించాయి. అటవీశాఖ అధికారులు ఏనుగులను అటవీ ప్రాంతంలోకే తరిమేందుకు బాణాసంచా పేల్చినప్పటికీ ససేమిరా అంటూ మొరాయించాయి. చివరకు రోడ్డు దాటుకుని ఏనుగుల గుంపు వెళ్ళడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అందులో రెండు అంబులెన్సులు ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చాలని ఎమ్మెల్యే పులివర్తి నాని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశంతో అటవీ, పోలీసు శాఖ అధికారులు ఏనుగులను రహదారిపై నుండి దట్టమైన అటవీ ప్రాంతంలోకి తరిమేసి రాకపోకలను క్రమబద్ధీకరించారు. అటవీ శాఖ



ఉన్నతాధికారులను అప్రమత్తం చేసి రాత్రిపూట ప్రయాణికులకు, వాహన చోదకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కొద్దిరోజుల పాటు గస్తీ నిర్వహించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. రాత్రివేళలో భాకరాపేట ఘాట్‌లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని అటవీశాఖ అధికారులు సూచించారు.




# ఖైదీల్లో పరివర్తన తీసుకువస్తాం

● తప్పుచేసి మళ్ళీ అదే తప్పుచేయకుండా నిఘా

● జైళ్ల శాఖలో ప్రక్షాళన ● తిరుపతిలో హోం మంత్రి అనిత

**తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు ఉన్నాయని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. రాష్ట్రంలో అనేక రకాల సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించ దానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నా యన్నారు. తిరుపతి సబ్‌జైల్‌ను జిల్లా జైలుగా రూపుదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావడం కోసమే జైళ్లు అని చెప్పుకొచ్చారు. తిరుపతిలోని స్పెషల్ సబ్ జైల్ విస్తీర్ణం తక్కువగా ఉందని.. ఖైదీల సంఖ్య 120 మంది ఉండాల్సిం ఉన్నా సామర్థ్యానికి మించి 140 మంది ఉన్నట్లుగా తెలిపారు. సబ్ జైల్ ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉన్నట్లు జైలు అధికారులు చెప్పారన్నారు. దీన్ని విస్తరించాలా లేక మరోచోట నిర్మాణం చేయాలా అనేది పరిశీలిస్తామని ఆమె తెలిపారు. సోమవారం తిరుపతి న్యాయస్థానాల సముదాయం ప్రాంగణంలోని స్పెషల్ సబ్ జైల్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం సబ్ జైల్‌కు వెళ్లిన మంత్రి జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల భద్రత తమ బాధ్యత అని, ఖైదీల్లో కూడా పరివర్తన రావాలని హోంమంత్రి అన్నారు. రాష్ట్రంలో సంచలనమైన కేసులను త్వరితగతిన విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు పనిచేస్తున్నాయన్నారు. అవసరమైతే మరిన్ని ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. జైల్ సిబ్బంది, పోలీసులు వేరన్నారు. ఖైదీల్లో పరివర్తన కోసం జైల్ సిబ్బంది వారికి దగ్గరగా ఉంటూ, మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. జైల్ నుంచి పెరోల్‌పై వచ్చే వారిపై కూడా నిఘా ఉంచుతున్నామన్నారు. జైళ్ల శాఖలో ప్రక్షాళన చేపడతామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ద్వారా పోలీసు, ఫైర్, జైల్ శాఖల్లో ఖాళీలు భర్తీ చేస్తున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని సబ్ జైల్‌కు వెళ్లి తనిఖీ చేశారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న వసతులను గురించి జైల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైలు ప్రస్తుత విస్తీర్ణం 70 సెంట్లుగా ఉందని, దీన్ని విస్తరించడమా లేక మరింత విశాలంగా నూతన భవనాలు నిర్మించడమనేది ఆలోచన చేస్తామన్నారు. అంతకుముందు ఆమె ఖైదీలతో ముచ్చటించి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. హోంమంత్రి అనిత వెంట తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, జైల్ సూపరింటెండెంట్ గురుశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# అలిపిరి వద్ద రూ.500 కోట్లతో భారీ టౌన్‌షిప్!

## ఇక అక్కడ నుండే సకల సేవలు

**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంకొండల్లో తిరుమలక్షేత్రాన్ని పర్యావరణం పరిరక్షణతోబాటు కాలుష్య నియంత్రణలో భాగంగా పెట్రోల్,డీజిల్‌తో నడిచే వాహనాలకు బ్రేకప్ ఇవ్వాలనే ఆలోచనతో టిటిడి అడుగులేస్తోంది. ఇందుకు రవాణాశాఖ, పోలీస్ శాఖ సహకారం తీసుకుని పూర్తిగా విద్యుత్‌తో నడిచే వాహనాలను తిరుమలకు అనుమతించాలనే చర్చ మొదలైంది. దీనివల్ల తిరుమల ఘాట్‌రోడ్లపై కాలుష్య శాతాన్ని భారీగా తగ్గించవచ్చునేది ఆలోచన. ఇందుకు అలిపిరి వద్ద సుమారు రూ.500 కోట్ల వ్యయంతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం చేసే దిశగా కసరత్తు మొదలుపెట్టింది. తిరుమలను నో హారన్ జోన్‌గా తీర్చిదిద్దడంతో బాటు శబ్ద కాలుష్యాన్ని 80శాతం తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందించారు. తిరుమలలో రూ.100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునికీకరణ, ఏఐ ఆధారిత రద్దీనియంత్రణ అమలుచేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 8వేల వరకు వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందనేది పర్యావరణశాస్త్రవేత్తల ఆందోళన, విద్యుత్‌తో నడిచే వాహనాలకు టోల్ ఫీజు కూడా మినహాయింపు ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నారు. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో అలిపిరి వద్దే వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. భక్తులకు దర్శనాలను మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చేందుకు చూస్తున్నారు.



అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటైతే అక్కడే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటుకు నిర్ణయించారు. దేశంలోని అనేక ప్రాంతాలనుండి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ప్రతి రోజూ లక్షమందివరకు భక్తులు వస్తున్నారు. కొండపై 50వేలమంది భక్తులు రద్దీ పెరిగితే వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు నిండి పోయి వెలుపలకు క్యూలైన్లు విస్తరిస్తున్నాయి. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 18గంటల సమయం పడుతోంది. దీంతో రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నాయ చర్యలు, నిర్ణయాలు తీసుకుంటోంది. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటులోకి తీసుకువస్తే సుమారు 30వేలమంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌలిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో టౌన్‌షిప్ ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నారు. సాధారణ రోజుల్లోనే తిరుమలకు 80వేల మంది నుండి 90వేల మంది వరకు భక్తులు చేరుకుంటు న్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాల్లో, విశేషమైన ఉత్సవాల రోజుల్లో 1.20లక్షల మంది వరకు కూడా భక్తులు తిరుమలకు వస్తున్నారు. అలిపిరి పాత చెక్‌పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని శిల్పకళాశాల ప్రాంతంలో ఈ బేస్ క్యాంపు ఏర్పాటుకు స్థలాల పరిశీలన జరిగింది. భక్తులకు సంతోషకరమైన దర్శనంతోబాటు సంతృప్తికర వసతి కల్పించేం దుకు బేస్‌క్యాంపు ప్రధానంగా నిలవనుంది. దేశంలోని పల ప్రాంతాల నుండి తిరుపతికి చేరు కునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనా లను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమలకు వాహనాలు కాలుష్యం, పర్యావరణ పరిరక్షణకు మార్గం సులభమవుతుందని భావిస్తున్నారు. అలిపిరి నుండి భక్తులను ఆర్టీసి విద్యుత్ బస్సుల ద్వారా తిరుమలకు చేరవేయచ్చునేది ప్రధాన ఉద్దేశ్యం కూడా.

# జూన్ 5న అంకురార్పణతో కార్వేటినగరం వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడికి అనుబంధంగా ఉన్న చిత్తూరుజిల్లా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని కార్వేటినగరంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. జూన్ 5వ తేదీ సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జూన్ 02న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడుతారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 7:30 గంటల నుండి 9:30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. జూన్ 6వతేదీ ధ్వజారోహణం (ఉదయం 8:10 నుండి 8:45 వరకు కర్కాటక లగ్నం), రాత్రి పెద్దశేష వాహనం, జూన్ 7న ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం, జూన్ 8న ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరి వాహనం, జూన్ 9న ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి సర్వ భూపాల వాహనం, జూన్ 10వతేదీ ఉదయం మోహినీ అవతారం, రాత్రి మహాగరుడ వాహనం, జూన్ 11న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం, జూన్ 12న ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, జూన్ 13న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, జూన్ 14న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన జూన్ 9న స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 300 రూపాయలు చెల్లించి గృహస్తులు (ఇద్దరు) ఈ సేవలో పాల్గొనవచ్చు. పాల్గొనే గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం ప్రసాదంగా అందజేయనున్నారు. కాగా జూన్ 15వ తేదీ మధ్యాహ్నం 1:30 నుండి 4 గంటల వరకు పుష్పయాగం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించనున్నారు.

## ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యుల నియామకం

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాలతో మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం అమలు చేసింది. ఎపి ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఎన్ఆర్‌పి రెడ్డి, విజయభాస్కర్, నరేంద్ర, రాంబాబు, సుబ్బరామ గుప్తా, కళ్యాణ చక్రవర్తి, ప్రసాదరెడ్డి కుసుమకుమారి, దగ్గుపాటి శ్రీహరిరావులు నియమితులయ్యారు.

## ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయం: సీఎం

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో 89.4 శాతం అటవీ విస్తీర్ణం సాధించిన తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. శేషాచలం అడవుల్లో స్థానిక జాతుల పునరుద్ధరణకు టీటీడీ కృషి చేస్తోందని అన్నారు. అటవీ సంపద పరిరక్షణకు చేపట్టిన చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రకృతిని పవిత్రంగా భావించడం భారతీయ సంప్రదాయమని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ దైవసేవతో సమానమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన తిరుమల అందించాలనే లక్ష్యంతో టీటీడీ చర్యలు చేపట్టిందని తెలిపారు. తిరుమల పర్యావరణ పరిరక్షణలో టీటీడీ చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. శేషాచలం అటవీ సంపద కాపాడటంలో టీటీడీ నిరంతర చర్యలు కొనసాగాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

## ప్రధాని మోడీకి స్వీడన్ పురస్కారం సిఎం చంద్రబాబు అభినందన

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వీడన్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్ ప్రదానం చేసింది. ఈ పురస్కారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రధాని మోదీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రధాని మోదీకి లభించిన ఈ గౌరవం భారతదేశానికి గర్వకారణమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత ప్రతిష్ఠను మరింత పెంచడంలో మోదీ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రభావాన్ని బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. స్వీడన్ ప్రభుత్వం అందించిన రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్ కమాండర్ గ్రాండ్ క్రాస్థ్ పురస్కారం ప్రధాని మోదీకి లభించిన 31వ అంతర్జాతీయ గౌరవమని ప్రస్తావించారు. ఇది వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా భారతదేశానికి లభించిన అంతర్జాతీయ గుర్తింపుగా సీఎం అభివర్ణించారు.ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా వ్యూహాత్మక భాగస్వామ్యాలు, వాణిజ్య సహకారం, సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. భారత్‌ను గ్లోబల్ శక్తిగా నిలబెట్టే దిశగా ప్రధాని తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడంలో, ప్రపంచ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడంలో ప్రధాని మోదీ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు.

## కేరళం సిఎంకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేరళం కొత్త ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కేరళం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వీడీ సతీశన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారందరికీ శుభాకాంక్షలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు.కేరళం నూతన ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. పారదర్శకమైన, ప్రగతిశీలమైన పాలనను అందిస్తూ కేరళం రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. దేవుని సొంత దేశంగా పేరుగాంచిన కేరళం మరింత వృద్ధి, అభివృద్ధి, సుసంపన్నత సాధించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

## సనాతనధర్మాన్ని నిర్వీర్యం చేయలేరు

### విహెచ్‌పి రాష్ట్రకార్యదర్శి తనికెళ్ళ సత్యరవికుమార్



**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** సృష్టి ఉన్నంతవరకు సనాతన ధర్మాన్ని ఎవరూ నిర్వీర్యం చేయలేరని, ఇదీ ధర్మాన్ని తెలియజేస్తుందని విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ళ సత్యరవి కుమార్ తెలిపారు. భగవంతుడు ధర్మం, సత్యం అమలుచేస్తున్నాడని, దేవదేవుని దర్శనం చేసుకున్న వారికి సనాతన హిందూ ధర్మం గురించి అవగాహన ఉంటుందన్నారు. దేవుడంటే నమ్మలేని వాళ్ళు, సనాతన ధర్మం పట్ల విశ్వాసంలేని వాళ్ళు చేస్తున్న అవాకులుచెవాకులను జనం జాగ్రత్తతో గమనించాలన్నారు. హైందవ ధర్మాన్ని ఆ భగవంతుడే కాపాడుతాడని తనికెళ్ళ సత్యరవికుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఆయన స్వామివారి దర్శనానంతరం అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## జ్ఞానమ్మకు వెండి ఉరువులు



జ్ఞాన ప్రసూనాంబ దేవికి వెండి ఉరువులు అందిస్తున్న దృశ్యం

**శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి సోమవారం శ్రీకాళహస్తికి చెందిన భక్తులు రూ.5.28 లక్షల విలువ చేసే వెండి ఉరువులను అందించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇచ్చే విరాళాలకు 80జి ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉండటంతో భక్తులు ముందుకు వచ్చి విరాళాలను అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తికి చెందిన వాసు పుష్పాల అమ్మవారికి రూ.5,28,569ల విలువ కల్గిన వెండి ఉరువులను అందించారు. వాటిని ఆలయ ఇఓ బికె వెంకటేశులుకు అందించారు. ఈ కార్యక్రమాల్లో డిఇఒ శ్రీనివాసులు రెడ్డి, కిషోర్, ఎఇఓ మోహన్, దాతల తరఫున బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ.50 లక్షలు విరాళం

**తిరుమల, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు విరాళాలు అందిస్తున్నారు. సోమవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన స్వాతి ఎస్.వి, సి.ఏ. శ్రీనివాస శాస్త్రి వేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టుకు రూ.50,00,101 లక్షలు విరాళమిచ్చారు. దాతలు తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి విరాళం చెక్కును అందజేశారు.

వార్త


సమస్యలను చేపట్టేవారి శక్తి సామర్థ్యాలపై వాటి పరిష్కారం ఆధారపడి ఉంటుంది.

-వివేకానంద

# కొలువు దీరిన 'కేరళం'

ఎట్టకేలకు కేరళ శాసనసభ కొలువు దీరింది. దాదాపు పది రోజుల పాటు అత్యధిక సీట్లు గెలుపొందిన కాంగ్రెస్ పక్షనేత ఎంపికలో ఎప్పటిలానే కాంగ్రెస్ అధిష్టానం మీనమేషాలు లెక్కిస్తూ తాత్సారం చేసింది. ముఖ్య మంత్రి సీటు కోసం పోటీ పడ్తున్న ముగ్గురు నేతలతో, ఎన్నికైన ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపి చివరాఖరుకు వి.డి సతీశన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వి.డి. సతీశన్, కె.సి వేణుగోపాల్ రమేష్ చెన్నితాల ముగ్గురూ ముగ్గురే. కార్యకర్తల్లోనూ శ్రేణుల్లోని గుర్తింపు ఉన్నవారే. వారి ముగ్గురు పేర్లను సుదీర్ఘ చర్చల ద్వారా ఖరారు చేశారు. దాదాపు పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ కేరళం రాష్ట్రంలో కాంగ్రెస్ పీఠమెక్కబోతున్న తరుణంలో అక్కడ కార్యకర్తలను, ఎన్నికైన ఎమ్మెల్యేలను తీవ్రగందరగోళాన్ని కలుగ చేసి మరీ కాంగ్రెస్ శాసనసభాపక్షనేతను ఎన్నుకొని గద్దెనెక్కించింది. కేరళం రాష్ట్రమంటేనే దేవ భూమిగా చెప్తుంటారు.అక్కడ చదువుకునే వారంతా ఉన్నత విద్యనభ్యసించే విద్యావేత్తలే. ఆకారణం చేతఎన్నికలు జరిగినప్పుడల్లా ఓటర్లు తమముందున్న సమస్యలు, పాలనవంటి అంశాలపై విశ్లేషణలు సాగుతూనేఉంటాయి. అలాంటి చర్చ నేపథ్యంలోనే కేరళంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్, సిపిఎం నేతృత్వంలోనే ఎల్‌డిఎఫ్‌లు ప్రతి ఐదేళ్లకు ప్రభుత్వాలు మారతాయి. సోమవారం ఉదయం 10 గంటలకు తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో 20 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు.ఎప్పటిలానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తోందంటే ఎంతోమంది నేతలు కీలక పదవి కోసంముందుకు రావడం ఎన్నికైన ఎమ్మెల్యేల నుండి నాయకత్వం ఎంపికలో అసమ్మతి రాగాలు వినిపించడం కార్యకర్తల్లో గందరగోళం ...ఇవన్నీషరామామూలే.అదే కాంగ్రెస్‌సంస్కృతి. ఇలాంటి వన్నీ మున్ముందు రోజుల్లో సజావుగా పరిపాలించడానికి హెచ్చరికలుగా మిగులుతాయి. ఇప్పుడూ అదే జరిగింది. కేరళంను పాలిస్తున్న వామపక్షాలను ప్రజలు ఈసారి ఆశీర్వదించలేదు. ప్రతి ఐదేళ్లకుఒకరి తర్వాత ఒకరుగా అధికారం చేపట్టే ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల ఆనవాయితీ. గతఎన్నికల్లో ఓటర్లు మార్పు చేస్తూ తీర్పు చెప్పారు. ఆ కారణం చేతనే గతసారి వరుసగా రెండోసారి లెఫ్ట్‌డెమొక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వ పాలనను కొనసాగించింది. మూడోసారి వామపక్ష పాలనను వ్యతిరేకించి కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు అవకాశమిచ్చింది. ఎల్‌డిఎఫ్‌కు 'హ్యాట్రిక్' కొట్టే అవకాశం ఇవ్వలేదు. ఈసారి ముఖ్యమంత్రి పీఠమెక్కాలని తహతహలాడిన ముగ్గురులో సతీశన్‌కు స్థానికంగా పలుకుబడి ఉంది. మంచినేతగా గుర్తింపు ఉంది. గత ఎల్‌డిఎఫ్ హయాంలో సతీశన్ శాసనసభలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. పార్టీ శ్రేణుల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల అభిమానం ఆదరణ పొందే విషయంలో పూర్తిస్థాయి నేతృత్వం వహించారు. దాని ఫలితమే కాంగ్రెస్ పట్టానికి ఆస్కారమిచ్చింది.ఆవిధంగా సతీశన్‌కు పార్టీలో నాయకత్వపటిమ ఉన్న నేతగా ఎంతో క్రేజ్‌ఉంది. 1990లో రమేష్ చెన్నితాల తన తొలి రాజకీయ అడుగే యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేరన్న పేరు ప్రఖ్యాతులున్నాయి. మూడోవ్యక్తి ఎఐసిసి నేతకెసి వేణుగోపాల్‌కు అధిష్టానం వద్ద, అగ్రనేతల వద్ద పలుకుబడి ఉంది.అయినా సతీశన్ విషయంలో లొంగి రాక తప్పలేదు.వేణుగోపాల్ జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను ఏకతాటి మీద నడిపించగల శక్తిఉన్న నేత. వార్ధక్యం రీత్యా రమేష్ చెన్నితాల వెనుకబడ్డారు. సిఎంగా సతీశన్ ఎంపిక వెనుక యుడిఎఫ్ ప్రధాన భాగస్వామి ఐయుఎంఎల్ ఒత్తిడి ఉన్నట్లు చెబుతారు. ఏమయితేనేం కాంగ్రెస్ పార్టీ మళ్లీ తన పునర్వైభవాన్ని సంపాదించుకుని పీఠమెక్కింది. సతీశన్ తన రాజకీయ ప్రత్యర్థి పోటీదారుకు అత్యంత కీలకమైన హోంశాఖను ఇవ్వడంవిశేషం. సాధారణంగా హోంమంత్రిత్వశాఖను ముఖ్యమంత్రి తన వద్దనే ఉంచుకుంటారు. లేదా అత్యంత వీరవిధేయులకే దానిని అప్పగించడాన్ని అనుసరిస్తారు. పదేళ్ల తరువాత కేరళం ప్రజలకు సుపరిపాలన అందించడానికే కాంగ్రెస్‌నేతలంతా కంకణబద్ధులై ఉన్నట్లు కేరళప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. మిత్రపక్షలైన ఐయుఎంఎల్, కేరళ కాంగ్రెస్, కేరళ కాంగ్రెస్ (జాకబ్), ఆర్‌ఎస్‌పి నేతలు ప్రభుత్వంలో చేరారు. సతీశన్ కేరళ రాష్ట్రం పేరు 'కేరళం'గా మార్చాక పదవీ స్వీకారంచేసిన తొలిముఖ్యమంత్రి. రాష్ట్రంభౌగోళిక స్వరూపం, అసెంబ్లీ అంతాఒకటే అయినా పేరు మార్చుకుంది. అదొక్కటే తేడా. మామూలుగానైతే కేరళ 13వ శాసనసభకు ఆయన అధికార పగ్గాలు చేపట్టారన్నమాట. కేరళంలో కాంగ్రెస్ అస్తిత్వం కాపాడుకోవడమే ప్రధానోద్దేశంగా ఆదిలోనే సాహసానికి అధిష్టానం పూనుకుందని తొలి అడుగులోనే అర్థమవుతుంది. ఎఐసిసి నేత, ఎంపి కెసి వేణుగోపాల్‌ను రాష్ట్రానికి పంపితే రాజకీయ వ్యూహకర్త కోసం మళ్లీ 'టార్చిలైట్' పెట్టి వెతుక్కోవాల్సిందే. గతంలో అహ్మద్‌పటేల్ స్థానాన్ని ఈయనే భర్తీ చేశారు. రమేష్ చెన్నితాల వృద్ధనాయకుడు.ఈ రీత్యా యువతలో మంచి పేరున్న సతీశన్ ఒక్కరే కేరళ రాష్ట్రాన్ని కుదిపేసిన గోల్డ్ స్మగ్లింగ్ కేసు లైఫ్ మిషన్‌స్కామ్, ఎఐకెమెరాల కొనుగోలులో అవకతవకలపై వామపక్షాలపై ఎక్కుపెట్టిన ఆరోపణలే ప్రజల్లో వామపక్ష ప్రభుత్వంపై ఏవగింపు కలిగేందుకు ఉపయోగపడింది.నిన్నమొన్నటివరకు కేరళలో వామపక్ష పాలనలో అవినీతి పేరుకుపోయిందన్న ఆరోపణల నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు కోసం సతీశన్ అవిరామ పోరాటం సాగించారన్న కీర్తిగడించారు. అయితే వామపక్షాల పాలనలో ప్రాభవం కోల్పోయిన 'కేరళం'ను ముఖ్యమంత్రిగాతన చాణక్యంతో మరో స్థాయికి తీసుకెళ్లగలరని ఆశిద్దాం.

మిక్కిలి ధనంగానీ, గొప్ప విద్య కానీ, గొప్ప అధికారం కానీ పొందినప్పటికీ గర్వం లేక ఏ వ్యక్తి ప్రవర్తిస్తాడో అతడే పండితుడు.



ప్లినీ

మిమ్మల్ని ప్రతి దానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గమనించాలి.



అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### అతివేగం అనర్థదాయకం

పెరుగుతున్న వాహనాల సంఖ్య, మితిమీరిన వేగం కారణంగా నేడు రోడ్డుప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఎందరో ప్రాణాలు కోల్పోవడమే కాకుండా, అనేక కుటుంబాలు వీధిన పడుతున్నాయి. రోడ్లను ప్రమాదరహితంగా మార్చడం అనేది కేవలం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి కర్తవ్యం. రహదారి భద్రత విషయంలోనిర్లక్ష్యం వహించడం వల్లకలిగే పరిణామాలు అత్యంత భయంకరంగా ఉంటున్నాయి. ప్రమాదాల నివారణకు రహదారుల రూపకల్పనలో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి.గుంతలమయమైన రోడ్లను వెంటనే మరమ్మతు చేయడం ద్వారా చాలా ప్రమాదాలను నివారించవచ్చు. అలాగే, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠినమైన జరిమానాలు, చట్టపరమైన చర్యలుతీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపట్ల మినహాయింపు ఉండకూడదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రులను గౌరవిద్దాం

నేటి రోజుల్లో యువత, పెద్ద చిన్న అనే తేడా లేకుండా స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోయి స్నేహితుల మోజులో పడి తల్లిదండ్రులు చెప్పింది వినకుండా కనీస గౌరవం ఇవ్వకుండా ఆమడ దూరం పెడుతున్న సంఘటనలు ఎన్నో చూస్తున్నాం. సమయం దొరికినప్పుడు వాళ్ళతో గడుపుతూ నిత్యం వారికి ఆసరాగా నిలుస్తూ వల్ల భవిష్యత్ ఆరోగ్య, జీవితంపట్ల శ్రద్ధ తీసుకుంటే చాలు తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఆసరాగా ఉందాం.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### కలిసివుంటే కలదు సుఖం

ఒకప్పుడు ఎక్కడ చూసినా ఉమ్మడి కుటుంబాలు కళకళాడుతుండేవి.అన్ని వయస్సులవారి ఆప్యాయతలు బాల్యం నుంచి అందుతూ ఎదుగుదల హాయిగా సాగేది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటూ, ఐకమత్యమే గొప్పబలం అని చాటిచెప్పేవారు. ఇళ్లతోపాటు మనస్సు కూడావిశాలంగాఉండేది.ముఖ్యంగా భార్యాభర్తల బంధం గట్టి పునాదిఅంటే అతిశయోక్తికాదు. రిలేషన్స్‌లో ఉక్కులా ఉండే ఆత్మవిశ్వాసం మెండుగా ఉంటుంది. కాలక్రమేణా సమష్టి కుటుంబాలు చాలా వరకు తగ్గిపోయాయి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### ఆచరణ ముఖ్యం

మధ్యతరగతి వారు పెట్టుబడులు బంగారంపై పెట్టవద్దని ప్రధాని మోడీజీ అనడం, పిల్లల్ని కనండి మీకు డబ్బులు ఇస్తాను అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టితో చెప్పినా సామాన్యుడు చెవికి చేరదు. వాళ్లని ఎడ్యుకేట్ చేయకుండా చెప్పడం, మానసికంగా ప్రిపేర్ చేయకుండా చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. ఏది రైట్? ఏది రాంగ్? చెప్పవలసిన బాధ్యత ఎల్లవేళలా ప్రభుత్వ ఉపాధ్యాయుల పైన ఉన్నది. కానీ నేటి తరం ఉపాధ్యాయులు వాళ్ల పిల్లలను వాళ్ల కన్నా తక్కువ స్థాయి ఉన్న వాళ్ళ వద్ద చదివిస్తూ మీ పిల్లలను మా వద్దకు పంపండి అని అడగడంలా అనిపిస్తూ ఉంది. ఆచరించని వారికి చెప్పే అర్హత ఉండదు. ప్రధాని మోడీజీ ఆగర్భ శ్రీమంతుడు పుట్టుకతోనే గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన పండిట్ జవహర్లాల్ నెహ్రూజీ కంటే ఎక్కువ రిచ్నెస్ అనుభవిస్తూ ఉన్నారు. నారా చంద్రబాబునాయుడు ఆయన పిల్లల్ని కనవద్దని చెబుతున్నారు. నిజానికి సమస్య గ్రామాలలో యువతీ యువకులు ఉండడం లేదు, గ్రామాలలోనే పిల్లల పుట్టించడానికి పుట్టడానికి అవకాశాలు ఎక్కువ.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### మితిమీరుతున్న హిజ్రాల ఆగడాలు

హిజ్రాలఆగడాలురోజురోజుకు శ్రుతిమించిపోతున్నాయి. రోడ్డుపై వీరిని చూడగానే బెంబేలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు డబ్బు కోసం వీరి వేధింపులు ఆగడం లేదు. ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుభకార్యాల వద్దకు వచ్చి అడిగినంత డబ్బు ఇవ్వకపోతే అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. అసభ్యకర ప్రవర్తన, భూతులు మాట్లాడుతూ వారిని కించపరుస్తూ రచ్చరచ్చ చేస్తున్నారు. వీరిబారి నుండిఎలా తప్పించుకోవాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు. హిజ్రాలందరూ ఆరోగ్యంగానే ఉన్నారు. కష్టపడి పనిచేసుకోవడానికి ఎన్నో మార్గాలున్నాయి. ఇలా ప్రజలను వేధించడం ఎందుకు?

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పగటి కలలు మాని రాష్ట్ర అభివృద్ధి పై దృష్టి సారించాలి. మళ్ళీ ముఖ్యమంత్రి కావడం ప్రజల నిర్ణయం పై ఆధారపడి ఉంటుంది. ముందు నిరుద్యోగుల, రైతులు, కార్మికులు, విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే బాగుంటుంది. ప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుంది.

-బూర్గుపల్లి కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు

మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అడకత్తెరలో ప్రపంచ భవిష్యత్తు!

**గల్ఫ్ దేశాలు తమ చమురు నిల్వలను ఏవిధంగా కాపాడుకోవాలో తెలియని ఏమరుపాటుతో ఇతర దేశాల మీద ఆధారపడటం వల్ల ఇంతటి దారుణ పరిస్థితులు పశ్చిమాసియా దేశాలకే కాదు ప్రపంచ దేశాలన్నిటికీ అలుముకున్నాయి. బాలెన్స్ ఆఫ్ పవర్ చిన్నాభిన్నమై స్వతంత్ర నిర్ణయాలతో భవిష్యత్తు కాపాడే ప్రపంచ నాయకులు కరువు కావటంతో పాటు అస్తవ్యస్త పరిస్థితులలో ఫంక్షన్ చేస్తున్న యు.ఎన్ చివరకు కారణాలుగా మిగిలాయి. బలమైన యు.ఎన్ ఏర్పాటు చేయగలుగుతే కొంతలో భద్రత ఏర్పడుతుందో, మూడవ ప్రపంచ యుద్ధంతో భవిష్యత్తు ఏ రూపుదిద్దుకుంటుందో ఊహలకు అందటం లేదు.**



రావులపాటి సీతారాంరావు

పల్లెటూళ్లల్లో తగాదాలు వస్తే కొందరు పెద్ద మనుషులు రచ్చబండ వద్ద కూర్చొని తగాదాలను జాగ్రత్తగా పరిష్కరించటం ఇంతకు మునుపు జరుగుతుండేది. ఈ ఆధునిక యుగంలో అటువంటి కట్టుబాట్లతో కూడిన సమాజం కనుమరుగవటం వల్ల ఇప్పుడు పల్లెలు టౌన్‌లుగా మారుతున్నవేళ అలాంటి పద్ధతులూ పరిష్కారాలు అవుట్‌డేటెడ్‌అయ్యాయి. అంటే కాలం చెల్లిన పద్ధతులుగా మారాయి.అధికార పక్షానికి విపక్షాలకూ అభిప్రాయభేదాలు ఈ ప్రజాస్వామ్యంలో ఉండక తప్పదు. అందరూ హర్షించే విషయమే. విభిన్న దృక్పథాలు వెలుగులోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రజాస్వామ్యవాదులు నమ్మేవారు. అంతకు తగ్గట్లు రాజకీయ నాయకులలో కొందరు రాజనీతిజ్ఞులుగా వ్యవహరించేవారు కనుక ఇరుపక్షాలూ, తరతమ భేదం లేకుండా వారి మాటవిని అసెంబ్లీని పార్లమెంటును కానీ, చేపల మార్కెట్‌గా మార్చకపోయేవారు. అధికారంలో ఉన్న వారూ లేనివారూ ప్రజలకు మేలు చేయాలనే ప్రాథమిక అవగాహనతో పనిచేసే వారు కాబట్టి గత కాలంలో విభేదాలున్నా వీధి పోరాటాలుగా మారకపోయేవి. పట్టు విడుపులు ఆ రోజుల్లో రాజకీయ నాయకులు ప్రదర్శించేవారు. ఇప్పుడు అలాంటి పద్ధతులకూ కాలం చెల్లింది. అధికారపక్షంలో ఉన్న వారికి ప్రతిపక్షాలలోని మనుషులు మనుషులే కానట్లుగా వారిని కించపరచ్చే ధోరణి అలవాటుగా మారింది. ప్రతిపక్షాలూ మీరు తమలపాకుతో తడితే మేము తలుపు చెక్కలతో కొట్తాం అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు రాజ'కీ'యులు ఉన్నారు కానీ రాజకీయ నీతిజ్ఞులు కరువయ్యారు. 'యధారాజా తథాప్రజా' అన్నట్లు రాజకీయ కార్యకర్తలు మారుతున్నారు. ప్రజలు మాత్రం రాజకీయాల వింత ధోరణులకు అలవాటుపడుతూ వారి వారి స్వలాభం చూసుకుంటున్నా ఎన్నికలప్పుడు ప్రలోభాలకు తావిచ్చినా అసలు సమయంలో డబ్బాలో ఓటు వేసే విషయంలో మాత్రం ఎవరిని గెలిపించాలో వారినే గెలిపిస్తున్నారు.గెలిచినవారు ఓడినవారు యుగధర్మాన్ని అనుసరించి ప్రవర్తిస్తుండటంతో ఓటర్లు మళ్లీ ఎన్నికల కోసం ఎదురుచూడడం వినా వేరు మార్గాలు లేక వారి జీవితాలు వారు గడుపుతున్నారు. భారతదేశంలో ప్రజాస్వామ్య పాలన వెలుగులు విరజిమ్ముతూ నడవటం లేదు కానీ,ప్రజాస్వామ్యం కాపాడుకోవడానికి కావల్సినంత వెలుగు ఇంకా ఉండి మార్గం కనపడుతుండడంతో ముందుకాలంలో మంచి జరగొచ్చేమో అన్న ఆశావాదంతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. అందుకే భారత్‌లోని ప్రజాస్వామ్య పాలన చెదరకుండా ఉందని ఇతర దేశస్థులు నమ్ముతున్నారు. ప్రస్తుతం పాలకుల మీద కాదు ప్రజల మీద ఉంది బాధ్యత. పాలకులు ఆ ప్రధానమైన బాధ్యత దాదాపు విస్మరించిన పరిస్థితులున్నాయి కాబట్టి. అసలు విషయానికి వస్తే దేశాలు రాజ్యాం గాలను తమ శ్రేయస్సుకోసం నిర్మించుకున్నట్లే ప్రపంచ యుద్ధాల తర్వాత యుద్ధాల వాతావరణాన్ని అవసరమైతే తప్పు చేస్తున్న దేశాలను అదుపులో ఉంచటమే కాకుండా పరిష్కార దిశగా విభేదాలను సమిసిపోయేట్లు చేయడానికి మొదట్లో 'లీగ్ ఆఫ్ నేషన్స్' తర్వాత'యునైటెడ్



నేషన్స్ ఆర్గనైజేషన్'ను ప్రపంచ దేశాలు తమ శ్రేయస్సు కోసం నిర్మించుకున్నారు. యుద్ధాలు నివారించడానికి నిజానికి కార్యచరణలో బాలెన్స్ ఆఫ్ పవర్‌ను సమతూకంగా ఉంచుతూ అమెరికా నేతృత్వంలో రష్యా నాయకత్వంలో దాదాపు ప్రపంచంలోని ఎక్కువగా దేశాలు విడిపోయినట్లుగా జతకట్టి చీటికీమాటికి కాలుదువ్వుతున్న పరిస్థితులలో అలీన దేశాలు (నాన్ అలైన్‌డ్ కంట్రీస్) భారతదేశ నాయకత్వంలో (బయటకు ప్రకటించకపోయినా) ఒక జట్టుగా ఏర్పడి రెండు వర్గాల ప్రోద్బలంతో కొన్ని దేశాలు యుద్ధాలకు దిగుతున్నప్పుడు యుఎన్ఓల సహకారంతో నివారణకు విజయవంతంగా పూనుకొనేవి. అంతకుమునుపే 1815-1839లో చేసుకున్న స్పెషల్ ట్రీటీస్ స్విట్జర్లాండ్‌కు ఎక్కువ రక్షణ, బెల్జియంకు తక్కువ రక్షణ కల్పించారు. హేగ్ కన్వెన్షన్-3 (1907) ప్రకారం యుద్ధం ప్రకటించడానికి ముందు ఒక అల్టిమేటం లాంటిది ఇవ్వాలని నిర్ణయించింది. యు.ఎన్.ఓ మీద ఎన్నో ఆశలు ప్రపంచ శాంతి కోసం పెట్టుకున్నా ఆశలు దాదాపు అడియాసలుగా మారాయి. అనేక నిబంధనలతో నిర్వీర్యతను పుణికిపుచ్చుకున్న ప్రపంచ సంస్థగా మారిందని విమర్శకులు తీవ్రంగా యుఎన్ఓ పనితనాన్ని దుయ్యబట్టున్నారు. యు.ఎన్ నిబంధనలు పరస్పర విరుద్ధంగా ఉండటం ప్రత్యక్షంగా చూస్తున్నాం. యుఎన్ ఆర్టికల్ 2(4) ప్రకారం యూజ్ ఆఫ్ ఫోర్స్ చేస్తామని బెదరించటం ఫోర్స్ ఉపయోగించటం సార్వభౌమాధికారాన్ని రాజకీయంగా రాజ్యం స్వాతంత్ర్యం కాపాడుకోవడానికి,తమ భూభాగాలను కాపాడకోటానికి చెల్లదు. అయితే ఆర్టికల్ 51 ఇందుకు విరుద్ధంగా సెల్ఫ్ డిఫెన్స్‌కోసం ఆర్మ్‌డ్ ఎటాక్ చెల్లుతుంది. స్పష్టత లేని ఈ అంశాలు యు.ఎన్ పెద్దలను ఎప్పుడూ ఇబ్బంది పెడుతూనే ఉంటాయి.అలాగే సమిష్టి రక్షణ ఒప్పందాలు (నాటో లాంటి వాలుకి) యు.ఎన్ ఆర్టికల్ 53, క్లాజు 5 ప్రకారం తమలోని ఏదేశమైనా ఎటాక్ కాబడ్డప్పుడు ఆదేశ రక్షణలో తాము కూడా యుద్ధంలో పాల్గొనవచ్చు. అందుకనే నిన్నగాక మొన్న అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్ నాటో దేశాల సభ్యులు తనతో చేతులు కలపనందుకు బహిరంగంగా దుయ్యబట్టాడు. ఇలాంటి లొసుగులతో యు.ఎన్ అస్తిత్వం కనపడకుండా పోయింది.అందుకనే తమతో కలిసివచ్చే దేశాలతో, కొన్ని గల్ఫ్ దేశాలతోసహా ఇంటర్‌నేషనల్ కౌన్సిల్‌ను అమెరికా నాయకత్వం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు కన్పడుతున్నది. అంతకుమునుపు యుద్ధాలు జరగడం, ఒడంబడికలు చేసుకోవటం వరకే ఈ జనరేషన్ వారికి తెలుసుకానీ యు.ఎన్.ఓ ఏ పరిస్థితులలో యుద్ధ వాతావరణాన్ని నివారించగలదు?అసలు అమెరికా, రష్యా, చైనాలు, సెక్యూ రిటీ కౌన్సిల్‌లో తమకు ఉన్న వీటో పవర్‌ను వినియోగించు కొని అయినవారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో సామెత మాదిరి అధికార దుర్వినియోగం ఏ విధంగా చేస్తున్నాయో ప్రపంచ దేశాలకు అవగతమవుతున్నది. కానీ స్వతంత్రంగా బిగ్ పవర్స్ ముందు నోరు ఎత్తలేని పరిస్థితిలో ఉన్నారు. రష్యా విడిపోయిన తర్వాత అమెరికాకు హద్దూ అదుపు లేకుండాపోయింది. యు.ఎన్.ఓ నిష్ప్రయోజకత్వం ఇందుకు తోడైంది.పశ్చిమాసియా యుద్ధంలో నిజనిజాలు మరుగున పడ్డాయి. ట్రంప్ సామ్రాజ్యవాద ధోరణితో ఇజ్రాయిల్ తెలివిగా ట్రంప్‌ను ముందుంచి తమ ప్రయోజనం పొందుతుంది. గల్ఫ్‌దేశాలు తమ చమురు నిల్వలను ఏవిధంగా కాపాడుకోవాలో తెలియని ఏమరుపాటుతో ఇతర దేశాల మీద ఆధారపడటంవల్ల ఇంతటి దారుణపరిస్థితులు పశ్చిమాసియా దేశాలకే కాదు ప్రపంచ దేశాలన్నిటికీ అలుముకున్నాయి. బాలెన్స్ ఆఫ్ పవర్ చిన్నాభిన్నమై స్వతంత్ర నిర్ణయాలతో భవిష్యత్తు కాపాడే ప్రపంచ నాయకులు కరువు కావటంతో పాటు అస్తవ్యస్త పరిస్థితులలో ఫంక్షన్ చేస్తున్న యు.యన్ చివరకు కారణాలుగా మిగిలాయి. బలమైన యు.యన్ ఏర్పాటు చేయగలుగుతే కొంతలో భద్రత ఏర్పడుతుందో, మూడవ ప్రపంచ యుద్ధంతో భవిష్యత్తు ఏ రూపు దిద్దుకుంటుందో ఊహలకు అందటం లేదు. ●

# ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారం


బాశెట్టి ప్రమోద్ రాం

ప్రస్తుతం విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై పెరుగుతున్న బోధనేతర పనుల భారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. ఒకవైపు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత, మరోవైపు ప్రభుత్వ పరిపాలనా కార్యక్రమాల అమలు బాధ్యతలు ఈ రెండింటి మధ్య ఉపాధ్యాయులు నలిగిపోతున్నారనే భావన విద్యావర్గాల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా వేసవి సెలవుల సమయంలో ఉపాధ్యాయులను వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిర్దేశిత ఉద్యోగ నియమావళి ప్రకారం ఉపాధ్యాయులకు వేసవి సెలవులు(వెకేషన్ డిపార్ట్మెంట్)గా కేటాయించబడ్డాయి. ఇతర శాఖల ఉద్యోగులతో పోలిస్తే ఉపాధ్యాయులకు తక్కువ ఆర్జిత సెలవులు ఉండటానికి ప్రధాన కారణం వారికి లభించే వేసవి సెలవులే. అదే కారణంతో ప్రభుత్వం వారికి అదనపు సెలవులను నిర్దేశించలేదు. అయితే ఆ సెలవుల కాలంలోనే జనగణన, బడిబాట, సర్వేలు, నమోదు కార్యక్రమాలు, ప్రచార కార్యక్రమాలు వంటి అనేక పనుల్లో ఉపాధ్యాయులను వినియోగించడం వల్ల సెలవుల ఉద్దేశమే నశిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయుడు ఒక విద్యా నిర్మాణ శిల్పి. విద్యార్థులలో జ్ఞానం, క్రమశిక్షణ, విలువలు నాటే బాధ్యత అతనిది. అలాంటి ఉపాధ్యాయుడిని ఇంటింటికి తిరిగి విద్యార్థులను సమీకరించాల్సిన పరిస్థితికి తీసు కురావడం వృత్తి గౌరవానికే భంగం కలిగిస్తోందని పలు వురు భావిస్తున్నారు.విద్యార్థుల నమోదు,ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాల కోసం ప్రత్యేక వింగ్‌లు లేదా కమ్యూ నిటీ మొబిలైజేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.సమాజంలో అవగాహన కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక సంస్థలు, ప్రత్యేక సిబ్బంది బాధ్యత కావాలి గానీ, బోధన బాధ్యతలు నిర్వహించే ఉపాధ్యాయు లపై మొత్తం భారం మోపడం సరైన విధానం కాదనే అభిప్రాయం బలపడుతోంది. ఇటీవల పాఠశాలల బలోపేతం పేరుతో లక్ష్యాలను నిర్దేశించి, విద్యార్థుల సంఖ్య పెంచాలని ఒత్తిడి తీసుకురావడం కూడా ఉపాధ్యాయులపై మానసిక భారాన్ని పెంచుతోంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం అనేది కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదు. మౌలిక వసతులు, నాణ్యమైన బోధన, తల్లిదండ్రుల విశ్వాసం, సామాజిక భాగస్వామ్యం ఇవన్నీ కలిసి వచ్చినప్పుడే ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం అవుతుంది. మరోవైపు, జనగణన వంటి కీలక విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. విధుల్లో నిమగ్నమైనవారితో పాటు, సంబంధం లేని ఉపాధ్యాయులను కూడా బడిబాట వంటి కార్యక్రమాలకు హాజరు కావాలని ఆదేశించడం సముచి తమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఒక ఉపాధ్యాయుడు బోధనకు సిద్ధమవ్వడానికి పాఠ్య ప్రణాళికలు రూపొందించాలి, విద్యార్థుల స్థాయిని అంచనా వేయాలి, బోధన పద్ధతులను మెరుగుపరుచుకోవాలి. అలాంటి సమ యంలో బోధనేతర పనులభారం పెరగడం విద్యానాణ్యత పై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఉపాధ్యాయ వృత్తి అనేది కేవలం ఉద్యోగం కాదు అది సమాజ నిర్మాణానికి మూలాధారం. అలాంటి వృత్తికి గౌరవం కల్పించా లంటే ఉపాధ్యాయులను ప్రధానంగా బోధన కార్యకలా పాలకే పరిమితం చేసే విధానాలు తీసుకురావాలి. ప్రభుత్వ పరిపాలనా కార్య క్రమాల్లో అవసరమైతే పరిమిత స్థాయిలో సహకారం తీసుకోవచ్చు గానీ, నిరంతరం బోధ నేతర పనుల్లో నిమగ్నం చేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశంపై ఉపాధ్యాయులు, ఉపాధ్యా య సంఘాలు, విద్యావేత్తలు, పాలకులు సమగ్రంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. విద్యావ్యవస్థ బలోపేతం కావాలంటే ముందుగా ఉపాధ్యాయుడి పాత్ర, గౌరవం, బాధ్యతలను స్పష్టంగా నిర్వచించి, అతనిని బోధనకే కేంద్రీకరించే దిశగా చర్యలు చేపట్టాల్సిన సమయం ఆసన్నమైంది. ●

# రూపాయి విలువ పడిపోతే ఆర్థిక సంక్షోభం తప్పదా?

డాక్టర్ రామకృష్ణ బండారు

దాదాపు ఏడాది క్రితం ప్రపంచంలో నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిన భారత్‌కు ఆ సంతోషం ఎక్కువకాలం నిలువలేదు. ఈ సంవత్సరం మొదటి త్రైమాసికంలో వచ్చిన ఆర్థిక ప్రతికూల ఫలితాల ప్రభావం వలన భారత్ తన నాల్గవ స్థానాన్ని కోల్పోయింది. ఏప్రిల్ 2026 నాటి 'అంతర్జాతీయ ద్రవ్య నిధి' నివేదికల ప్రకారం, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్లో నాల్గవ స్థానం నుండి 6వ స్థానానికి పడిపోయింది. కరోనా కాలంలో ఏర్పడిన గడ్డు పరిస్థితులను సైతం ఎదుర్కొని దృఢంగా నిలబడిన భారత్‌కు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి వలన ఆర్థిక అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉన్నది. ప్రధాని సైతం దేశ ప్రజలకు మునుముందు ఏర్పడే ఆర్థిక సంక్షోభం పై హెచ్చరికలు చేసారు అంటే పరిస్థితులు అర్థం చేసుకోవచ్చు. ఆర్థికనిపుణులు సైతం భారత్‌కు భవిష్యత్‌లో ఎదురు కాబోయే ప్రమాదాన్ని ఊహించి భయాందోళనలకు గురిఅవుతున్నారు. అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు సైతం ఈ ఏడాదికి భారత్ వృద్ధి అంచనాలు తగ్గిసున్నాయి. ఇటీవల అంతర్జాతీయ రేటింగ్ సంస్థ 'మూడీస్' భారత్ జిడిపి వృద్ధి రేటును 6.8శాతం నుంచి 6శాతానికి తగ్గించింది. భారత్‌కు ఎందుకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది? కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి? అనేవి సామాన్య ప్రజానీకానికి అర్థం కానీ ప్రశ్నలు. మన దేశ ప్రస్తుత పరిస్థితికి కారణం అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ గరిష్ట స్థాయికి పడిపోవడమే. ఈ ఒక్క ఏడాదిలో ఇప్పటివరకు సుమారు 6శాతం వరకు రూపాయి విలువ తగ్గింది. ఈ వారంలో రూపాయి విలువ గరిష్టంగా 96 కు చేరుకుంది. 2021 మే 13న ఒక డాలర్ కు సుమారు 73.44 రూపాయలు ఉండగా ఐదేళ్ల తరువాత అంటే ప్రస్తుతం 96 రూపాయలకు చేరుకుంది. గత ఐదేళ్ళలో సుమారు 22.23 రూపాయల మేర రూపాయి విలువ క్షీణించింది. ఇది సుమారు 30.2 శాతంకు సమానం. డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ ప్రతీ సంవత్సరం తగ్గుతూ వస్తుంది. డాలర్‌తో పోల్చితే 2021 లో రూపాయి విలువ సగటున 73.44 ఉండగా, 2022 లో 77.40, 2023లో 82.20, 2024లో 83.30, 2025 లో 83.50 2026లో 96 చేరుకుంది. అంటే, మును పెన్నడూ లేనంతగా 2026లో రూపాయి విలువ అత్యంత తక్కువకు పడిపోయింది. అయితే రూపాయి విలువ ఎందుకు అంతగా పడిపోతుంది. అనే ప్రశ్న రావొచ్చు. దానికి కారణం, ఇరాన్ అమెరికా మధ్య జరుగుతన్న యుద్ధం. ఈ యుద్ధం కారణంగా, ముడి చమురు ధరలు విపరీతంగా పెరుగుతూన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా, జరిగే ఇంధనం రవాణాలో సుమారు 20శాతం కేవలం 'హార్మోజ్ జలసంధి'నుండే జరుగుతుంది. ఈ మార్గం ఇరాన్ ఆధీనంలో ఉండటం వలన యుద్ధం కారణంగా ఈ మార్గాన్ని ఇరాన్ మూసివేసింది.దీనితో సప్లై చైన్‌కు ఆటంకంకలిగింది. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సప్లై లేకపోవడం వలనప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. కేవలం ముడి చమురు మాత్రమే కాదు, ట్రంప్ పదవి చేప్పటిన నాటి నుండి బంగారం ధర కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో



విపరీతంగా పెరిగింది. ట్రంప్ 'టారీఫ్'ల వలన భవిష్యత్‌లో ఆర్థిక అస్థిరత ఏర్పడుతుంది అనే భయంతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి దారులు, దేశాల రిజర్వ్ బ్యాంకులు బంగారాన్ని ఎక్కువగా కొనుగోలు చేసాయి. ఫలితంగా బంగారం డిమాండ్ పెరిగి అంతర్జాతీయం మార్కెట్‌లో దాని ధరలు మునుపెన్నడూ లేని విధంగా పెరిగాయి. మరి ముడి చమురు, బంగారం ధరలు పెరిగితే మన రూపాయి ఎందుకు పతనమవుతుంది? దానికి కారణం మన దేశానికీ కావలిసిన మొత్తం ముడి చమురు అవసరంలో సుమారు 87 శాతం వరకు ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఇక బంగారం విషయంలో కూడా మన దేశం ఎక్కువగా దిగుమతి మీద ఆధారపడి ఉన్నది. 2024-25 లో 58 బిలియన్ డాలర్ విలువ గలిగిన 757.09 టన్నుల బంగారం దిగుమతి చేసుకోగా, 2025-26 లో 78.98 బిలియన్ డాలర్ల విలువగలిగిన 721.03 టన్నుల బంగారం దిగుమతి చేసుకున్నాము. బంగారం, ముడి చమురు దిగుమతి చేసుకున్నందుకు దిగుమతి దారునికి మన దేశం డాలర్ రూపంలో చెల్లించాలి. డాలర్‌లో చెల్లించాలి అంటే, మన రూపాయిని చెల్లించి డాలర్‌ను అంతర్జాతీయ మార్కెట్‌లో కొనుగోలు చేయాలి. అంటే, డాలర్‌కు డిమాండ్ పెరుగుతుంది. ఎప్పుడైతే, డాలర్ సప్లయ్‌స్థిరంగా ఉంది, దాని డిమాండ్ పెరుగుతుందో అప్పుడు డాలర్ ధర మార్కెట్ లో పెరుగుతుంది. అంటే, ఇంధనం ఒక బారెల్‌కు 106డాలర్ ఉన్నప్పుడు మార్కెట్‌లో ఒక డాలర్ విలువ 83 రూపాయాలు మాత్రమే. అప్పుడు మనం 8,798 రూపాయలు చెల్లించి ఒక బారెల్ కొనేవాళ్ళం. కానీఇప్పుడు అదే 106 డాలరు విలువ ఉన్న ఒక బారెల్‌కు ఒక డాలర్ 96 రూపాయల చొప్పున సుమారు 10,176 రూపాయలు చెల్లించాలి. ఆ అదనపు భారం వలన దేశీయ మార్కెట్ లో ఇంధనం ధరలు పెంచవలసి వస్తుంది. ఒక వేళా ఇంధన ధరలు దేశీయంగా పెంచితే, ఆ ప్రాభవం అన్ని రంగాల మీద పడి ద్రవ్యోల్బణం,ఆర్థిక అనిచ్చితి దారి తీస్తుంది. ఈ అధిక ధరల వల్ల కరెంట్ అకౌంట్ లోటు పెరగడం, విదేశీ మారక నిల్వలు తగ్గడం, ప్రభుత్వ సబ్సిడీలపై ఒత్తిడి పెరగడం వంటి పరోక్ష ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. అందుకే ఇటీవల దేశ ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఇంధనం, బంగారం కొనుగులు తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ప్రస్తుత పరిస్థితులలో విదేశీ మారకపు నిల్వలపై ఒత్తిడి తగ్గేంచేందుకు ప్రభుత్వం, బంగారం వెండి దిగుమతులపై పన్నులను 15 శాతానికి పెంచింది. దీనితో ఆయా వస్తువుల దిగుమతుల వ్యయం పెరగడం వలన దేశీయ మార్కెట్‌లో ధరలు పెరిగి, కొనుగోళ్లు తగ్గుతాయి. ఫలితంగా వాటి దిగుమతులు కూడా తగ్గే అవకాశంఉన్నది. ముడి చమురు తరువాత మనదేశం ఎక్కువగా బంగారం వెండి వస్తువులు దిగుమతి చేసుకుంటుంది. బంగారం, ముడి చమురు,వంట నూనె వినియోగం కనీసం 10 శాతం తగ్గినా సుమారు 45బిలియన్ డాలర్ల వరకు విదేశీ మారక నిల్వలను ఆదాచేయవచ్చని 'ఎనలిస్ట్‌లు' అంచనా వేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ వరకు సుమారు 690.7 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఆర్.బి.ఐ దగ్గర ఉన్నాయి. రూపాయి పతనాన్ని ఆపేందుకు ఆర్.బి.ఐ తన దగ్గరున్న డాలర్లను దిగుమతి దారులకు అమ్ముతుంది. రూపాయి విలువ మరింత తగ్గకుండా ఉండేందుకు ప్రధాని సైతం దేశ ప్రజలకు ఇంధనం, వంట నూనె,బంగారం వంటి వస్తువుల పై ఏడాది పాటు పొదుపు పాటించాలని పిలుపు ఇచ్చారు. ఒక వేళా దిగుమతులు తగ్గకుండా ఇదే పరిస్థితి కొనసాగితే, రాబోయేరోజుల్లో రూపాయి విలువ మరింత పడిపోతుంది. ఫలితంగా ఆర్థిక మందగమనం ఏర్పడుతుంది. ●

**(రచయిత: కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్)**

# బస్తర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం!

### - శాశ్వత శాంతి నెలకొల్పడానికి చర్యలు చేపట్టాం
### - జగదల్‌పూర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**జగదల్‌పూర్, మే 18:** ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌లోని 'అమర్ వాటిక' వద్ద మావోయిజంపై పోరాటంలో ప్రాణాలు అర్పించిన 1,000 మందికి పైగా భద్రతా సిబ్బందికి అమిత్ షా నివాళి అర్పించారు. అమర్ వాటిక వద్ద జరిగిన కార్యక్రమంలో, బిజాపూర్ జిల్లాలో జరిగిన మావోయిస్టు దాడిలో అమరులైన భద్రతా సిబ్బంది కలెంద్ర ప్రసాద్ నాయక్, పవన్ కుమార్ మండవి కుటుంబ సభ్యులను షా కలిశారు. వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర హోం మంత్రి భద్రతా సిబ్బందితో కూడా ముచ్చటించి, వారి ధైర్యాన్ని, అంకితభావాన్ని, నిబద్ధతను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, "బస్తర్ ప్రాంతంలో శాంతి, భద్రత, అభివృద్ధిని నెలకొల్పడంలో మన జవాన్లు చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి. దేశ భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన ఆ ధైర్యవంతులైన సిబ్బంది త్యాగం ఎప్పటికీ వృధా కాదు" అని పేర్కొన్నారు. "శాశ్వత శాంతిని నెలకొల్పడానికి, అభివృద్ధి ఫలాలు చివరి వ్యక్తికి కూడా చేరేలా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి నిబద్ధతతో కృషి చేస్తున్నాయి" అని కేంద్ర హోంమంత్రి వివరించారు. దశాబ్దాల తీవ్రవాద హింస అనంతరం ఇటీవల నక్సల్ రహిత రాష్ట్రంగా ప్రకటించబడిన ఛత్తీస్‌గఢ్‌లో, అభివృద్ధికి సంబంధించిన ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ... కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారంనాడు బస్తర్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో, భద్రతా శిబిరం నుండి ప్రజా సేవా కేంద్రంగా రూపాంతరం చెందిన మొట్టమొదటి కేంద్రాన్ని ప్రారంభించారు.రాష్ట్రంలోని గతంలో వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యూఇ) ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న మొత్తం 196 భద్రతా దళాల శిబిరాలలో 70 శిబిరాలను, రాబోయే ఏడాదిన్నర కాలంలో 'సేవా శిబిరాలు' (ప్రజా సేవా కేంద్రాలు)గా మారుస్తామని మంత్రి తెలిపారు. 'బస్తర్ 2.0' కార్యాచరణ ప్రణాళిక ప్రారంభానికి ఈ కార్యక్రమం నాంది పలుకుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా భద్రతా శిబిరాలను ప్రజా సంక్షేమ వినియోగ పనుల కోసం "పునరుద్దేశిస్తారు". అభివృద్ధి లోపం కారణంగా ఈ ప్రాంతాలకు మావోయిజం మళ్లీ తిరిగి రాకుండా చూసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన అత్యంత కీలకమైన కార్యాచరణ ప్రణాళిక ఇది అని అధికార వర్గాలు తెలిపాయి. మార్చి 31న రాష్ట్రం సాయుధ మావోయిస్టుల ముప్పు నుండి విముక్తమైందని ప్రకటించిన తర్వాత ఛత్తీస్‌గఢ్‌లో అమిత్ షా జరిపిన తొలి పర్యటన.

# కేరళం పీఠంపై సతీశన్

### ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేయించిన గవర్నర్ అర్లేకర్
### 20 మంది మంత్రులలో రమేశ్ చెన్నితల, కె.మురళీధరన్
### హాజరైన మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీ, పినరైవిజయన్ ప్రభృతులు




**తిరువనంతపురం, మే 18:** కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యుడీఎఫ్ ప్రభుత్వం కొలువుదీరింది. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో కేరళ 13వ సీఎంగా వీడీ సతీశన్ సోమవారం ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. సతీశన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ హాజరయ్యారు. 20 మంది మంత్రులు ప్రమాణం సతీశన్‌తో పాటు 20 మంది ఎమ్మెల్యేలను గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. వారిలో 14 మంది తొలిసారిగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. యుడీఎఫ్ కూటమి పార్టీలతో చర్చల అనంతరం 20 మందికి మంత్రి పదవులను ఖరారు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు రమేశ్ చెన్నితల, కే మురళీధరన్, ఎపీ అనిల్ కుమార్, సన్నీ జోసెఫ్‌తో పాటు ఐయూఎంఎల్‌కు చెందిన పీకే కున్హాల్ కుట్టి, ఎన్ శంషుద్దీన్, కెఎం షాజీ, పీకె బషీర్, వీఇ అబ్దుల్ గఫూర్ ఉన్నారు. టీ రాధాకృష్ణన్ స్పీకర్‌గా, షనిమోల్ ఉస్మాన్ (మహిళ) డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. సీఎం ఎంపికకోసమే రెండువారాలు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ నడిచింది. కేసీ వేణుగోపాల్, సతీశన్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. దాదాపు 10 రోజులకుపైబడి చర్చలు జరిగాయి. ఈనెల14న కాంగ్రెస్ అధిష్ఠానం కేరళ ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును ప్రకటించింది. మే 7న తిరువనంతపురంలో జరిగిన కాంగ్రెస్ శాసనసభ పక్ష సమావేశంలో రాష్ట్రంలో సీఎల్పీకి కొత్త నాయకుడిని నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు పూర్తి అధికారం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. దీనికి అనుగుణంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సహా అనేక ఇతర నాయకులతో సమావేశమైన ఏఐసీసీ పరిశీలకులతో కాంగ్రెస్ అధ్యక్షుడు, సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విస్తృత చర్చలు జరిపారు. ఈ చర్చలన్నింటి ఆధారంగా వీడీ సతీశన్‌ను సీఎల్పీ నాయకుడిగా నియమించాలని నిర్ణయించారు. కొచ్చి సమీప నెట్టూర్‌లో 1964లో జన్మించిన వీడీ సతీశన్ వృత్తిరీత్యా న్యాయవాది. పదేళ్ల కేరళ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు. కేరళ విద్యార్థి విభాగం కేఎస్‌యూతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2001 నుంచి పరావూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఐదేళ్లుగా కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. కేరళ ముఖ్యమంత్రి పదవికి ముగ్గురు సీనియర్ నేతలు తీవ్రంగా పోటీ పడినప్పటికీ చివరకు సతీశన్ వైపే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపింది. పదేళ్లుగా కేరళలో అధికారానికి దూరమైన పార్టీని విస్తృత ప్రజాబాహుళ్యం మద్దతుతో గెలిపించడంలో సతీశన్ కీలక పాత్ర పోషించారు. విపక్షనేతగా సమర్థంగా పనిచేయడంతో పాటు వామపక్షాల ఆధిపత్యానికి గండికొట్టారు.

## సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్‌భవన్ నిబంధనలు తూచ్!

**తిరువనంతపురం, మే 18:** కేరళ ముఖ్యమంత్రి సతీశన్ ప్రమాణ స్వీకారంలో లోక్ భవన్ విధించిన నిబంధనల్ని పాటించలేదనే ఆరోపణలు వస్తున్నాయి. వేదికపై కేవలం గవర్నర్, కొత్త సీఎం వీడీ సతీశన్, ప్రమాణ స్వీకారం చేసే మంత్రులు మాత్రమే కూర్చోవాలని లోక్ భవన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని సమాచారం. మిగిలిన నేతలంతా కింద ప్రేక్షకుల్లోనే కూర్చోవాలని పేర్కొన్నట్లు లోక్‌భవన్ వర్గాలు తెలిపాయి. కానీ ఈ ప్రొటోకాల్‌ను ఎవరూ పాటించలేదు. సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ వేడుకలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నేరుగా వేదికపైకి వచ్చి కూర్చున్నారు. వీరితో పాటు ప్రతిపక్ష నేత పినరయి విజయన్, సీపీఐ బినోయ్ విశ్వం, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్‌కు కూడా స్టేజ్‌పైనే సీట్లు కేటాయించారు.

దీంతో లోక్ భవన్ ఆదేశాలు పూర్తిగా పక్కనబెట్టినట్లయింది. ఈ కఠినమైన ప్రొటోకాల్స్ వెనుక రాజకీయ కుట్ర ఉందని కాంగ్రెస్ నాయకత్వం ఆరోపించింది. రాహుల్ గాంధీ, ఖర్గేలను స్టేజ్‌పైకి రానివ్వకుండా చేయడానికే ఈ నిబంధనలు పెట్టారని మండిపడింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రధాని, హోంమంత్రులు ఇలాగే వేదికలను పంచుకుంటారని కాంగ్రెస్ గుర్తుచేసింది. లోక్ భవన్ వైఖరి ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉందని విమర్శించింది.



### మహిళలకు ఉచిత ప్రయాణం.. ఆశావర్కర్లకు గౌరవభృతి పెంపు
### - సిఎంగా సతీశన్ తొలిసంతకం

**తిరువనంతపురం,మే 18:** ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారంచేసిన వెనువెంటనే ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా మహిళలకు ఉచిత ప్రయాణం, ఆశా వర్కర్ల గౌరవభృతి పెంపు ఫైళ్లపై తొలిసంతకం చేసారు. కెఎస్‌ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలుచేయాలన్న ఆదేశాలు అమలుకు వచ్చాయి. అలాగే ఆశా వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనం పెంచేందుకు కూడా ముఖ్యమంత్రి ఉత్తర్వులు ఆరీచేసారు. మహిళలకు ఉచిత ప్రయాణం జూన్ 15వ తేదీనుంచి అమలులోకి రానున్నట్లు సీఎం స్వయంగా ప్రకటించారు. ఎన్నికల ప్రచారంలోను, తన మేనిఫెస్టోలో కూడా మహిళలకు ఉచితప్రయాణం ఇసానతమని హామీ ఇచ్చింది. అలాగే ఆశావర్కర్లకు నెలవారీ భత్యం మరో 3వేల రూపాయలు పెంచుతున్నట్లుకూడాప్రకటించింది. ప్రస్తుతం రూ.9వేలు పొందుతున్న ఈ భత్యం ఇకపై 12 వేలకు పెరుగుతుందని సతీశన్‌వెల్లడించారు. తదుపరి భవిష్యత్తులో అవసరమైతే మరోసారి సవరణలు మార్పులు ఉంటాయని కూడా వెల్లడించారు. ఎన్నికల్లో యుడిఎఫ్ ఇచ్చిన హామీలు అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, హామీలు నెరవేర్చడమే తమ ప్రథమ కర్తవ్యమని సతీశన్ చెప్పుకొచ్చారు.20 మందితోకూడిన కేబినెట్ ప్రమాణంచేసిన సంగతి తెలిసిందే.

## ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ మరొక జడ్జికి బదలాయింపు!



**న్యూఢిల్లీ, మే 18:** ఢిల్లీ లిక్కర్ కేసు విచారణకు సంబంధించిన తీవ్రస్థాయిలో జరిగిన వివాదానికి తెరపడింది. జస్టిస్ స్వర్ణకాంతశర్మ బెంచ్‌నుంచి కేసును తప్పించాలని కోరిన ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కృషి సఫలం అయింది. ఇకపై ఈ కేసును జస్టిస్ మనోజ్ జైన్ విచారించనున్నారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో ఈ కేసు విచారణ సాగుతోంది. ఈ కేసులో ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలైన మనీష్ సిసోడియా వంటి నేతలు కీలక నిందితులుగా ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా సహా పలువురు నిందితులపై సీబీఐ మోపిన అభియోగాల్ని ఇటీవల ట్రయల్ కోర్టు కొట్టేసిన సంగతి తెలిసిందే. దీంతో కేజ్రీవాల్ సహా నిందితులంతా బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే, ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తాజాగా ఈ కేసు విచారణ మంగళవారం జరగనుంది. దీన్ని జస్టిస్ మనోజ్ జైన్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించనుంది. ఇంతకుముందు ఈ కేసును జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆధ్వర్యంలోని బెంచ్ విచారించింది. ఆమె ఈ కేసు వాదించడాన్ని కేజ్రీవాల్ సహా నిందితులు వ్యతిరేకించారు. జస్టిస్ స్వర్ణకాంత శర్మపై పలు ఆరోపణలు చేశారు. ఆమెకు ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలతో సంబంధాలున్నాయని, కేసు విచారణ నిష్పక్షపాతంగా జరగదని తెలిపారు. అందుకే, ఆమె ఉంటే కేసు విచారణకు హాజరయ్యేది లేదన్నారు. ఇదే సమయంలో గతంలో జరిగిన కేసు విచారణకు సంబంధించిన వీడియోని కేజ్రీవాల్ సహా నిందితులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఫొటోలు, వీడియోల్ని కూడా షేర్ చేశారు. దీంతో ఈ అంశం వివాదాస్పదమైంది. కోర్టులు, న్యాయవ్యవస్థ గౌరవాన్ని తగ్గించేలా ఆమ్‌ఆద్మీ నేతలు వ్యవహరించారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆరోపించారు. ఈ మేరకు కేజ్రీవాల్ సహా నిందితులపై దీనిపై కేసు నమోదైంది. ఇదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు జస్టిస్ స్వర్ణకాంత శర్మ ప్రకటించారు. ఆమె తప్పుకోవడంపై ఆమ్ ఆద్మీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం నెలనెలా రూ.3వేలు ఆర్థికసాయం

### బెంగాల్‌లో సువేందు ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు..



**కోల్‌కత్తా, మే 18:** పశ్చిమ బెంగాల్‌లో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు సిద్ధమవుతోంది. ఎన్నికల్లో హామీ మేరకు కొన్ని పథకాల అమలుపై నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్ రాజధాని కోల్‌కతాలో సోమవారం సీఎం సువేందు అధికారి ఆధ్వర్యంలో రెండోసారి క్యాబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో జూన్ 1 నుంచి పలు పథకాల అమలు చేయాలని నిర్ణయించారు. క్యాబినెట్ భేటీలో ప్రధానంగా ఐదు కీలక అంశాలపై చర్చ జరిపి, ఆమోదం తెలిపారు. వచ్చే జూన్ 1 నుంచి అన్నపూర్ణ పథకం అమలు చేస్తారు. అర్హులైన మహిళలకు ఈ పథకం కింద నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అందిస్తారు. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఏఏ చట్టం కింద భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలకు కూడా సంక్షేమ పథకాలు అందిస్తామని బెంగాల్ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అగ్నిమిత్ర పాల్ తెలిపారు. ఇప్పటికే అమలవుతున్న లక్ష్మీ భండార్ పథకం లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేయకుండానే అన్నపూర్ణ పథకానికి అర్హత పొందుతారని మంత్రి చెప్పారు. ఈ పథకం పొందలేని వారు దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే కొత్త పోర్టల్ ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది కోసం 7వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. మరోవైపు మతపరమైన సంక్షేమ పథకాల్ని, ప్రోత్సహకాల్ని జూన్ 1 నుంచి రద్దు చేయబోతున్నట్లు తెలిపారు. దీని ప్రకారం మదర్సాలకు అందించే సాయం ఆగిపోయే అవకాశం ఉంది. ఓబీసీలకు అందించే పథకాల అమలుకు కొత్త కమిషన్ ఏర్పాటు చేయబోతున్నారు. త్వరలో ప్రభుత్వం కొత్త ఎలక్ట్రిక్ బస్సుల్ని కొనుగోలు చేయనుంది. కేంద్రంతో కలిసి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ఇటీవలే సువేందు అధికారి ప్రభుత్వం ప్రకటించింది.

## బెంగాల్ ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి పెంపు - మే 11 నుంచే అమల్లోకి

**కోల్‌కతా, మే 18:** పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, 'పశ్చిమ బెంగాల్ సర్వీసెస్ (వయోపరిమితి పెంపు) నిబంధనలు, 1981'కు కొత్త సవరణలు జారీ చేయడం ద్వారా వివిధ రాష్ట్ర సర్వీసులలో ప్రవేశానికి గరిష్ట వయోపరిమితిని సవరించింది. పశ్చిమ ఈ మేరకు బెంగాల్ ఆర్థిక శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉత్తర్వు ప్రకారం, గ్రూప్ ఎ నియామకాలకు గరిష్ట వయోపరిమితిని ఇప్పుడు 41 సంవత్సరాలకు పెంచారు. ఇప్పటికే అధిక వయోపరిమితి ఉన్న ఏ పోస్టు అయినా ప్రస్తుత నిబంధన ప్రకారమే కొనసాగుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రూప్ బి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 44 సంవత్సరాలకు సవరించారు. గ్రూప్ సి, గ్రూప్ డి పోస్టులకు గరిష్ట వయోపరిమితిని 45 సంవత్సరాలకు పెంచారు. రాష్ట్ర చట్టబద్ధ సంస్థలు, ప్రభుత్వ కంపెనీలు, స్థానిక సంస్థలలో నియామకాల పశ్చిమ బెంగాల్ నియంత్రణ చట్టం, 1999 పరిధిలోకి వచ్చే నియామ కాలలో, పబ్లిక్ సర్వీస్ కమిషన్ యంత్రాంగం వెలుపల ఎంపిక జరిగే చోట, అనుమతించబడిన గరిష్ట వయోపరిమితి.

## గోమతి ఎక్స్‌ప్రెస్ బోగీలోని ట్రంకుపెట్టెలో ముక్కలుగా మహిళ మృతదేహం




**లక్నో, మే 18:** రైలు స్లీపర్ కోచ్‌లో అనుమానాస్పద ఇనుప పెట్టెను పారిశుధ్య సిబ్బంది గుర్తించి తాళం పగులగొట్టి దానిని తెరిచి చూడగా మహిళ మృతదేహం భాగాలను పోలీసులు గుర్తించారు. మహిళను హత్య చేసి మృతదేహాన్ని ముక్కలుగా నరికి పెట్టె, బ్యాగులో ఉంచి రైలులో వదిలేసినట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఈ సంఘటన జరిగింది. బీహార్‌లోని చాప్రా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ రైలు, లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించింది. సోమవారం ఉదయం ఆ రైలు కోచ్‌లను పారిశుధ్య సిబ్బంది క్లీనింగ్ చేస్తుండగా ఒక స్లీపర్ కోచ్ సీటు కింద వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను వారు గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆ ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మృతదేహం భాగాలు ఉన్నాయి. మొండెం, వేరు చేసిన తల భాగాలు పెట్టెలో, కాళ్లు, చేతుల భాగాలను పాలిథిన్ సంచుల్లో ప్యాక్ చేసి బట్టల మధ్య దాచి బ్యాగ్‌లో ఉంచడాన్ని రైల్వే పోలీసులు పరిశీలించారు. మరోవైపు మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటుందని రైల్వే పోలీస్ అధికారి తెలిపారు. ఆమె గొంతు కోసి హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా నరికిన హంతకులు ఇనుప పెట్టె, బ్యాగులో వాటిని ఉంచి రైలులో వదిలేసినట్లు అనుమానించారు. ఆ రైలు ప్రయాణించిన అన్ని రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## 22న ఢిల్లీకి విజయ్ - ముఖ్యమంత్రిగా తొలి హస్తిన పర్యటన

### - ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులతో భేటీ - మూడ్రోజులు ఢిల్లీలోనే విజయ్ మకాం

**చెన్నై, మే 18:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తన తొలి అధికారిక పర్యటన నిమిత్తం మే 22న న్యూఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీనియర్ కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో, తమిళనాడులోని అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలన్న డిమాండ్లు, శ్రీలంక అధికారులు తమిళనాడు మత్స్యకారులను పదేపదే నిర్బంధించడం, వారిపై దాడులు చేస్తున్నారనే ఆరోపణలపై ఆందోళనలతో సహా కీలకమైన రాష్ట్రకేంద్ర సమస్యలపై దృష్టి సారించే అవకాశం ఉంది. విజయ్ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌ను కలిసి, భారత్- శ్రీలంకల మధ్య దీర్ఘకాలంగా దౌత్య, రాజకీయ సమస్యగా ఉన్న మత్స్యకారుల సమస్యను ప్రస్తావించే అవకాశం ఉంది. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు, ముఖ్యంగా రామనాథపురం, నాగపట్టణం వంటి తీరప్రాంత జిల్లాల వారు, తరచుగా పాల్క్ జలసంధి సమీపంలోని జలాల్లోకి వెళ్తుంటారు. అక్కడ సముద్ర సరిహద్దుల వివాదాల కారణంగా, గత కొన్నేళ్లుగా శ్రీలంక అధికారులు మత్స్యకారులను అరెస్టు చేయడం, నిర్బంధించడం, పడవలను స్వాధీనం చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ సమస్య తమిళనాడులో పదేపదే నిరసనలకు దారితీసింది. నిర్బంధంలో ఉన్న మత్స్యకారులను విడుదల చేయించాలని, శాశ్వత దౌత్య పరిష్కారం కనుగొనాలని వరుస రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రాన్ని కోరాయి. ఇటీవలి సంవత్సరాలలో, ఉద్రిక్తతలను తగ్గించే లక్ష్యంతో భారత్, శ్రీలంక చర్చలు జరిపినప్పటికీ, ఎప్పటికప్పుడు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను కూడా కలవనున్నారు. ఈ సమావేశాల్లో, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు, సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం మరింత కేంద్ర సహాయం కోరుతూ విజయ్



ప్రతిపాదనలు సమర్పించే అవకాశం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలు, విపత్తు సహాయం, పారిశ్రామిక వృద్ధి, సామాజిక సంక్షేమ కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి కేటాయింపులు పెంచాలని తమిళనాడు తరచుగా కోరుతూ వస్తోంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో విజయ్ పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఈ పర్యటన. కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై, ఆయన పరిపాలనలో తమిళనాడు విధాన ప్రాధాన్యతలపై ప్రభావం ఉంటుందోనని పరిశీలకులు అంటున్నారు.

## అమెరికాపై డ్రోన్ల దాడులకు క్యూబా వ్యూహాలు!

### కలవరపడుతున్న అగ్రరాజ్యం

**హవానా, మే 18:** క్యూబాను అమెరికా ఇప్పుడు ఓ భద్రతాపరమైన ముప్పుగా పరిగణిస్తోంది. సుమారు 300కు పైగా సైనిక డ్రోన్లను హవానా సమీకరించుకుందని, అమెరికా లక్ష్యాలపై దాడులకు సంబంధించిన ప్రణాళికలు చర్చిస్తోందని వర్గీకృత నిఘా వర్గాలు గుర్తించినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. దీంతో ట్రంప్ యంత్రాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్రిక్తతలు పెరిగితే గ్వాంటనామో బేలోని అమెరికా నావికా స్థావరం, సైనిక నౌకలు, ఫ్లోరిడాలోని కీ వెస్ట్‌పై దాడులకు క్యూబా అధికారులు ప్రణాళికలు రచించినట్లు ఈ నివేదికలో పేర్కొన్నారు. క్యూబాకు రష్యా, ఇరాన్‌లతో పెరుగుతున్న రక్షణ సంబంధాలు, హవానాలో ఇరాన్ సైనిక సలహాదారుల ఉనికిపై అమెరికా ఆందోళన చెందుతోంది. ఇంత సమీపంలో ఇలాంటి టెక్నాలజీలు ఉండటం ఆందోళన కలిగించే అంశం, ఇదొక పెరుగుతున్న ముప్పు అని ఒక సీనియర్ అమెరికా అధికారి వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం క్యూబాలో పర్యటించి, ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. 1996లో రెండు విమానాలను కూల్చివేసిన ఘటనలో క్యూబా మాజీ నేత రౌల్ క్యాస్ట్రోపై అభియోగాలు నమోదు చేసేందుకు అమెరికా న్యాయశాఖ సిద్ధమవుతోంది. ఈ ఆరోపణలను క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రోడ్రిగ్జ్ ఖండించారు. ఆంక్షలు, సైనిక జోక్యాన్ని సమర్థించుకునేందుకే అమెరికా తప్పుడు కేసు బనాయిస్తోందని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్ ప్రకారం ఆత్మరక్షణ హక్కు తమకుందని స్పష్టం చేశారు. అయితే, డ్రోన్లు ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్యూబా నేరుగా ఖండించలేదు.

## సంక్షిప్తంగా..

### ఇరాక్‌లో ఒకటికాదు.. రెండు ఇజ్రాయెల్ రహస్య స్థావరాలు

**బాగ్దాద్, మే 18:** ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్.. ఇరాక్ ఎడారిలోని కర్బలా నగరానికి సమీపంలో ఉన్న ఎండిపోయిన సరస్సులో రహస్యంగా సైనిక స్థావరాన్ని నిర్మించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే ఇరాక్‌లో ఉన్నది ఒక రహస్య స్థావరం కాదని.. రెండు ఉన్నాయని అక్కడి అధికారిక వర్గాలు వెల్లడించాయి. పశ్చిమ ఎడారి ప్రాంతంలో రెండో స్థావరం కూడా ఉన్నట్లు ఆ దేశ సైన్యం గుర్తించింది. ఇరాన్‌పై 2025లో ఇజ్రాయెల్ నిర్వహించిన 12 రోజుల దాడులు ఈ స్థావరం నుంచే చేసినట్లు వెల్లడించింది. ఈ రహస్య స్థావరాన్ని రక్షించే క్రమంలో ఇటీవల ఇరాక్ సైనికుడు, ఓ పౌరుడు కూడా ప్రాణాలు కోల్పోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

2024లో ఇజ్రాయెల్ రెండో స్థావరాన్ని నిర్మించిందని.. దాని గురించి అమెరికాకు కూడా తెలుసని ఇరాక్ అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఆ స్థావరంలో సైనికులు ఉన్నారా, లేదా అనే విషయంపై స్పష్టత లేదన్నారు.

### మదుర్రై వద్ద ఘోర ప్రమాదం : ఐదుగురు మృతి


**మదుర్రై, మే 18:** తమిళనాడులోని మధురై సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకోవడంతో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురైలోని అన్నా నగర్‌కు చెందిన ప్రకాశ్, అతని బంధువు రమేశ్‌తో పాటు మరో ముగ్గురు మహిళలు కారులో తిరుచిరాపల్లిలోని ప్రముఖ సమయపురం మరియమ్మన్ ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం ముగించుకుని తిరిగి మధురైకి బయలుదేరారు. మేలూరు సమీపంలోని అయ్యపట్టి వద్ద హైవేపై వీరి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బ్యారియర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయి, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురూ ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

### ఇమ్రాన్ పదవీచ్యుతికి అమెరికా కుట్ర, రహస్యపత్రాలు లీక్..

**కరాచి, మే 18:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను పదవి నుంచి దించేయడం వెనుక అమెరికా హస్తం ఉందంటూ ఆరోపిస్తున్న ఓ రహస్య దౌత్య పత్రంవెలుగులోకి వచ్చింది. అమెరికాకు చెందిన డ్రాప్ సైట్ అనే పరిశోధక వార్తా సంస్థ ఈ పత్రాల పూర్తి సారాంశాన్ని బయటపెట్టింది. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో కూలిపోవడానికి సరిగ్గా నెల ముందు అంటే 2022 మార్చిలో అమెరికా అధికారి డోనాల్డ్ లూ, అప్పటి అమెరికాలోని పాక్ రాయబారి అసద్ మజీద్ ఖాన్ మధ్య జరిగిన సంభాషణలు ఈ పత్రంలో ఉన్నాయి. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో పాకిస్థాన్ తటస్థంగా ఉండటాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబట్టినట్లు ఈ పత్రాల ద్వారా తెలుస్తోంది.

ఇమ్రాన్ ఖాన్ రష్యా పర్యటనను ఆయన సొంత నిర్ణయంగానే అమెరికా చూసిందని డోనాల్డ్ లూ పేర్కొన్నారు. ఒకవేళ ప్రధానిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గితే వాషింగ్టన్ అంతా మర్చిపోతుంది. లేదంటే పాకిస్థాన్‌కు ముందు ముందు రోజులు చాలా కష్టంగా ఉంటాయి అని అమెరికా అధికారి హెచ్చరించినట్లు ఆ పత్రాల్లో ఉంది.

### గ్యాస్ సిలిండర్ లీక్‌తో భారీ పేలుడు..



**ఫతేపూర్,యుపి మే 18:** ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 9 మందికి తీవ్ర గాయాలయి వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాధితులను మెరుగైన చికిత్స కోసం కాన్పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. కల్యాణ్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్ఖిని గ్రామంలో ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సంతోష్ లోధి భార్య కళావతి ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ పైపు నుంచి లీకైంది. క్షణాల్లో ఇల్లంతా గ్యాస్ వ్యాపించి, ఒక్కసారిగా మంటలు అంటుకుని భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి ఇంట్లో ఉన్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

### సోషల్‌మీడియాతో ట్రంప్ ఇరాన్‌పై మైండ్‌గేమ్!

**వాషింగ్టన్, మే 18:** అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన దూకుడును సోషల్ మీడియా వేదికగా ప్రదర్శించారు. తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ఇరాన్‌ను హెచ్చరిస్తూ, రెచ్చగొట్టేలా ఉన్న ఏఐ చిత్రాలను వరసగా పోస్ట్ చేశారు. కొన్ని గంటల వ్యవధిలోనే ట్రంప్ 20కి పైగా చిత్రాలను పంచుకున్నారు. వీటిలో చాలా వరకు ఇరాన్పై అమెరికా సైనిక చర్యను తీవ్రతరం చేస్తున్నట్లుగా ఉన్నాయి. ఇరాన్ పటాన్ని అమెరికా జెండాతో కప్పి, చుట్టూ బాణాలు గురిపెట్టినట్లు ఉన్న ఒక చిత్రం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్ ఫాస్ట్ బోట్లపై అమెరికా డ్రోన్ దాడి చేస్తున్న చిత్రం కింద బై బై, ఫాస్ట్ బోట్స్ అని రాశారు. అంతేగాక తాను ఒక కంప్యూటర్ ముందు కూర్చుని టేబుల్పై చేతితో నొక్కుతూ, "బా బా బా బా ఫైర్, బూమ్ అంటూ క్షిపణి దాడికి" ఆదేశాలిస్తున్నట్లు నటించిన ఒక వీడియోను కూడా పంచుకున్నారు.

## సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

**● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 52 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారానే గాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని సిఎండి శివశంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్‌డి) కే.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం.ఉమాపతి, కే.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, భాస్కర్ రెడ్డి, పిఆర్ఓ తోట మధుసూదన పాల్గొన్నారు.

## పార్వతీపురం జిల్లా కలెక్టర్ సైకిల్‌పై ఆఫీస్‌కు



**పార్వతీపురం మన్యం, మే 18 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ సరికొత్త ఆదర్శాన్ని చాటారు. సోమవారం ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా ఆయన తన నివాసం నుండి కలెక్టరేట్ వరకు సైకిల్‌పై ప్రయాణించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజల ఫిర్యాదుల పరిష్కార వేదిక పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు కలెక్టర్ ఈ విధంగా సైకిల్‌పై రావడం అందరినీ ఆకట్టుకుంది.

## దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు



**ఇంద్రకీలాద్రి, మే 18, ప్రభాతవార్త:** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రు.3కోట్ల 35 లక్షల 87వేల 555ల నగదు, 232 గ్రాముల బంగారం, 4కెజిల 200 గ్రాముల వెండి, విదేశీ నగదు యుఎస్ఎ డాలర్స్ 1174, కతార్ రియాల్స్ 53, 117 మలేషియా రింగెట్స్, 30 నేపాల్ రుపాయలు, 175 యుఎఇ దిర్హామ్స్, 15 సింగపూర్ డాలర్స్, 55 కెనడా క్యాడ్లు, 31 సౌదీ రియాల్స్, 30 హాంకాంగ్ డాలర్స్, యురోలు 15, 30 ఇంగ్లాండ్ పౌండ్స్, 5 ఒమన్ రియాల్స్, 300 ఒమన్ బైంసాలు, 15 టర్కీ లైరాసీలు, 1000 బ్యాంక్ ఆఫ్ ఉగాండా షిల్లింగ్స్, బూటాన్ నుల్ట్రం 10, చైనా యువాన్లు 15, పాత భారత రు.2వేల నోటు 1 లభించినట్లు ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు.

**దుర్గమ్మ భక్తుల విరాళాలు:** శ్రీ దుర్గమల్లేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకమునకు ఏలూరుకు చెందిన గారపాటి రామ తులసమ్మ వారి కుటుంబసభ్యులతో కలిసి రూ.1,05,116లు సోమవారం అందించారు. విజయవాడకు చెందిన ఎన్‌విటల్‌కుమార్ తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,000లు నిత్యాన్నదాన పథకానికి విరాళ మందించారు. హైదరాబాద్‌కు చెందిన ఘంటశాల సుమన్ వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,000లు ఉచిత ప్రసాద పంపిణీకి విరాళమందించారు. విజయవాడకి చెందిన ఎ.వెంకట కృష్ణారావు కెన్ గ్రిడ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.1,01,116లు విరాళాన్ని అధికారులకు అందచేశారు. దాతలకు శ్రీ స్వామిఅమ్మవార్ల దర్శనానంతరం తీర్థప్రసాద ములు అమ్మవారి చిత్రపటము, వేదపండితులచే వేదాశీర్వచనము అందచేశారు.

# కూటమి ప్రభుత్వ కుట్రలకు ప్రజలు బలి

**● శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపాటు**




**విజయనగరం/ చీపురుపల్లి, మే 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను బలి చేస్తుందని శాసన మండలి విపక్ష నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సోమవారం రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పెంచిన పెట్రోల్ ధరలకు నిరసనగా చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నిలువునా దోచుకుంటున్న కూటమి ప్రభుత్వం, ఇంధన ధరల పెంపుపై బొత్స సత్యనారాయణ నిప్పులు చెలరేగారు. చీపురుపల్లి జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ భారీ నిరసన ప్రదర్శన అనంతరం ఆయన ప్రసంగిస్తూ సంపద సృష్టిస్తామని చెప్పి, ప్రజల సంపదను దోచేస్తున్నారు అని మండిపడ్డారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి వికలాంగుల పెన్షన్ల పై సైతం మోసం చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజల మనుగడ ప్రశ్నార్థకముగా మారిందన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల వల్ల రైతులు, కూలీలు, మధ్యతరగతి కుటుంబాలు బతుకలేని పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు ప్రజలను నట్టేట ముంచారని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇప్పటివరకు వికలాంగులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోవడం అత్యంత బాధాకరమని, ఈ ప్రభుత్వానికి మానవత్వం లేదని దుయ్యబట్టారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెప్పే సమయం వస్తుంది" అని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు. తక్షణమే పెంచిన ఇంధన ధరలను తగ్గించి, ప్రజలపై మోపిన అదనపు భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిసిసి మాజీ చైర్మన్ శోభా స్వాతిరాణి, వైసిపి జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు యువజన నాయకులు బెల్లాన వంశీ. చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ వివిధ అనుబంధ విభాగాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వ్యాపారం కాదు... పేద పిల్లల చదువే లక్ష్యం

**● రూ.40 కోట్లతో నెల్లూరులో తాగునీటి ప్రాజెక్టుకు మంత్రి నారాయణ శంకుస్థాపన**



నెల్లూరు, మే 18, ప్రభాతవార్త- వైద్యం: నెల్లూరు సిటీ నియోజక వర్గంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. 761 కోట్ల భారీ వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభం కాగా, 54వ డివిజన్‌లో 350 కిలో లీటర్ల సామర్థ్యం గల మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భూమి పూజ చేశారు. అనంతరం ఏసీనగర్ మల్లెల సంజీవయ్య స్కూల్‌లో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన క్లాస్ రూం బల్లలపై కూర్చొని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థిగా తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లా డుతూ సిఎం చంద్రబాబు అభివృద్ధి విషయం లో ఎక్కడా రాజీపడకుండా ముందుకు సాగు తున్నారు. సంపద సృష్టిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.14,000 కోట్లతో అమృత్ పథకం పనులు జరుగుతున్నాయని, రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన జదీ జలాలను అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే నెల్లూరులోని ప్రభుత్వ హైస్కూళ్లను అంతర్జా తీయ ప్రమాణాలతో ఆధు నీకరిస్తున్నామని, వక్ఫ్‌బోర్డు స్థలంలో 20 కోట్లతో వీఆర్‌సీకి ధీటుగా మరో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ నిర్మిస్తున్నామని ప్రకటించారు. వ్యాపార దృక్పథంతో చూస్తే నా పిల్లల నారాయణ విద్యాసంస్థల కోసం ప్రభుత్వ స్కూళ్లను నేను అభివృద్ధి చేయకూడదు. కానీ, పేదరిక నిర్మూలన కేవలం విద్యాభివృద్ధితోనే సాధ్యమని నమ్మి, ప్రతి పేద విద్యార్థికి ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ నెల్లూరు నగర నియోజకవర్గంలో మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పదో తరగతిలో 580 మార్కులు సాధించిన మల్లెల సంజీవయ్య స్కూల్ విద్యార్థినులను సన్మానించి మంత్రి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, అడిషనల్ కమీషనర్ హిమబిందు, మేయర్ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, 54వ డివిజన్ టీడీపీ నేతలు జమీర్, షాహీద్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# జిడి నెల్లూరులో దొంగ నోట్ల చెలామణి స్కామ్

**- రూ.9.40 లక్షలు కాజేసిన పోలీసులు ఇంటికే**

**చిత్తూరు, మే 18 ప్రభాతవార్త:** దొంగ నోట్ల చలామణి పేరిట చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్ఐ, ఏఆర్ కానిస్టేబుల్ తో పాటు మరో నలుగురు టెంకాయ వ్యాపారి ని బెదిరించి రూ.9.40 0 లక్షలను కాజేశారు. పోలీసుల పేరిట తనను మోసం చేశారని గుర్తించిన తమిళనాడుకు చెందిన టెంకాయల వ్యాపారి జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రానికి చెందిన టెంకాయల వ్యాపారి గంగాధర నెల్లూరు పరిసర ప్రాంతాల్లో వచ్చి టెంకాయలు కొనుగోలు చేసి తమిళనాడు తీసుకెళ్లి అక్కడ అన్ని వ్యాపారం చేసుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో జీడి నెల్లూరు పరిసర ప్రాంతంలో టెంకాయలు కొనుగోలు చేయడానికి రూ.10 లక్షలు తీసుకుని వచ్చిన ఆ వ్యాపారిని చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా పనిచేసే లోకనాథంతోపాటు చిత్తూరు ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే రవిచంద్రన్‌లతోపాటు తమిళనాడుకు చెందిన మరో ఇద్దరు స్థానికంగా ఉన్న మరో ఇద్దరు తమిళనాడు వ్యాపారిని దొంగనట్లు చలామణి చేస్తున్నాడని బెదిరించారు. తనకు దొంగ నోట్ల వ్యాపారంతో సంబంధం లేదని వ్యాపారి పలుమార్లు చెప్పిన ట్రాఫిక్ ఏఎస్ఐ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వినలేదు. తాము కొన్ని దొంగ నోట్లు ఇస్తామని వీటిని చలామణి చేసి తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది మాటలతో బెదిరిపోయిన తమిళనాడు చెందిన టెంకాయల వ్యాపారి తన వద్ద ఉన్న రూ.9.40 లక్షలు వారికి ఇచ్చివేసి వెళ్లిపోయాడు. ఈ విషయంలో తాను మోసపోయానని గ్రహించిన ఆ టెంకాయల వ్యాపారి వీధి జీడినెల్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన గిడి నెల్లూరు పోలీసులు ఈ వ్యవహారంలో తమ శాఖకు చెందిన ఒక ఏఎస్ఐ తో పాటు మరో హెడ్ కానిస్టేబుల్ సూత్రధారులుగా ఉన్నారని నిర్ధారించింది. ఈ మేరకు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తుకు చేయడానికి పోలీసు శాఖ సిద్ధం అవుతుంది.

## ఉద్యాన రైతుల రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**మంత్రి అచ్చెన్నాయుడు**

**సచివాలయం, మే 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. స్వీట్ ఆరెంజ్ తోటల్లో నీటి ఒత్తిడి పరిస్థితులపై ఇప్పటికే రెండు నెలల క్రితమే అనంతపురం జిల్లాలో అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై శాఖాధికారులు, శాస్త్రవేత్తలు ఫీల్డ్ విజిట్‌లు నిర్వహించి పరిస్థితిని సమీక్షిస్తున్నారని, రైతులకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 37వేల హెక్టార్ల స్వీట్ ఆరెంజ్ తోటలు ఉండగా, అందులో 2,260 హెక్టార్లలో సాగునీటి సమస్యను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో రైతులు లైవ్ మల్చింగ్, వీడ్ మ్యాట్ వినియోగం, ఫామ్ పాండ్స్ ఏర్పాటు చేయడం, అవసరమైన చోట్ల నీటిని తరలించి జీవనాధార నీటి సరఫరా చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా మూడు గ్రామాల్లో 875హెక్టార్లలో తీవ్రమైన నీటి కొరత నెలకొన్నదని, రైతులు భారీ వ్యయంతో నీటిని తరలించి తోటలను కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అయితే రవాణా వ్యయం అధికంగా ఉండడం, ఇతర ప్రాంతాల్లో కూడా తోటలు ఉండడంతో ఇద్దరు రైతులు కలపి సుమారు 4.5హెక్టార్ల తోటలను వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎన్ఎస్ఎస్‌లో నీటి కొరత కారణంగా ఆయా గ్రామాల చెరువుల నింపబడలేదని, చెరువులు నింపగలిగితే పరిస్థితి కొంత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఈ మొత్తం అంశంపై జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించామని, ఆయన ప్రత్యక్ష పర్యవేక్షణలో చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

అలాగే యాడికి మండలంలో కూడా కొన్ని నెలల క్రితం ఆమ్ల నిమ్మ పంటకు సాగునీటి సమస్య ఏర్పడిందని గుర్తుచేశారు. రైతులు నీటిని తరలించి పంటలను కాపాడుకోవడంతోపాటు ప్రస్తుతం ఆమ్ల నిమ్మ ధరలు అధికంగా ఉండడం వల్ల వారికి మంచి ఆదాయం లభించిందని చెప్పారు. రైతులు తీవ్ర ఆర్థికభారం భరించి పంటలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో వారికి నీటి రవాణా ఖర్చు అందించే అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళి, రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

## గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల పనులు

# త్వరితగతిన పూర్తి చేయాలి

**- పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి**

**సచివాలయం, మే 18 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తిచేసి అందుబాటులోనికి తీసుకురావాలని మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో ఆర్ అండ్ బి, ఐ అండ్ ఐ శాఖ మంత్రి కార్యాలయంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పురోగతిపై ఆశాఖ ఉన్నతాధికారులతో మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి సమీక్షా సమావేశం జరిగింది. గ్రీన్ ఫీల్డ్ పోర్టు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని మంత్రి తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కారిస్తామని మంత్రి తెలిపారు. పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల పనులు మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మూలాపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, ఆర్ అండ్ ఆర్ వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. మూలాపేట గ్రామానికి పునరావాస కల్పనను వేగవంతం చేయడం ద్వారా డ్రెడ్జింగ్‌ను సకాలంలో పూర్తి చేయడంతో పాటు, ఈ ఏడాది ఆఖరు నాటికి పోర్టు నిర్మాణం పూర్తి చేయవచ్చని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం పోర్టుకు రైల్వే అనుసంధానం, విద్యుత్, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రీన్ ఫీల్డ్ పోర్టులను చేపట్టిన క్రమంలో వాటిని సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు సహకరించాలని మంత్రి కోరారు. రామాయపట్నం గ్రీన్‌ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, ఫిషింగ్ హార్బర్‌ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సీఈవో అభిషేక్ కుమార్, ఏపి మారిటైమ్ బోర్డు చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, పోర్టు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైళ్లలో అగ్నిప్రమాదాలపై ప్రత్యేక దృష్టి

**● రైల్వే భద్రతా చర్యలపై సమీక్షలో జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ**






**గుంతకల్ రైల్వే, మే 18 ప్రభాతవార్త:** గుంతకల్ రైల్వే డివిజనల్ వేసవి కాలం దృష్ట్యా భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాటించాల్సిన అగ్నిమాపక భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో పాటు పాల్గొన్నారు. విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌లలోని మొత్తం ఆరు డివిజన్‌ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఏంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతపై తీసుకుంటున్న జాగ్రత్తలను సమీక్షించారు. జనరల్ మేనేజర్ మాట్లాడుతూ అగ్నిమాపక భద్రతా చర్యలపై దృష్టి సారించాలని, అలాగే సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు సంబంధించిన అన్ని జాగ్రత్తలను సిబ్బంది కచ్చితంగా పాటించేలా అధికారులు పునరుద్ఘాటించాల్సిందిగా ఆయన సూచించారు. అగ్ని, పొగను గుర్తించే వ్యవస్థ (ఫైర్ అండ్ స్మోక్ డిటెక్షన్ సిస్టమ్), దాని నిర్వహణ విషయంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని ఆయన సూచించారు. రైలు పట్టాల వెంబడి అగ్ని ప్రమాదాలనైనా నివారించడానికి గస్తీని ముమ్మరం చేయాలని ఆయన తెలిపారు.

జనరల్ మేనేజర్ రోలింగ్ స్టాక్ భద్రతపై నొక్కి చెబుతూ భారీ మొత్తంలో లోడింగ్‌చేసే సంధర్భంలో కఠినమైన మార్గదర్శకాలను పాటించాలని అసమాన లోడింగ్‌ను నివారించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పాయింట్లు, క్రాసింగ్‌లపై దృష్టి సారించాలని కూడా ఆయన సూచించారు. జనరల్ మేనేజర్ ట్రాక్ భద్రతపై చర్చిస్తూ, కేబుల్ డామేజ్‌లు, అనధికార ప్రవేశ సంఘటనలు, బారికేడింగ్‌కు సంబంధించిన పనులు, జోన్‌లోని కేబులింగ్ పనులను సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న యార్డ్ పునర్నిర్మాణం; సిగ్నల్ అప్‌గ్రేడేషన్ పనులు, వంతెనలపై కాలి నడక మార్గాలు మొదలైన మౌలిక సదుపాయాల పనులను ఆయన సమీక్షించారు, నిర్దేశించిన లక్ష్యం ప్రకారం అట్టి పనులను పూర్తి చేయడానికి వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

## పెట్రో ఉత్పత్తులపై నిరసన వ్యక్తం చేసే

# నైతిక హక్కు వైసిపికి లేదు

**● టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు**



**అనంతపురం, మే 18 ప్రభాతవార్త బ్యూరో:** పెట్రో ఉత్పత్తుల ధరలపై నిరసన వ్యక్తం చేసే నైతిక హక్కు వైసిపికి ఏమాత్రం లేనేలేదని ప్రభుత్వ విప్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం వైసిపినిర్వహించిన నిరసన కార్యక్రమాలపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టడం వైసిపి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో దేశంలోని అనేక రాష్ట్రాలు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాయని, అయితే అప్పటి వైసిపి ప్రభుత్వం మాత్రం ప్రజల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. ధరలు తగ్గించని ఏకైక రాష్ట్రంగా అప్పట్లో ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. అంతటి కర్కోటక పాలకుడిగా జగన్ వ్యవహరించారని విమర్శించారు. 2019లో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిన సందర్భంలోనూ, అప్పటి సీఎం. నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం లీటర్‌కు రూ.2 తగ్గించి ప్రజలకు కొంత ఉపశమనం కలిగించిందని గుర్తుచేశారు. కానీ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌పై సెస్, వ్యాట్ పేర్లతో అదనపు పన్నులు విధించి ప్రజలపై అధిక భారం మోపిందని ఆరోపించారు. పెట్రోల్‌పై రూ.8.59, డీజిల్‌పై రూ.6.48 వరకు అదనపు భారం అప్పట్లో వేసిందని తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ పన్నులను తగ్గించాలని అనుకున్నా, అప్పటి ఆర్థిక విధానాల కారణంగా వీలుకావడం లేదన్నారు. 2024 జూన్‌లో పెట్రోల్ ధర రూ.110, డీజిల్ ధర రూ.99 ఉండగా, పశ్చిమాసియా యుద్ధం కారణంగా అవి వరుసగా రూ.113, రూ.101కు చేరాయని, అంటే పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.2 పెరిగిందని తెలిపారు. పెట్రో ఉత్పత్తుల ధరల విషయంలో గతంలో వైసిపి ప్రభుత్వం విధ్వంసకర విధానాలు అమలు చేసి, ఇప్పుడు అదే అంశంపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజలను మభ్యపెట్టే రాజకీయ ప్రయత్నమని కాలవ శ్రీనివాసులు విమర్శించారు.




## టిటిడి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**తిరుపతి, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడిలో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు సమస్యలను పరిష్కరించడంలో టిటిడి యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ధార్మిక సంస్థలో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారని, వారి సమస్యలు తీర్చడంలో ఉన్నతాధికారులు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. 12వ పీఆర్సీ, 4 పెండింగ్ డిఏలు వెంటనే ఇవ్వాలన్నారు. సోమవారం టిటిడి పరిపాలన భవనం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, టిటిడి పారిశుద్ధ్య కార్మికులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతామోహన్ మాట్లాడుతూ ఆరు లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నారని, ప్రజలకు సేవ చేస్తున్న ఉద్యోగస్తులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. గత 8 సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. బోనస్, పెండింగ్ డిఏలు వెంటనే ఇవ్వాలన్నారు. 30 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. ముఖ్యమంత్రులుగా చంద్రబాబు, జగన్ ఇద్దరూ ఉద్యోగస్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. ధర్నా అనంతరం టిటిడి పరిపాలన భవనంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, రావణ్, దాసరి చిరంజీవి, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, సమీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు అకౌంట్లుతో బ్యాంకులకు టోకరా

**నిందితుడు అరెస్టు... రిమాండ్**



**7 కోట్ల విలువైన స్థిర చరాస్థుల డాక్యుమెంట్లు స్వాధీనం**

**విజయవాడ కార్పొరేషన్, మే 18 ప్రభాతవార్త:** విజయవాడలోని పలు యాక్సిక్ బ్యాంకు బ్రాంచుల్లో 2019 నుండి 26 సేవింగ్ ఖాతాలను తెరిచి క్రెడిట్ కార్డుల ద్వారా వివిధ లోన్ రూపాలలో లోన్‌లను తీసుకొని వాటిని కట్టకుండా మోసం చేసి తప్పించుకుని తిరుగుతున్నాడని విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఇచ్చిన ఫిర్యాదుపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని, సదరు కేసును త్వరగా దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేయాలని సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సైబర్ క్రైం డిసిపి కె.కృష్ణప్రసన్న, సైబర్ క్రైం ఎసిపి నేతృత్వంలో పలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా సదరు ప్రత్యేక బృందాలకు రాబడిన పక్కా సమాచారం మేరకు, సూర్యారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితులైన కృష్ణా జిల్లా గూడూరు గ్రామానికి చెందిన నీలం పవన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించి అతని వద్ద నుండి వివిధ స్థిరాస్థులకు చెందిన 34 డాక్యుమెంట్‌లను, ఒక కారు, ఒక బైక్, 122 గ్రాముల బంగారం, 927 గ్రాముల వెండి, 9 ఎటిఎం కార్డులు, రూ.11,500 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడు నీలం పవన్‌కుమార్ ఈ సేవలో పనిచేసే క్రమంలో జల్సాలకు అలవాటుపడి తనకు వచ్చిన జీతం జల్సాలకు సరిపోక ఏ విధంగానైనా సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తనకున్న కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తప్పుడు శాలరీ స్లిప్స్, ఐడి కార్డులు మొదలైన బ్యాంక్‌లలో లోన్ పొందడానికి అవసరమైన పత్రాలను తయారు చేసుకొని వాటిని ఉపయోగించి సదరు బ్యాంక్ యొక్క గుణదల బ్రాంచి నందు 9 ఫేక్ అకౌంట్ల ద్వారా 1.76 కోట్ల రూపాయలు, ఏలూరు రోడ్ బ్రాంచి నందు 10 ఫేక్ అకౌంట్స్ ద్వారా 1.32 కోట్ల రూపాయలు, మెయిన్ బ్రాంచి నందు 7 ఫేక్ అకౌంట్ల ద్వారా 2.20 కోట్ల రూపాయిలు, మొత్తం 26 అకౌంట్ల ద్వారా సుమారు 5.28 కోట్ల రూపాయల వరకు లోన్ తీసుకుని వాటిని కట్టకుండా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసాడు. ఇతనిపై గతంలో గూడూరు పోలీస్‌స్టేషన్, బందరు పోలీస్‌స్టేషన్, భవానీపురం పోలీస్‌స్టేషన్, కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులున్నాయని ఆయన తెలిపారు. కీలకమైన కేసును ఛేధించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని అధికారులు అభినందించారు.



# ప్రగతి పథంలో రథచక్రాలు



- స్త్రీ శక్తితో సహా ఏపీఎస్‌ఆర్‌టిసిలో వినూత్న పథకాలు
- కార్మికులకు, ప్రయాణికులకు ఉత్తమ సంక్షేమ కార్యక్రమాలు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్‌టిసి అనేది ప్రజా రవాణ వ్యవస్థగానే కాదు, మహిళలకు, దివ్యాంగులకు ఆర్థికంగా అండగా నిలిచే వ్యవస్థగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దిందని ఏపి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు గత రెండేళ్ళ కూటమి ప్రభుత్వంలో ఆర్‌టిసి ప్రగతిని వివరిస్తూ ఓ ప్రకటన విడుదల చేసారు. ఈ తొలి నుంచి ఆర్‌టిసి అనేది ఓ ప్రజా రవాణ వ్యవస్థగానే ప్రభుత్వాలు భావించాయి. కానీ ఈ ప్రజా రవాణ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే నిర్ణయాలు తీసుకోవచ్చు.. పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించవచ్చు అని కూటమి ప్రభుత్వమే నిరూపించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2025 ఆగస్టు 15 స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. అప్పటి వరకు బస్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వాలనే చూసిన ప్రజలకు... స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణాన్ని పరిచయం చేసింది కూటమి ప్రభుత్వం. ఆ వర్గం.. ఈ వర్గం అని లేకుండా.. ఎలాంటి షరతులు.. నిబంధనలు లేకుండా అమలవుతున్న ఏకైక పథకంగా స్త్రీ శక్తి పథకమే. ఈ పథకం అమలు ద్వారా ఆర్‌టిసికి సంక్షేమ చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించింది సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మిగిలిన పథకాలన్నీ ఒక ఎత్తు... స్త్రీ శక్తి పథకం మరో ఎత్తు అనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

**స్త్రీ శక్తి పథకంలో ఉన్న గొప్పదనమిదే:** స్త్రీ శక్తి పథకంతో పేద, మధ్యతరగతి ప్రజల ఆదాయం ఆదా అవుతోంది. ఇది మహిళల్లో ఆర్థిక సాధికారత పెంచింది. ఓ మహిళా ఉద్యోగి ఆఫీసుకు వెళ్లాలన్నా.. ఓ యువతి కాలేజీకి వెళ్లాలన్నా.. మహిళా రైతు ఉత్పత్తులను మార్కెట్టుకు తీసుకెళ్లి అమ్ముకోవాలన్నా ఆర్‌టిసి బస్సెక్కి ఉచితంగా తమ గమ్య స్థానాలకు చేరుతున్నారు. అంతే కాకుండా పుట్టింటికి వెళ్లాలన్నా.. బంధువుల ఇంటికి వెళ్లాలన్నా ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అలాగే పండుగ దినాల్లో పుణ్యక్షేత్రాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. దీని వల్ల ప్రతి కుటుంబానికి సుమారుగా రూ.2 వేల నుంచి 2,500 ఆదా అవుతున్నట్టు అంచనా. అంటే ఏడాదికి సుమారుగా రూ.25 వేలు ఆదా అవుతోందని లబ్దిదారులే స్వయంగా చెబుతున్నారు. ఇక స్త్రీ శక్తి పథకం వల్ల దేవాలయాలకు ఆదాయం పెరుగుతోంది. పర్యాటక ప్రాంతాల్లో రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి మెరుగవుతోంది. అందుకే ఈ పథకం సూపర్ హిట్ అయింది. స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన 9 నెలల్లో 67 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగితే.. సుమారు రూ.2350 కోట్ల మేర సబ్సిడిని ప్రభుత్వం భరించింది. దీనికి రూ.720 కోట్లను ప్రభుత్వం ఆర్‌టిసికి రీయింబర్స్ చేసింది. ఈ విధంగా ఎప్పటికప్పుడు రీయింబర్స్ చేస్తూ ఆర్‌టిసిపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది ప్రభుత్వం. ఈ పథకం ద్వారా ఆర్‌టిసికి స్త్రీ శక్తి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో సుమారుగా 92శాతానికి పెరిగింది. గతంలో సుమారుగా 60 శాతంగా ఉండే ఆక్యుపెన్సీ రేషియో స్త్రీ శక్తి పుణ్యమా అని 92 శాతానికి చేరింది. ఇందులో పురుష ప్రయాణికుల సంఖ్య 40 శాతంగా ఉంది. ఈ పథకం ఓ విధంగా ఆర్‌టిసికి అండగా నిలుస్తోంది. స్త్రీ శక్తి కింద వచ్చే సబ్సిడీని ప్రభుత్వం నుంచి అందుకుంటోంది.. అలాగే పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో ద్వారా ఆర్‌టిసి తన ఆదాయాన్ని పెంచుకుంటోంది. ఇక దివ్యాంగ శక్తి కింద దివ్యాంగులు సుమారు 25 లక్షల ఉచిత ప్రయాణాలు జరిగాయి.

**ప్రాణాలు కాపాడుతున్న స్త్రీ శక్తి:** బస్సు ప్రయాణం సురక్షి తం అనేది ఏపిఎస్‌ఆర్‌టిసికి ఉన్న బ్రాండ్. ఈ బ్రాండ్ నిలబెట్టేలా స్త్రీ శక్తి పథకం ఆర్‌టిసికి ఉపకరిస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత ఆర్‌టిసిలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. చాలా మంది మహిళలు ఆటోల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణాలు తగ్గించుకుని ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడి చనిపోయే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రకాశం జిల్లా ఎస్పీ నిర్వహించిన సర్వే ప్రకారం స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రమాదాల్లో మహిళా మరణాల సంఖ్య దాదాపు 39శాతం మేర తగ్గినట్టు వెల్లడైంది. అలాగే ప్రమాదాల్లో పురుషుల మరణాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్టు గుర్తించారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబుకు ప్రకాశం జిల్లా ఎస్పీ వివరించారు. దీనిపై రాష్ట్ర స్థాయి అధ్యయనం చేయించాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఆర్‌టిసిని, ఉద్యోగులను ఆదుకునేలా ప్రభుత్వం చొరవ:** ఎన్నికలకు ముందు సిబ్బంది సమస్యలు, పెండింగ్ బకాయిలు, బస్సుల కొరత వంటి అనేక సవాళ్లను ఆర్‌టిసి ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌టిసి పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యత ఇచ్చింది. ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సేవల మెరుగుదల, ఆధునీకరణ, ఆర్థిక బలోపేతం లక్ష్యంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. డ్రైవర్లు, కండక్టర్లు ఎక్కువసేపు విధులు నిర్వహిస్తూ కుటుంబాలకు దూరంగా పనిచేయాల్సి వస్తుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో సేవలు అందించే సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి నైట్ డ్యూటీకి రూ.150 చొప్పున నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగులకు నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు అదనపు ఆదాయం లభిస్తోంది. ఇది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఊరటనిస్తోంది. ప్రమోషన్ల విషయంలో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపశమనం కల్పించింది. 2020కు ముందు నియమితులై ప్రభుత్వ సేవల్లో విలీనమైన ఉద్యోగులకు పాత ఆర్‌టిసి మార్గదర్శకాలను పునరుద్ధరించడంతో సుమారు 7 వేల మందికి పదోన్నతులు లభించాయి. ఈ నిర్ణయం ఉద్యోగుల కెరీర్ పురోగతికి దోహదపడుతోంది. అనేక మంది ఉద్యోగులు పదోన్నతుల ద్వారా అధిక వేతనాలు, బాధ్యతలు పొందే అవకాశం కలిగింది.

**ఎస్‌బిఐ ప్రత్యేక బీమా పథకం ఉద్యోగులకు భద్రతా కవచం:** ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే పిటిడి ఉద్యోగులకు కూడా ఎస్‌బిఐఎస్‌జిపి పథకం వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించింది. రూ.1 కోటి ప్రమాద భీమా, సహజ మరణానికి రూ.10 లక్షల బీమా వంటి ప్రయోజనాలు ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక రక్షణగా నిలుస్తున్నాయి. జీరో బ్యాలెన్స్ ఖాతాలు, తక్కువ వడ్డీ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు ఉద్యోగుల ఆర్థిక అవసరాలను సులభతరం చేస్తున్నాయి. ఇక విరమణ అనంతరం వైద్య ఖర్చులు భారం అవుతాయని భావించే ఉద్యోగులకు ప్రభుత్వం జీవితాంతం ఇహెచ్‌ఎస్ వైద్య సేవలు అందేలా నిర్ణయం తీసుకుంది. రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు ఈ సదుపాయం పెద్ద ఊరటనిచ్చింది. ఈ చర్య ప్రభుత్వం ఉద్యోగులను కేవలం సేవా కాలంలో మాత్రమే కాకుండా, జీవితాంతం ఆదుకుంటుందనే నమ్మకాన్ని కల్పించింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించడం ద్వారా ప్రభుత్వం మానవత్వాన్ని చాటుకుంది. ముఖ్యంగా అర్హతల విషయంలో సడలింపులు ఇవ్వడం వల్ల అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించాయి.

**కొత్త బస్సులతో ఆధునిక ప్రయాణం:** 1,489 కొత్త బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం ప్రజా రవాణా సేవలను ఆధునికీకరించింది. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, స్టార్ లైనర్, వెన్నెల వంటి బస్సులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాయి. ఈ కొత్త బస్సులు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు ప్రజలకు సురక్షి తమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు 1450 ఈవీ బస్సులు త్వరలో రాబోతున్నాయి. ఇదే కాకుండా బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 338 బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించి ప్రజా రవాణా మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. ఆధునిక టాయిలెట్ బ్లాకులు, కూర్చునే సదుపాయాలు, ఫ్యాన్లు, శుభ్రత చర్యలు ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని కల్పిస్తున్నాయి. ప్రత్యేకంగా మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

**డిజిటల్ ఫీడ్‌బ్యాక్ వ్యవస్థప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం:** 129 బస్ స్టేషన్లలో డిజిటల్ స్కానర్ల ద్వారా ప్రయాణికుల అభిప్రాయాలను సేకరించే వ్యవస్థను ఆర్‌టిసి ఏర్పాటు చేసింది. ఆర్‌టిసి అందించే సేవలపై ప్రజలు తమ అభిప్రాయాలను నేరుగా తెలిపే అవకాశం కల్పిస్తోంది. ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సేవల నాణ్యతను మెరుగుపరచడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ప్రతి వారం ఆర్‌టిసి సేవలపై స్వయంగా సీఎం పర్యవేక్షిస్తున్నారు. మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఆర్‌టిసి పునర్వైభవానికి బలమైన పునాది వేశాయి. ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సేవల మెరుగుదల, ఆధునీకరణ, పర్యావరణహిత రవాణా వంటి అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన దూరదృష్టితో ఆర్‌టిసి రెండేళ్ల ప్రయాణం సాగింది. రెండేళ్లల్లో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రగతి రథ చక్రం పరుగులు పెడుతోంది.

## ఖరీఫ్‌కు వ్యవసాయ శాఖ పూర్తి సన్నద్ధత



**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఖరీఫ్-2026 సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు రాష్ట్ర వ్యవ సాయ శాఖ పూర్తి స్థాయి లో సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, జేడీలు, జిల్లా వ్యవసాయ అధికారులతో నిర్వహించిన వర్చువల్ సమీక్షలో మంత్రి ఖరీఫ్ సన్నద్ధతపై విస్తృతంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పంటల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా సరఫరా విషయంలో ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాల వారీగా నిల్వలపై పకడ్బందీగా పర్యవేక్షణ ఉండాలని, అధికారుల వద్ద ఉన్న లెక్కలకు వాస్తవ నిల్వలకు పొంతన ఉండేలా చూడాలని ఆయన హెచ్చరించారు. ఎరువుల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత డీలర్లపై తక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేక కార్డుల విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్డు ద్వారా అవసరానికి అనుగుణంగా యూరియా పొందే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. రైతులను సంప్రదాయ వ్యవసాయం నుంచి సుస్థిర, సహజ వ్యవసాయం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. నానో యూరియా, మిశ్రమ పంటలు, అంతర పంటల సాగును విస్తృతంగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువులు, విత్తనాల సరఫరా, నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఖరీఫ్ 2026ను విజయవంతంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.25 వేలు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త:** రోడ్డుప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ప్రజలు తమ సామాజిక బాధ్యతగా భావించి వైద్యశాలకు తరలించాలని ఇలా సాయం చేసిన వారికి పియం.రాహత్ పథకం ద్వారా రూ.25 వేల నగదు పురస్కారం లభిస్తుందని విజయవాడ వన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు తెలిపారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావుతో కలిసి సోమవారం వన్‌టౌన్ మోడల్ గెస్ట్‌హౌస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి వాహన దారులకు పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన గంటలోపు (గోల్డెన్ అవర్) క్షతగాత్రులను వైద్యశాలకు తరలిస్తే 99.9శాతం మందిని ప్రాణాపాయం నుండి కాపాడవచ్చన్నారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించి ప్రాణదాతలుగా మారాలని పిలుపునిచ్చారు.

## రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పా?: పేర్ని నాని

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి కోసం భూములిచ్చిన రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తప్పా అని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. సోమవారం తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మంత్రి నారాయణ సమాధానం చెప్పాలి కదా? ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే మాపై ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేస్తారా? మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి కోసం ఏం చేశారు. అమ రావతిలో అద్దాల కోసం రూ.2500 కోట్లు కేటాయించారు. భూములు ఇచ్చిన రైతులకు మీరేం చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసానికి రైతుల కష్టం తెలుసా? రైతులకు ఇచ్చిన ప్లాట్లలో పనులు జరుగుతున్నాయా? రైతుల కోసం నేను మాట్లాడితే యూట్యూబ్ నుంచి తొలగిస్తారా? చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా చమటలు పట్టిస్తోంది. అమరావతిలో మట్టి వ్యాపారం తప్ప మరేమీ జరగలేదు. నిత్యం వెయ్యి టిప్పర్లలో మట్టి తరలిపోతోంది. మట్టి మీదనే టీడీపీ ఎమ్మెల్యేలు దోచుకుంటున్నారని నాని ఆరోపించారు.

## శాసనవ్యవస్థ అధికారులు, సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసనవ్యవస్థ అధికారులు, సిబ్బంది కోసం ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని శాసన వ్యవస్థ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు శాసనవ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర తెలిపారు. ఫ్రైడ్ లోక్‌సభ సచివాలయానికి అనుబంధంగా ఉన్న పార్లమెంటరీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డెమొక్రసీస్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతుల్లో చట్టాల రూపకల్పన ప్రైవేట్ సభ్యుల బిల్లులు, తీర్మానాలు, ప్రజా ప్రాముఖ్యత గల విషయాలను ప్రస్తావించే సాధనాలు, సభ్యుల కోసం పరిశోధన సమాచారం, ప్రశ్నోత్తరాలు, శాసనవ్యవస్థలో బడ్జెట్ ప్రక్రియ, ఫైల్ నోటింగులు ముసాయిదాలు తయారీ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుంది.



### అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

## స్మార్ట్ పోలీసు స్టేషన్లు

### మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్

**శ్రీకాళహస్తి, మే 18 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు దూర దృష్టితో రాష్ట్రంలో ఐదు స్మార్ట్ పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శ్రీకాళహస్తిలో రూ.2.75 కోట్లతో నిర్మించిన టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత, అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు జవాబుదారిగా ఉండటానికి పోలీసుస్టేషన్లను నిర్మించినట్లు వివరించారు. ఇందులో శ్రీకాళహస్తి ఒకటని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. పుణ్యక్షేత్రంలోనూ, రాష్ట్రంలో ప్రజలుఈజ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్‌లో భాగంగా అత్యాధునికి సాంకేతిక పరిజ్ఞానంలో ఈ పోలీసు స్టేషన్‌ను నిర్మించినట్లు వివరించారు. ప్రజా ఫిర్యాదులను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించే విధానాన్ని అమలు చేస్తున్నామని అనిత అన్నారు. ఒక బైక్ చోరీ జరిగినా ఇతర నేరం నమోదైనా వాటి పురోగతిని జిల్లా ఎస్‌పి, హోంశాఖ ఒకే డిజిటల్ డ్యాస్‌బోర్డులో పరిశీలించే విధంగా సాంకేతికతను వినియోగిస్తున్నట్లు మంత్రి వివరించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించుటకు ఈ సరికొత్త వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కేసుల పురోగతిని నిరంతర పర్యవేక్షించే విధానం అమలులో ఉందని చెప్పారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా డిజిటల్ డెస్క్ సిస్టమ్ ద్వారా కేసులు పరిష్కారం మరింత వేగవంతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు నాయుడు, పేరం ధనంజయులు నాయుడు, పనబాక లక్ష్మీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్‌పి ఎల్‌సుబ్బరాయుడు ఇతర అధికారులు హాజరయ్యారు.



### వారసత్వ సంపదను అందించటంలో

## మ్యూజియంల పాత్ర కీలకం

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త:** భావితరాలకు మన సంస్కృతి, చరిత్ర, వారసత్వ సంపదను అందించటంలో మ్యూజియంల పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డాక్టర్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలోని బాపు మ్యూజియంలో ప్రత్యేక కార్యక్రమాలను రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాతో కలిసి డాక్టర్ బాలాజీ ప్రారంభించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ మ్యూజియంలు పురాతన వస్తువుల కేంద్రాలు మాత్రమే కాదని నాగరికత వికాసాన్ని ప్రతిబింబించే జ్ఞాననిలయాలుగా పేర్కొన్నారు. చిన్నారులు కేవలం మార్కుల వేటలో పడిపోకుండా మన చారిత్రక వారసత్వ వైభవాన్ని తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు.

# పాలనలో వేగం పై జాతీయ స్థాయిలో చర్చ

# పనితీరు బాగున్న వారికి గుర్తింపు, గౌరవం

- అధికారులు, కలెక్టర్లు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సిఎం టెలికాన్ఫరెన్స్
- ఆర్టీజీఎస్ నుంచి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది 40 వేల మందితో నేరుగా మాట్లాడిన చంద్రబాబు
- కాకినాడ జిల్లా ఉద్యోగికి సిఎం కితాబు

**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** సుపరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బ్రాండ్ తెచ్చేలా ఉన్నతస్థాయి అధికారి మొదలుకుని... క్షేత్ర స్థాయి అధికారి వరకు పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. తిలీదితి ప్రాజక్టు శంకుస్థాపన కార్యక్రమం జరిగిన తర్వాత ఏపీ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్స్ పై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి ముఖ్యమంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్సులో జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బందితో పాల్గొన్నారు. సుమారు 40 వేల మందితో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజలకు సంతృప్తికర సేవలు అందించడంలో టాప్3లో నెల్లూరు, తూర్పుగోదావరి, పల్నాడు జిల్లాల కలెక్టర్లు నిలిచారు. ఈ టెలి కాన్ఫరెన్సు ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ సేవల అమలు... అర్జీల పరిష్కారంపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందించే సేవల గురించి మరింత మెరుగైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై క్షేత్ర స్థాయి సిబ్బంది సలహాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఆ శాఖకు చెందిన కాకినాడ జిల్లాకు చెందిన ఉద్యోగి



నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడి.. కొన్ని సూచనలు చేశారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ మంచి సూచనలు చేశారని.. దీన్ని అమలు చేస్తామంటూ సీఎం చెప్పారు. కిందిస్థాయి ఉద్యోగులకు నేరుగా ముఖ్యమంత్రితో మాట్లాడే అవకాశం కల్పించినందుకు పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

**అర్జీల పరిష్కారంపై స్పెషల్ ఫోకస్:** "అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఆర్థిక ఆర్థికేతర సమస్యలుగా విభజించుకుని పని చేయాలి. ఆర్థికేతర సమస్యలను 100 శాతం పరిష్కరించాల్సిందే. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అన్ని చోట్లా రావాలి. అన్ని స్థాయిల్లో ఉండాలి. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టుకు 36 రోజుల్లో అనుమతులిచ్చి శంకుస్థాపన కార్యక్రమం చేపట్టాం. ఎంఎస్ఎంఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం స్పందించిన తీరుపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. అవినీతి అనేది కన్పించకూడదు.. పారదర్శకతతో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలి. నెల్లూరు కలెక్టర్ చేసిన ప్రయోగాన్ని చూసి ప్రతి నియోజకవర్గంలో నాలుగు సార్లు పర్యటనలు చేసేలా ప్రణాళికలు రూపొందించాం. వినతి పత్రాలు స్వీకరిస్తాం. సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. చిన్న చిన్న పనులైనా వెంటనే స్పందించాలి... సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలగాలి. మన పాలనకు బ్రాండుగా మారాలి. తక్కువ ఖర్చుతో ఇంపాక్ట్ చూపించేలా పనితీరు మెరుగుపర్చుకోవాలి. వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూసుకోవాలి." అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**డేటా, టెక్నాలజీ ఆధారంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై అలెర్టులు:** "ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాల్లో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలి. అడ్వాన్స్ డిసిజ్ సర్వైలెన్స్ సిస్టం ద్వారా వివిధ ప్రాంతాల్లో నమోదవుతున్న వ్యాధులను గుర్తించి అలెర్టులు పంపే విధానం బాగుంది. దీన్ని సంజీవనికి అనుసంధానం చేయాలి. ఏయే ప్రాంతాల్లో ఏయే రకాల పంటలు వేస్తే బాగుంటుందోననే అంశంపై అన్ని అంశాలు పరిశీలించి రైతులకు సూచనలు పంపాలి. ఇసుక లారీలు, వివిధ గనుల తరలించే లారీలను ట్రాక్ చేసేలా చూడాలి. ఏ వాహనామైనా నిబంధనలు ఉల్లంఘించినట్టు కన్పిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


# మెరుగుపడుతున్న పిహెచ్‌సిల పనితీరు

- ఆరు నెలల్లో 306 కేంద్రాల పనితీరు మరింత మెరుగు
- వైద్య ఆరోగ్య శాఖ స్వీయ సమీక్షతో సత్ఫలితాలు
- మంత్రి సత్యకుమార్‌కు నివేదించిన డిహెచ్ పద్మావతి




**విజయవాడ, మే 18 ప్రభాతవార్త ప్రతినిధి:** గత మార్చి నెలలో 1,144కు 312 పిహెచ్‌సి ఆసుపత్రులు ఎ శ్రేణిలో వచ్చాయి. గతేడాది అక్టోబరు నెలలో 107 పిహెచ్‌సిలు మాత్రమే ఎ శ్రేణిలో ఉన్నాయి. కేవలం ఆరు నెలల్లో మూడు రెట్లు ఎక్కువగా పిహెచ్‌సిలు, ఎ శ్రేణికి చేరుకోవడం గమనార్హం. ఇదే కాల వ్యవధిలో బి శ్రేణి ఆసుపత్రులు 354 నుంచి 455 కు చేరుకున్నాయి. సి, డి, ఇ గ్రేడుల ఆసుపత్రులు తగ్గుతూ వచ్చాయి. హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో నమోదుచేసే వివరాల ప్రకారం పిహెచ్‌సిల పనితీరును శ్రేణుల వారీగా గుర్తించి, సదరు నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందజేశారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు నెలల వారీగా 1144 పిహెచ్‌సిల పనితీరు మదింపు వివరాలను డిహెచ్ తన నివేదికలో పొందుపరిచారు. బి గ్రేడ్ కేంద్రాలు తన నివేదికలో పొందుపరిచారు. బి గ్రేడ్ కేంద్రాలు కిందటేడాది అక్టోబరులో 354 ఉండగా మార్చి నాటికి 455 చేరుకున్నాయి. సి గ్రేడులో 298 డి గ్రేడులో 72, ఇగ్రేడులో 7చొప్పున ఆసుపత్రులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1144 పిహెచ్‌సిలు ఉన్నాయి. ఓపికి 1, ఐపీ-1 ల్యాబ్‌టెస్టు-1, ప్రసవాలు-1 ఇతర ఒకటి చొప్పున కలిపి ఐదు మార్కులు ఇస్తున్నారు. పిహెచ్‌సిల ద్వారా రోగులకు అందచేసే సేవల వివరాల హెచ్‌ఎంఐఎస్ ఎప్పటికప్పుడు నమోదవుతున్నాయి. నెలకు 1500 ఓపి, 100 ఐపీ ల్యాబ్ టెస్టులు,-3000, పది చొప్పున జరగాలి. ఇంకొన్ని ఫలితాలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించి పనితీరు ప్రతిపాదికన పిహెచ్‌సిలకు వైద్య ఆరోగ్య శాఖ శ్రేణులు ఇస్తోంది. సమీక్షా సమావేశాల్లో తక్కువ పనితీరు కనబరిచే ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సత్యకుమార్ సమీక్ష సమావేశాల ద్వారా ఉన్నతాధికారులను ఆదేశిస్తున్నారు. వీటికి అనుగుణంగా జిల్లాలకు వెళ్లే ఆదేశానుసారం అక్కడి అధికారులు పిహెచ్‌సిల వైద్యులతో సమీక్షలు జరుపుతూ వైద్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల పిహెచ్‌సిల పనితీరు క్రమంగా మెరుగుపడుతోంది. దీనివల్ల సి, డి, ఇ గ్రేడ్లలో ఉన్న పిహెచ్‌సిలు తగ్గుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో కురబలకోట, పిహెచ్‌సి అక్టోబరు నుంచి మార్చి వరకు ప్రతినెలా ఎ శ్రేణిలో వచ్చింది. ఈస్టుగోదావరి జిల్లాలో బ్రహ్మణగూడెం, చాగల్లు, నల్లజర్ల పిహెచ్‌సిలు వరుసగా ఆరుసార్లు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. కాకినాడ జిలాలో తేటగుంట పిహెచ్‌సి ఆరుసార్లు ఇలా ప్రతి జిల్లాలో కొన్ని పిహెచ్‌సిలుఐ దు నుంచి మూడుసార్లు చొప్పున ఎ శ్రేణిలో వచ్చాయి. ఈ ఏడాది మార్చి నెల శ్రేణుల పరిశీలిస్తే వెస్టు గోదావరిలో 34కు, 33, కృష్ణా జిల్లాలో 49కు 42, వైఎస్సార్ కడప-57 కు 42, విజయనగరం జిల్లాలో 48కు 32 పిహెచ్‌సిలు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. పోలవరం జిల్లాలో 28 పిహెచ్‌సిలకు 2, మార్కాపురం జిల్లాలో 38కు 1, శ్రీకాకుళం జిల్లాలో 66కు ఒకటి, నెల్లూరు జిల్లాలో 52కు ఒకటి, చిత్తూరు జిల్లాలో 42కు పిహెచ్‌సి ఈ గ్రేడులో ఉన్నాయి. గత మార్చి నెలకు సంబంధించి డి గ్రేడ్ పిహెచ్‌సిలు రాష్ట్రవ్యాప్తంగా 72 ఉన్నాయి. ఇందులో అత్యధికంగా 10 చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో తొమ్మిది, పోలవరం జిల్లాలో 8, మన్యం, శ్రీకాకుళం జిల్లాలో ఏడు చొప్పున, ఏలూరు జిల్లాలో ఆరు చొప్పున డి గ్రేడ్ ఆసుపత్రులు ఉన్నాయి. గత మార్చి నెలలో ఇ గ్రేడు ఆసుపత్రులు ఏడు ఉంటే రెండు పోలవరం జిల్లాలో ఉన్నాయి. నెల్లూరు చిత్తూరు, మార్కాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలో ఒక్కొక్క పిహెచ్‌సి ఉంది.

# ఇషాన్‌దార్ : ప్లే ఆఫ్‌లో సన్‌రైజర్స్



**చెన్నై:** ఇషాన్ కిషన్(47 బంతుల్లో 70 రన్స్; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) షాన్‌దార్ ఇనింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్ బెర్త్ అందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్‌ను దాని సొంతగడ్డపై 5 వికెట్ల తేడాతో ఓడించింది. 181 పరుగుల లక్ష్యాన్ని మరో ఓవర్ ఉండగానే అందుకుంది. ఈ విజయంతో ఆరెంజ్ టీమ్ 16 పాయింట్లకు చేరు కోవడంతో గుజరాత్‌తో పాటు సన్‌రైజర్స్ ప్లే ఆఫ్‌బెర్త్‌లు ఖరారయ్యాయి. చెన్నై సూపర్ కింగ్స్ 12 పాయింట్లకే పరిమితమై ప్లే ఆఫ్‌కు దూరమైంది.

181 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కొనసాగించిన సన్‌రైజర్స్ ఆరంభంలోనే ట్రావిస్ హెడ్(6) వికెట్ కోల్పోయింది. అభిషేక్ శర్మ(26) పరవాలేదనిపించాడు. ఈ దశలో ఇషాన్ కిషన్, హెన్రీ క్లాసెన్(26 బంతుల్లో 47; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు).. మూడో వికెట్‌కు 75 పరుగులు జోడించి ఆదుకున్నారు. ఈ క్రమంలో క్లాసెన్ స్టంపవుటవగా, నితీష్(13) కూడా వెంటనే అవుటవడంతో మ్యాచ్ ఉత్కంఠకు చేరింది. మరోవైపు నిబ్బరంగా బ్యాటింగ్ చేసిన ఇషాన్ కిషన్ అర్ధ సెంచరీ చేయడంతో పాటు ముకేష్ 18వ ఓవర్లో 4, 6సిక్స్‌తో గెలుపుకు చేరువచేశాడు. 19వ ఓవర్ తొలి బంతికి అరోరా సిక్స్ బాదాడు. మూడో బంతికి కిషన్ అవుటైనా, చివరి బంతికి రవిచంద్రన్ బౌండరీతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.



అంతకుమందు మొదట బ్యాటింగ్ చేసిన సీఎస్‌కే 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 180 పరుగుల స్వల్ప స్కోరుకే పరిమితమైంది. నితీష్ వేసిన తొలి ఓవర్లో సంజూ(13 బంతుల్లో 27)ఎదురుదాడికి దిగాడు. తొలి బంతికే సిక్స్, ఆ తర్వాతి బంతికి బౌండరీ బాదిన సంజూ.. చివరి బంతికి మరో ఫోర్‌తో 17రన్స్ సాధించాడు. ఇక ప్రఫుల్ ఓవర్లో వరుసగా మూడు బౌండరీలతో చెలరేగాడు. ఈ దశలో బౌలింగ్‌కు వస్తూనే కమిన్స్.. డేంజరస్ సంజూను అవుట్ చేసి సన్‌రైజర్స్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఉర్విల్(13) కూడా వస్తూనే బ్యాక్ టు బ్యాక్ సిక్స్‌లతో అలరించినా... అతని ఇన్నింగ్స్‌కు సాకిబ్ తెరదించాడు.

**మిడిల్ ఆర్డర్ తడబాటు:** వన్ డౌన్‌లో వచ్చిన కార్తీక్ శర్మ(32) అదిరిపోయే హిట్టింగ్‌తో 3 ఫోర్లు, 2 సిక్సర్లు బాది మంచి ఊపులో కనిపించాడు. ప్యాట్ కమిన్స్ రెండోసారి బౌలింగ్‌కు వచ్చి చెన్నైని దెబ్బకొట్టాడు. మొదట కార్తీక్‌ను, ఆ తర్వాతి ఓవర్లో రుతురాజ్ గైక్వాడ్ (15)ను అవుట్ చేశాడు.

**బ్రెవిస్ షో.. చివర్లో దూబే మెరుపులు:** వరుసగా వికెట్లు పడుతున్నా.. క్రీజ్‌లోకి వచ్చిన బ్రెవిస్(27 బంతుల్లో 44) సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. గ్రౌండ్ నలుమూలలా షాట్లు ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్ దూబే(26) కూడా ఓ చేయి వేయడంతో చెన్నై 180 మార్క్‌ను అందుకుంది. సన్‌రైజర్స్ బౌలర్లలో కమిన్స్ 3 వికెట్లు, సాకిబ్ 2 వికెట్లు...ప్రఫుల్, మలింగ చెరో వికెట్ పడగొట్టి చెన్నైను కట్టడి చేశారు.

# రికార్డుల వండర్



(వార్త క్రీడా విభాగం)

వైభవ్ సూర్యవంశీ.. ఈ 15 ఏళ్ల క్రికెట్ వండర్ ముందు రికార్డులు మోకరిల్లుతున్నాయి. తాజాగా ఐపీఎల్‌లో ఒకే సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో బాదిన మూడు సిక్స్‌లతో కలుపుకుని సిక్సర్ల సంఖ్య 44కు చేరింది. ఇప్పటివరకు ఈ రికార్డు అభిషేక్ శర్మ(2024, 42 సిక్స్‌లు) పేరిట ఉండేది. శ్రేయాస్ అయ్యర్(2025, 39 సిక్స్‌లు), విరాట్ కోహ్లి(2024, 38 సిక్స్‌లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఐపీఎల్ ఒక సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు రికార్డు ఇప్పటికీ క్రిస్ గేల్(59) పేరిటే ఉంది. మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సిన వైభవ్.. ఈ ఫీట్‌ను అందుకున్నా ఆశ్చర్యం లేదు.

భారత యువ క్రికెట్‌లో ఇటీవలి కాలంలో ప్రత్యేకంగా నిలుస్తున్న పేరు వైభవ్ సూర్యవంశీ. చిన్న వయస్సులోనే అతడు చూపిస్తున్న స్థిరమైన బ్యాటింగ్ ప్రతిభ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఒత్తిడిని తట్టుకుని ఇన్నింగ్స్‌ను నిర్మించగల సామర్థ్యం అతనిని భవిష్యత్ స్టార్‌గా నిలబెడుతోంది. పవర్ హిట్టింగ్‌పై మాత్రమే ఆధారపడకుండా, బంతిని గమనించి సరైన షాట్లను ఆడటం అతని ప్రత్యేకత. యువ వయస్సులోనే ఒత్తిడి పరిస్థితుల్లో నిలబడటం వైభవ్ మానసిక దృఢత్వాన్ని తెలియజేస్తోంది.

గత ఏడాది ఐపీఎల్ ఆరంగేట్రంతోనే సంచలన తారగా ఆవిర్భవించిన వైభవ్.. ఏడు మ్యాచ్‌ల్లో 206 స్ట్రయిక్ రేట్‌తో 252 పరుగులు సాధించాడు. అందులో ఓ సెంచరీ, ఓ అర్ధసెంచరీ ఉన్నాయి. ఏడు మ్యాచ్‌ల్లో 24 సిక్స్‌లు బాదాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. గతంలో కంటే స్థిరంగా ఆడుతున్నాడు. 12 మ్యాచ్‌ల్లో సింగిల్ డిజిట్ స్కోర్లు కేవలం మూడు సార్లే. మొత్తంగా ఈ సీజన్‌లో 12మ్యాచ్‌లాడిన వైభవ్ 234.78 స్ట్రయిక్‌రేట్‌తో 486 రన్స్ సాధించాడు. అందులో ఓ సెంచరీ, మరో అర్ధసెంచరీ ఉన్నాయి. 43 ఫోర్లు, 44 సిక్స్‌లు బాదాడు. ఇండియన్స్‌పై 39 పరుగులతో ఈ సీజన్ స్టార్ట్ చేసిన వండర్ కిడ్... సన్‌రైజర్స్‌పై జైపూర్‌లో 35బంతుల్లోనే తుఫాన్ సెంచరీతో, ఆర్సీబీపై 78 రన్స్‌తో చెలరేగాడు. ఇక డీసీపై 46 రన్స్, గుజరాత్‌పై 36 రన్స్, పంజాబ్‌పై 43 రన్స్, కేకేఆర్‌పై 46 రన్స్ చేశాడు. వయసుకు మించి పెద్దఇన్నింగ్స్ ఆడుతున్న వైభవ్ నుంచి రాజస్థాన్ రాయల్స్, ఫ్యాన్స్ ఇంకా పెద్ద ఇన్నింగ్స్‌లో ఆశిస్తున్నారు. దీంతో అతనిపై మరింత ఒత్తిడి పెరుగుతోంది.

వైభవ్ గత ఐపీఎల్ కటే ఈ ఐపీఎల్‌కు మరింత పరిణతి సాధించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆటను మార్చుకునే నైపుణ్యం అతనిలో కనిపిస్తోంది. ప్రారంభంలో వేగాన్ని పెంచడం ద్వారా జట్టుకు అవసరమైన పరుగులను అందిస్తున్నాడు. అతని టెక్నిక్ కూడా అమోఘం. ఫాస్ట్ బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొనడం,స్పిన్నర్లపై ఫుట్‌వర్క్‌తో ఆధిపత్యం చలాయిస్తున్నాడు. ఈఆటతీరే ఇతర యువ ఆటగాళ్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెడుతోంది.

వైభవ్ బ్యాటింగ్ మరింత స్థిరంగా మారాలంటే షాట్ల ఎంపికలో సయమనం పాటించాలని పలువురు మాజీలు సూచిస్తున్నారు. ఈ కొద్ది మార్పులు చేసుకుంటే 30, 40 పరుగులను బిగ్ స్కోర్లుగా మారతాయని పేర్కొంటున్నారు. మొదటి బంతికే సిక్స్ అని కాకుండా అభిషేక్ ఎలాగైతే మార్పుచేసుకున్నాడో వైభవ్ కూడా మారాల్సిందేనంటున్నారు. దూకుడే ప్రతిదానికి పరమమంత్ర కాదని సూచిస్తున్నారు.

# గోల్డెన్ మాస్టర్స్ సాధించిన సినెర్



**రోమ్:** పురుషుల టెన్నిస్ ప్రపంచ నెంబర్ వన్ యానిక్ సినెర్ అరుదైన ఘనత అందుకున్నాడు. గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు. ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ సొంతగడ్డపై రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్ చేజిక్కించుకున్నాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-4తో వరుస సెట్లలో నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్‌పై అలవోకగా గెలుపొందాడు. సినెర్ బలమైన సర్వీసులు, ప్లేసింగ్‌ల ముందు రూడ్ నిలవలేకపోయాడు. సినెర్‌కు 10,07,165యూరోల (రూ. 11 కోట్ల 23 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఈ టైటిల్‌తో యానిక్ సినెర్.. కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత పూర్తి చేశాడు. మాస్టర్స్ సిరీస్-1000లో భాగంగా జరిగే తొమ్మిది వేర్వేరు టోర్నీలన్నింటిలో విజేతగా నిలిచిన రెండో ప్లేయర్‌గా సినెర్ నిలిచాడు. మయామి, మాడ్రిడ్, మోంటె కార్లో, ఇండియన్ వెల్స్, రోమ్, పారిస్, షాంఘై, సిన్సినాటి, కెనడా ఓపెన్ టైటిల్స్ సాధించాడు. సినెర్ కెరీర్‌లో ఇది 10వ మాస్టర్స్ సిరీస్ టైటిల్. మయామి ఓపెన్‌ను రెండుసార్లు నెగ్గిన సినెర్.. మిగతా ఎనిమిదింటిని ఒక్కోసారి సాధించాడు. 1990లో మాస్టర్స్ సిరీస్ మొదలుకాగా... ఇప్పటివరకు నొవాక్ జొకోవిచ్ మాత్రమే రెండుసార్లు 2018లో, 2020లో కెరీర్ గోల్డెన్ మాస్టర్స్ ఘనత సాధించాడు.

# ముష్ఫికర్ సూపర్ సెంచరీ, పాక్ ముందు భారీ లక్ష్యం

**సైల్హెట్:** పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండు టెస్ట్‌లోనూ బంగ్లాదేశ్ పట్టు బిగించింది. ముష్ఫికర్ రహీమ్(233 బంతుల్లో 137; 12 ఫోర్లు) సూపర్ సెంచరీకి తోడు లిటన్ దాస్(92 బంతుల్లో 69) రాణించడంతో బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌లో 390పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 46 పరుగులు కలుపుకుని 437 పరుగుల భారీ లక్ష్యాన్ని పాకిస్థాన్ ముందుంచింది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులు చేయగా, పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 232 రన్స్‌కు ఆలౌటైంది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలి ఉంది. తొలి టెస్ట్‌లో ఘనవిజయం సాధించిన బంగ్లాదేశ్ ఈ టెస్ట్‌లోనూ నెగ్గి రెండు టెస్ట్‌ల సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడంపై దృష్టి పెట్టింది.

మూడో రోజు ఆటలో ముష్ఫికర్, లిటన్‌దాస్ పాక్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొన్నారు. అయిదో వికెట్‌కు శతక భాగస్వామ్యాన్ని అందించారు. ఆ తర్వాత కూడా ముష్ఫికర్ జోరు చూపి సెంచరీ పూర్తి చేశాడు. ఇది టెస్ట్‌ల్లో ముష్ఫికర్‌కు 14వ శతకం. బంగ్లా తరఫున టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా ముష్ఫికర్ నిలిచాడు.

# ఆల్‌టైమ్ కనిష్టానికి డాలర్ వర్సెస్ రూపాయి




**ముంబయి, మే18:** భారతకరెన్సీ రూపాయి విలువ సోమవారం చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.2 శాతం క్షీణించి 96.20వద్ద ఆల్ టైమ్ కనిష్టానికి చేరింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో భారీ పతనం నమోదైంది. గత శుక్రవారం తొలిసారిగా 96 మార్కును దాటిన రూపాయి, ఈ సోమవారం మరింత బలహీనపడింది. ముఖ్యంగా ముడి చమురు ధరలు పెరగడం రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచుతోంది. యూఏఈలోని ఓ అణు విద్యుత్ కేంద్రంపై దాడి జరిగిందన్న వార్తల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 111 డాలర్లకు పెరిగింది. దీనికి తోడు ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యలకు దిగవచ్చున్న సంకేతాలు కూడా ఆందోళనలను పెంచుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో డాలర్‌కు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరిగింది. రూపాయి రికార్డు స్థాయి పతనం దేశ స్థూల ఆర్థిక దృక్పథంపై ఆందోళనలను తీవ్రతరం చేస్తోంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ఇంధన ధరల ఒత్తిడి కారణంగా డాలర్‌కు డిమాండ్ పెరిగి రూపాయి 96 స్థాయిని దాటింది. దీనివల్ల దిగుమతుల బిల్లు, ద్రవ్యోల్బణం పెరిగి, ఆర్థిక వృద్ధి మందగించే ప్రమాదం ఉందని ఎన్రిచ్ మనీ సీఈవో పొన్ముడి ఆర్ తెలిపారు. ఈ బలహీన సెంటిమెంట్ స్టాక్ మార్కెట్లపైనా ప్రభావం చూపింది. సెన్సెక్స్ 808 పాయింట్లు, నిఫ్టీ 247పాయింట్ల నష్టంతో ప్రారంభమయ్యాయి. మరోవైపు, రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం, ఆర్బీఐ చర్యలు చేపట్టాయి. వెండిదిగుమతులపై ఆంక్షలు విధించడంతో పాటు, కరెన్సీ మార్కెట్లలో ఆర్బీఐ జోక్యం చేసుకుంటోంది. ప్రత్యేక డాలర్ విక్రయాల కౌంటర్లు ప్రారంభించింది. ఈ వారమంతా రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు.

# జిడిపిలో 2.3 శాతంగా కరెంట్ ఖాతా లోటు



**న్యూఢిల్లీ, మే 18:** భారత్ కరెంటుఖాతాలోను ఈ ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో 2.3శాతంగా ఉంటుందని విదేశీ బ్రోకరేజి సంస్థ సోమవారం ప్రకటించింది. చెల్లింపుల్లో సమతుల్యత లోటు కూడా 65బిలియన్ డాలర్లుగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉంటుందని, అదే గత ఏడాది 35 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు హెచ్‌ఎస్‌బిసి సంస్థ వెల్లడించింది. ముడిచమురుదరలు సగటున బ్యారెల్‌కు 95 డాలర్లుగా ఉంటాయని, చమురు, బంగారం, కీలక ఉత్పత్తులు, సేవలరంగ వాణిజ్యం, విదేశీ జమలు కూడా కరెంటు ఖాతాలోటును జిడిపిలో 2.3 శాతానికి చేరుస్తాయని, అదే గత ఏడాది 0.9శాతంగా ఉందని సంస్థ ప్రకటించింది బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ అంచనాలు కూడా ఎఫ్‌పిఐ నిధుల రాక, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, విదేశీ వాణిజ్య రుణాల ధోరణుల ఆధారంగా ఉంటాయని ప్రకటించింది. విదేశీ రిజర్వులు 700 బిలియన్ డాలర్ల వరకూ ఉంటాయని, అందువల్లనే ఖజానా పరిపుష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పెట్రోలుధరల పెంపు కారణంగా అదనంగా 2/3వంతు నిధులు అవసరం అవుతున్నాయని అంచనావేసింది. ఇటీవలే సంతకాలుచేసిన వాణిజ్య డీల్స్‌తో భారత్ వృద్ధి అవకాశాలు మరింతపెరుగుతాయని, ఎఫ్‌డిఐల రాక మరింత పెరగవచ్చని అంచనావేసింది. విదేశీ పెట్టుబడులపై భారత పన్నుల వ్యవస్థ తీరుతెన్నులు కూడా జిడిపిపై ప్రభావంచూపిస్తాయని అంచనావేసింది.

# నాలుగు కేటగిరీలుగా టిసిఎస్ ఇంక్రిమెంట్లు

**ముంబయి, మే 18:** ఐటిసేవలరంగ దిగ్గజం టిసిఎస్ ఉద్యోగులకు 6 నుంచి 8శాతం వేతనాల నుపెంచుతున్నట్లుప్రకటించింది. అత్యధిక పని తీరు చూపించిన ఉద్యోగులను టాప్‌రేటింగ్‌గ్రేడ్ అంటే ఏప్లస్ కేటగిరిలో చేర్చింది. వీరికి 10శాతం జీతాల పెంపునుప్రకటించింది. గత ఏడాదినుంచి ఎదుర్కొంటున్న గ్లోబల్ అనిశ్చితులనుంచి రికవరీ అవుతున్న కంపెనీ సహజంగా ఇచ్చే వేతన పెంపునే ప్రకటించింది. దీనితోజీతాల పెంపు కూడా కొంత జాప్యం జరిగింది. స్థూల ఆర్థికవ్యవస్థలో ఉన్న అనిశ్చితులకారణంగానే వేతన పెంపును సెప్టెంబరుకు వాయిదాడేసింది. అయితే ఏప్రిల్‌లో మాత్రం కంపెనీ తమ ఉద్యోగులకు ఏప్రిల్‌నుంచే వేతన పెంపు వర్తిస్తుందని ప్రకటించింది. ఉద్యోగులను కంపెనీ ఏప్లస్,ఏ, బి, సి కేటగిరీలుగా వర్గీకరించింది. కంపెనీ నాలుగోత్రైమాసికంలోప్రకటించిన ఫలితాలకు అనుగుణంగా ఈ వేతన పెంపు ఉంది. అర్హత కలిగిన ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లు కూడా ఇచ్చామని, అదనంగా భారత్‌లోని అందరు ఉద్యోగులకు కొత్త లేబర్ కోడ్‌లను పరిగణనలోనికి తీసుకుని అదనపు ప్యాకేజిలు కూడా వర్తింపచేసినట్లు వెల్లడించింది. వరించిన వేతన ప్యాకేజిలతో ఉద్యోగులకు మరింత ప్రయోజనం ఉంటుందని వెల్లడించింది. కంపెనీలో తక్కువ కేడర్ ఉద్యోగులకు 2-3 శాతం వేతన పెంపు ఉంటే విదేశీ ఉద్యోగులకు 2-4 శాతంమాత్రమేప్రకటించింది.

# చివరి నిమిషం ఐటి ర్యాలీతో.. స్వల్పలాభాల్లో స్టాక్ మార్కెట్లు

వాణిజ్యం




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. రోజులో చాలా వరకు నష్టాల్లో ట్రేడ్ అయిన సూచీలు, చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద, నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడ్డాయి. వారం ప్రారంభ రోజున ట్రేడింగ్‌లో ఐటీ రంగం గరిష్టంగా ప్రకాశించింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతానికి పైగా పెరిగింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో ఇన్వెస్టర్లు రక్షణాత్మక రంగాలైన ఫార్మా, హెల్త్‌కేర్ వైపు మొగ్గు చూపారు. దీంతో ఆ రంగాల షేర్లలో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. బ్రాడర్ మార్కెట్‌లో మాత్రం అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.15 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.26 శాతం మేర నష్టపోయాయి.

నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు అత్యధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలపై వాటి ప్రభావం వంటి అంశాలపై ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఇన్ఫోసిస్ 2.15శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.76శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 0.50శాతం సూచీలకు మద్దతుగా నిలిచాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.43శాతం, స్మాల్ క్యాప్ సూచీ 1.71శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లలో బిఎస్ఇ పరంగా 1264 కంపెనీల షేర్లుపెరిగితే 3034 షేర్లు పతనం చెందాయి. 205 షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా నిలిచాయి. ముందురోజు 95.81 కంటే గణనీయంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు రూ.1,58,666కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు బ్యారెల్ ఒక్కింటికి 110.29 డాలర్లుగా కొనసాగింది.

ఇక కంపెనీలపరంగా గ్లాండ్ ఫార్మా 15.64 శాతం ఎరిగింది. బిఎస్ఇ షేర్లు కూడా 2.96శాతం పెరిగితే ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ బీమా 3.89శాతం క్షీణించింది. విఐపి ఇండస్ట్రీస్ 3.96శాతం,భారత్ వైర్‌రోప్స్ 4.07శాతం క్షీణించాయి. నియోజెన్ కెమికల్స్ 0.94 శాతం పెరిగింది. వొడాఫోన్ ఐడియా 0.46 శాతం కెఇసి ఇంటర్నేషనల్ 11.14 శాతం చొప్పున క్షీణించాయి. అలాగే కొచ్చిన్ షిప్‌యార్డ్ 5.11 శాతం, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా 1.17 శాతం, హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్‌కంపెనీ 3.24శాతం క్షీణించాయి.

## ఖర్చులు తగ్గించుకోండి.. వర్చువల్ సమీక్షలే చేయండి!

# బ్యాంకులు, బీమా సంస్థలకు కేంద్రం ఆదేశాలు

**న్యూఢిల్లీ, మే 18:** ఖర్చులను భారీగా తగ్గించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రభుత్వ బీమా సంస్థలు, ఆర్థిక సంస్థలకు సోమవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు చర్యల్లో భాగంగా ప్రయాణాలపై తీవ్ర ఆంక్షలు విధించడంతో పాటు దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) వంటి దిగ్గజ సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఉద్యోగులకు వర్తించనున్నాయి. ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వుల ప్రకారం అత్యవసరమైతే తప్ప అన్ని రకాల సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే నిర్వహించాలి. సంస్థల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (సీఈఓ) విదేశీ ప్రయాణాల్లో పరిమితులుపాటించాలని తెలిపింది. సాధ్యమైనంత వరకు విదేశీ సమావేశాలకు వర్చువల్‌గానే హాజరుకావాలని పేర్కొంది. ప్రధాన కార్యాలయాలు, బ్రాంచ్ ఆఫీసుల్లో ప్రస్తుతం అద్దెకు వాడుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో వీలైనంత వరకు ఎలక్ట్రిక్ కార్లను ప్రవేశపెట్టాలని ఆదేశించింది. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల ఏర్పడే ఆర్థిక ప్రభావాలను తట్టుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవాలని, పొదుపు పాటించాలని ప్రధానమంత్రి గతవారం పిలుపునిచ్చారు. పశ్చిమాసియాలో సుదీర్ఘకాలంగా సాగుతున్న ఉద్రిక్తతల వల్ల దేశ ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే భారత కరెన్సీ రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడానికి ఇప్పటికే పలు రాష్ట్రాలు తమ ఉద్యోగులకు వారానికి 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్‌సౌకర్యాన్ని కూడా కల్పించాయి.









# హెచ్‌డిఎఫ్‌సిని వెనక్కి నెట్టిన ఎయిర్‌టెల్

**ముంబయి, మే18:** టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ సరికొత్త రికార్డు సృష్టించింది. దేశీయ స్టాక్ మార్కెట్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌ను వెనక్కి నెట్టింది. దేశంలో రెండో అత్యంత విలువైన కంపెనీగా అవతరించింది. సోమవారం నాటి ట్రేడింగ్‌లో ఎయిర్‌టెల్ షేర్లు రెండు శాతానికి పైగా లాభపడటంతో ఈ రికార్డు సాధ్యమైంది. ఒక దశలో ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ ఏకంగా రూ.11.90 లక్షల కోట్లకు చేరింది. అదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.11.86 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఎయిర్‌టెల్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం దేశంలో రూ.18.09 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ మొదటి స్థానంలో కొనసాగుతోంది.

గత వారం రోజుల్లో ఎయిర్‌టెల్ షేర్లు 10 శాతం మేర లాభపడ్డాయి. కానీ ఇదే సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కేవలం 1 శాతం మాత్రమే పెరిగాయి. గత ఆరు నెలల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 22 శాతం మేర పతనమవడం గమనార్హం. బ్యాంక్ పార్ట్ టైమ్ ఛైర్మన్ అతనుచక్రవర్తి రాజీనామా చేయడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఆర్థిక ఫలితాల విషయానికి వస్తే మార్చి31తో ముగిసిన త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్థిరమైన ప్రదర్శన కనబర్చింది. ఈ బ్యాంక్ నికర లాభం 10.9 శాతం పెరిగి రూ.1,912కోట్లకు చేరింది. బ్యాంక్ నికర ఆదాయం కూడా 3.2 శాతం వృద్ధితో రూ.3,380 కోట్లుగా నమోదైంది. నిరర్థక ఆస్తులు 1.15 శాతంతో స్థిరంగా ఉన్నాయి.

మరోవైపు టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ నికర లాభం ఈ త్రైమాసికంలో 34 శాతం తగ్గింది. ఈ క్వార్టర్‌లో ఎయిర్‌టెల్ రూ.7,325 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే క్వార్టర్‌లో కంపెనీకి రూ.11,021 కోట్ల లాభం వచ్చింది. గత ఏడాది లాభాల్లో రూ.2,892 కోట్ల పన్ను మినహాయింపు కలిసి రావడమే ఈ వ్యత్యాసానికి కారణమని ఎయిర్‌టెల్ పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం మంగళవారం 19 మే 2026 I

# ఉత్కంఠ భరితంగా జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలు

## 4 వ రోజు విజేతలకు బహుమతులు అందజేత.

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,మే 18** స్థానిక శ్రీ సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ హెల్త్ అండ్ ఫిట్నెస్ క్లబ్ అసోసియేషన్ వారి నిర్వహణలో 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ లు ఉత్సాహభరితంగా సాగుతున్నాయి.దేశంలోని 29 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు. ఉదయం జరిగిన 74 కేజీ సబ్ జూనియర్,జూనియర్ విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమానికి అతిథిగా ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె సతీష్ కుమార్ హాజరయ్యారు.



జాతీయ సమైక్యతకు,సమగ్రతకు ఈక్రీడాపోటీల వేదికలు వారిదిగా జాతీయత భావాన్ని పెంచడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.సత్యనారాయణ టెంట్ హౌస్ అధినేత రాకుర్తి ప్రసాద్, బ్రదర్స్,గారపాటి చంద్రశేఖర్, వెలగట్ల జగదీష్, పప్పుల శ్రీరామ్ చంద్రమూర్తి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పీటి మూర్తి, కట్ట పురుషోత్తం, వాకాడ భాను, దొమ్మేటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోటీల విజేతల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు. సాయంత్రం జరిగిన 84 కేజీ మెన్,సబ్ జూనియర్,జూనియర్ విజేతలకు బహుమతి ప్రధానం లో జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ పాల్గొని మాట్లాడుతూ ఈఅమలాపురం మారుమూల ప్రాంతంలో దేశంలో క్రీడాకారులు తమ ప్రతిభ కనబర్చుకొనే వేదిక చేసినందుకు ముందుగా ఎంపీ హరీష్ కి ధన్యవాదములు తెలిపారు. ఇసుకపట్ల రఘుబాబు, ఆంధ్రప్రదేశ్ చైల్డ్ హక్కుల కమిషన్ మెంబెర్ కొప్పుల మానస, రాష్ట్ర హ్యాండీక్యాప్డ్ డైరెక్టర్ ఆర్ డి ఎస్ ప్రసాద్,నల్లా అజయ్,నల్లా సంజయ్,నల్లా వెంకటేశ్వర రావు,జంపన సుమన్ వర్మ,ఏడిద శ్రీను,ఆకుల సూర్య నారాయణ మూర్తి, సుధా చిన్న,మహాదశ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పీజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలు పెండింగ్ లో ఉండకూడదు

## జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, మే 18( ప్రభాతవార్త)** పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలను అధికారులు పెండింగ్లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగిన పి జి ఆర్ ఎస్ లో ఆమె పాల్గొని అర్జీదారుల నుంచి వినతుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా పరిష్కార మార్గం కోసం అందుతున్న ప్రతి అర్జీని సంబంధిత అధికారులు తప్పనిసరిగా 24 గంటల్లో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడం ప్రతి శాఖ బాధ్యతని పేర్కొన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీలు వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ క్లినిక్ 116 అర్జీలు రాగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధికి 45, హోం 23, పాఠశాల విద్యా 11, వ్యవసాయం, సహకారం 6, ఇంధన శాఖ 6 జలవనరుల శాఖ 6, సాంఘిక సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ ,పరిశ్రమలు వాణిజ్యం, పురపాలక శాఖ, పౌర సరఫరాలు, పశుసంవర్ధక శాఖ స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు తదితర శాఖలకు చెందిన 30 అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై మేఘ స్వరూప్, రెవిన్యూ అధికారి టి సీతారామమూర్తి, ఎస్డీలు ఆర్ ప్రేమ్ కుమార్, మహేష్ ,మనోజ్ ,సి పి ఓ ఎల్ అప్పలకొండ, డిపిస్పి శివప్రియ ,డి ఎల్ డి ఓ పి వీణా దేవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తనిఖీలు నిర్వహించిన కొనసాగుతున్న మోసాలు

## 77.5 కేజీలకు పైగా ధాన్యం తూసుకొంటున్న మిల్లర్లు

## మండిపడుతున్న రైతులు



**గొల్లప్రోలు,(ప్రభాతవార్త)** పిఠాపురం ఏరియా పరిధిలో మూడు రోజుల పాటు అధికారులు తనిఖీలు నిర్వహించి అధికంగా ధాన్యం తూసుకో వద్దని హెచ్చరించిన మిల్లర్లలో ఎటువంటి మార్పు రాలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బస్తా ధాన్యం 76.2 కేజీలకు మించి తూకాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేసిన రైస్ మిల్లర్లు పట్టించుకోకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.జిల్లా రెవెన్యూ అధికారులు,సివిల్ సప్లైస్ అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ గతంలో వలె కమిషన్ దారులతో 77.5 కేజీలు పట్టుబడి చేయించి రైస్ మిల్లులకు తరలిస్తున్నారు.దీంతో రైతులు ఒక ధాన్యం బస్తా వద్ద కేజీ నుండి కేజీన్నర వరకు నష్టపోతున్నారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సివిల్ సప్లైస్ అధికారులు ధాన్యం కళ్లాలు,రైస్ మిల్లులలో వే బ్రిడ్జి కాటాలను తనిఖీ చేయడమే కాకుండా రైతులు వద్ద ధాన్యం 76.2 మించి అధికంగా తూకాలు తూసుకోవద్దని రైస్ మిల్లుల యజమానులకు తెలిపిన ఫలితం లేకుండా పోయిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.అధికారులు తనిఖీలు ముగించుకుని ఇలా వెళ్లిన వెంటనే యథా ప్రకారం మిల్లర్లు ధాన్యం దోపిడీ మొదలుపెట్టారన్న ఆరోపణలు గుప్పు మంటున్నాయి.ధాన్యం అధికంగా తూసుకోవడమే కాకుండా రైస్ మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి రైతులు పండించిన ధాన్యం మొత్తం (మిషన్ కటింగ్) క్వింటాకు సుమారు 1800 రూపాయలు లోపే కొనుగోలు చేసినట్లు తెలియ వచ్చింది. రైతుల వద్ద కొనుగోలు చేసిన దాన్యంలో 2 కేజీలు వరకు అధికంగా తూసుకోగా, మిల్లర్లు విక్రయించే బియ్యం ప్యాకెట్లు మాత్రం 25 కేజీలకి బదులు 24 కేజీల ప్యాకింగ్ చేసి ప్రజలకు అంటగడుతున్నట్లు పలువురు తెలిపారు.అన్నదాతలను మోసం చేసి క్వింటాకి 2 కేజీలు పైగా సేకరిస్తున్న మిల్లర్లు ప్రజలకు విక్రయించే బియ్యం ప్యాకెట్లలో మాత్రం క్వింటాకు 5 కేజీల నుండి 6 కేజీల వరకు చూపించి మోసాలకు పాల్పడటంపై రైతులు మండిపడుతున్నారు.ధాన్యం సీజన్ ప్రారంభంలో నామ మాత్రం ధరకే కొనుగోలు చేసిన రైస్ మిల్లర్లు సీజన్ చివరిలో (రైతుల వద్ద ధాన్యం అయిపోయిన తర్వాత) ఒక్కసారిగా మార్కెట్లో ధాన్యం ధరను పెంచేశారు. దీంతో ఆకస్మాత్తుగా బియ్యం ధరకు డిమాండ్ ఏర్పడేలా చేస్తున్నారు. గొల్లప్రోలు మార్కెట్లో గడచిన 20 రోజుల క్రితం బిపిటి కొత్త క్వింటా బియ్యం ధర రూ.4500 పలకగా ప్రస్తుతం మిల్లర్లు క్వింటాకు 400 పెంచడంతో బియ్యం బహిరంగ మార్కెట్లో 4900 రూపాయలు వరకు చేరుకుంది.

**కోట్లకు పడగలెత్తిన మిల్లర్లు**

రైతుల వద్ద నామ మాత్రం ధరకే ధాన్యం కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్న మిల్లర్లు సీజన్ అనంతరం అమాంతంగా ధాన్యంకు గిరాకీ సృష్టించి అధిక ధరలకు బియ్యం విక్రయిస్తూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నట్లు తెలుస్తోంది.దీనికి తోడు గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ,రూరల్ కు చెందిన కొంత మంది రైస్ మిల్లర్లు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేస్తూ సంచులు మార్చి సీఎంఆర్ కు తరలిస్తూ కోట్లకు పడగలెత్తినట్లు పలువురు తెలిపారు. బియ్యం కృత్రిమ కొరత, పిడిఎస్ బియ్యంలో వచ్చే అక్రమ లాభాలతో మిల్లర్లు ప్రతి సంవత్సరం 10 ఎకరాలకు పైగా భూములు కొనుగోలు చేస్తున్నట్లు వినికిడి. ప్రధానంగా గొల్లప్రోలు,బి. ప్రత్తిపాడుకు చెందిన మిల్లర్లు పిడిఎస్ బియ్యం కొనుగోలు చేయడం ద్వారా కేజీకి 20 రూపాయలకు పైగా లాభం ఆర్జిస్తూ విలాసవంతమైన భవనాలు నిర్మించుకొని ఖుషి జీవితం గడుపుతుండగా మరి కొంతమంది మిల్లర్లు రాజకీయ నాయకులతో భుజం,భుజం రాసుకుని తిరుగుతూ పైరవీలు సాగిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి

# ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి

## మెడకు ఉరి తాళ్లు వేసుకొని కౌలు రైతుల నిరసన.



**తాళ్లరేవు, మే 18( ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వం అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న ఎరువుల ధరలు పట్ల కాకినాడ జిల్లా తాళ్లరేవులో కౌలు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీరు పట్ల నిరసనగా మెడకు ఉరితాళ్ళు వేసుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తీరు మారకుంటే రైతులకు ఉరితాళ్లే గతి అంటూ నినాదాలు చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో రైతులపై కేంద్ర ప్రభుత్వం వేస్తున్న బారాలపట్ల నిరసన నిరసనగా కౌలు రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వళ్ళు రాజబాబు మాట్లాడారు. పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని, ఎరువులపై ఇచ్చే సబ్సిడీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన ఎరువుల బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు, ఎరువుల బ్లాక్ మార్కెట్లను అరికట్టాలని, క్వింటా ధాన్యానికి రూ.3600 ఇవ్వాలని, యూరియా కొరత వంకతో రైతులకు అవసరం లేని ఎరువులు మందులు అంటగట్టరాదని, పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయం పట్ల తీసుకున్న నిర్ణయాలు రైతాంగాన్ని నష్టపరిచే విధంగా ఉన్నాయన్నారు. చీటికిమాటికి ఎరువుల ధరలు పెంచడం వల్ల రైతులకు పెట్టుబడి పెరిగిపోతుందని, ఇప్పటికే వ్యవసాయానికి సొంత రైతులు సైతం దూరమవుతున్న పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంతాల్లో మరో వృత్తి తెలియక జీవనాధారం కోసం కౌలు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న పెట్టుబడి భరించలేక ఆత్మహత్యలు చేసుకోవడం, వలసలు వెళ్లిపోవడం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తీరు మారకుంటే భవిష్యత్తులో వ్యవసాయం చేసే రైతు కనుమరుగవుతాడని తిండిగింజలు దొరకని పరిస్థితి ఏర్పడి ఇతర దేశాలపై ఆధారపడవలసి వస్తుందన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం వలన ట్రాక్టరు, వరి కోత యంత్రాల కు పెట్టుబడి అదనమవుతుందన్నారు. ఎరువులు ధరలు తగ్గించడంతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించి సామాన్యుడికి అందుబాటులో తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షులు చల్లా సంతోష్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, ఎం డి యు డబ్ల్యు ఎ మండల అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, తణుకు రాంబాబు, కౌలు రైతులు పెమ్మాడి వెంకటరెడ్డి, వాసంశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి సత్తిబాబు, దంగేటి విగ్నేశ్వరరావు, గోవాల ఏడుకొండలు, నల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతాంగ సమస్యలపై తహసిల్దార్ పి. త్రినాధరావుకు వినతిపత్రం అందజేశారు.

# అంతర్వేది నరసింహుని సేవలో రాజోలు సిఐ..



**ఉమ్మడి గోదావరి జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయమును రాజోలు నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ సాంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాశీర్వచనం అందించినారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ కిరణ్ చేతుల మీదగా శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదములను అందజేయుటమైంది. ఈ కార్యక్రమంలో జి వాసు, రాజేశ్వార్యులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ అప్పుల పాలనతోనే ఇంధన భారం..

## ప్రజలను మభ్యపెట్టేందుకే ధర్నాలు : ఎమ్మెల్యే వనమాడి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే18,ప్రభాతవార్త.** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతల ప్రభావంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం వృథా కాకుండా పొదుపు చర్యలు చేపడుతోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు.సోమవారం కాకినాడలో స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలనలో ఖర్చులను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజలపై అదనపు భారం పడకుండా ప్రభుత్వ వ్యయాలను తగ్గించే దిశగా సీఎం స్వయంగా తన కాన్వాయ్‌ను కూడా తగ్గించుకున్నారని గుర్తు చేశారు. ప్రజాధనాన్ని ఆదా చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తూ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు.ఇక పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీ చేస్తున్న నిరసనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని ఎమ్మెల్యే విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టారని, విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించారని ఆరోపించారు. అప్పట్లో ప్రజలపై అధిక వ్యాట్ భారం మోపి ఇంధన ధరలు పెరగడానికి కారణమైన వారే ఇప్పుడు ధర్నాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.వైసీపీ ప్రభుత్వం అదేళ్ల పాలనలో ప్రజా ధనాన్ని అభివృద్ధికి కాకుండా రాజకీయ ప్రయోజనాలకు వినియోగించిందని, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి వెళ్లిందని ఆయన విమర్శించారు. ఇప్పుడు ధరలపై మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదన్నారు. ప్రజల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గతంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కృషి చేస్తోందని, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో, కాకినాడ సిటీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మార్కెట్ కమిటీ చైర్మన్ బచ్చు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# 20న దేశవ్యాప్తంగా మందుల షాపుల బంద్.



**చింతూరు మే 18 ప్రభాతవార్త.** ఈ నెల 18వ తేదీ బుధవారం దేశవ్యాప్తంగా మందుల షాపులను బందు చేస్తున్నట్లు అఖిలభారత కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ఆన్లైన్లో మందుల విక్రయాన్ని నిలిపివేయాలని, నకిలీ మందుల అమ్మకాన్ని నిరోధించాలని, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తు దేశవ్యాప్తంగా బంధు నిర్వహించనున్నారు. అందులో భాగంగా చింతూరు మండలంలోని మందుల షాపుల యజమానులు సోమవారం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాలకు ముందస్తుగా విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అత్యవసర మందులు అవసరమైన వారు ఒక రోజు ముందుగానే తమకు అవసరమైన మందులను కొనుగోలు చేసుకోవాలని ప్రజలకు జరుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నట్టు వారు ప్రకటించారు.

# పులి దాడిలో దూడ మృతి

**రాజవొమ్మంగి, మే 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం లోదొడ్డి 590 కంపార్టుమెంటు అటవీ ప్రాంతంలో మూడు రోజులు క్రితం పులి 1.5 సం. దూడపై దాడి చేయగా చనిపోయినట్లు రాజవొమ్మంగి రేంజర్ ఉషారాణి తెలిపారు. మంగళవారం ఆదూడ మృతదేహనికి పోస్టుమార్టం జరుగుతుందన్నారు. లోదొడ్డి, వాతంగి పంచాయితీల్లో గల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులి సమాచారం పట్ల వదంతులను నమ్మవద్దని రేంజర్ ప్రజలకు తెలియజేస్తున్నారు.

# 21న చింతూరులో అర్. అండ్ అర్. పి డి ఎఫ్ జాబితా డ్రా

## అర్ అండ్ అర్ అధికారి చింతూరు ఐ. టీ. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్.



**చింతూరు మే 18 ప్రభాత వార్త.** పోలవరం ప్రాజెక్టు -- ఫేజ్ 1దీ పరిధిలో చింతూరు గ్రామ గిరిజనేతర నిర్వాసితులకు తాడువాయి ఆర్ ఔ ఆర్ కాలనీలో ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి ఈ నెల 21 న లాటరీ నిర్వహిస్తున్నట్టు అర్ అండ్ అర్ అధికారి – చింతూరు ఐ. టీ. డి. ఏ. ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం బహుళ ప్రయోజన సేద్యపునీటి ప్రాజెక్టు నిర్మాణం నేపథ్యంలో 41.15 కాంటూర్ స్థాయి పరిధిలో ప్రభావితమవుతున్న చింతూరు మండలంలోని చింతూరు గ్రామ ప్రజలకు సమగ్ర పునరావాసం కల్పించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని . ఈ క్రమంలో, గిరిజనేతర నిర్వాసిత కుటుంబాలకు మెరుగైన నివాస సదుపాయాలు, మౌలిక వసతులు మరియు స్థిరమైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ఐటిడిఏ చింతూరు ఆధ్వర్యంలో పునరావాస కార్యక్రమాలు వేగవంతంగా అమలు చేయబడుతున్నాయని, ఈ నేపథ్యంలో, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని తాడువాయి గ్రామంలో అభివృద్ధి చేస్తున్న ఆర్ ఔ ఆర్ కాలనీలో ప్లాట్ల కేటాయింపునకు సంబంధించి లాటరీ కార్యక్రమాన్ని 21.05.2026 తేదీన ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయం, చింతూరులో నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు అధికారి వెల్లడించారు. ఈ కార్యక్రమం పోలవరం ప్రాజెక్టు ఫేజ్ -- 1దీ పరిధిలోని చింతూరు గ్రామ గిరిజనేతర నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియలో ఒక ముఖ్యమైన దశగా భావిస్తున్నట్లు తెలిపారు. చింతూరు గ్రామానికి సంబంధించిన పునరావాస ప్రక్రియలో భాగంగా రిహాబిలేషన్ ఔ రీసెటిల్‌మెంట్ అధికారి, చింతూరు విడుదల చేసిన డ్రాఫ్ట్ స్కీమ్స్ -- 1 మరియు 2 ఆధారంగా గ్రామ ప్రజల నుండి ఇప్పటికే ఆప్షన్ ఫారాలు స్వీకరించబడినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ కుటుంబ అవసరాలు, ఆర్థిక పరిస్థితులు మరియు వ్యక్తిగత అభిరుచులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ నిర్మాణ గృహాలు లేదా స్వీయ నిర్మాణ గృహాల ఎంపికలను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ లాటరీ కార్యక్రమం ద్వారా తాడువాయి ఆర్ ఔ ఆర్ కాలనీలో బ్లాకుల వారీగా ఎన్ని ప్రభుత్వ నిర్మాణ గృహాలు అవసరమవుతున్నాయి, ఎన్ని స్వీయ నిర్మాణ ప్లాట్లు అవసరమవుతున్నాయనే అంశాలపై స్పష్టత పొందడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ప్రస్తుతం బ్లాకుల వారీగా తుది కేటాయింపులు నిర్ణయించబడలేదని, ప్రజల నుండి స్వీకరించిన ఆప్షన్ ఫారాల ఆధారంగా అవసరాల అంచనా, వర్గీకరణ మరియు ప్రణాళిక ప్రక్రియ చేపట్టనున్నట్లు వివరించారు. అదేవిధంగా, పునరావాస ఔ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన జి.ఓలో పేర్కొన్న 3వ షెడ్యూల్ ప్రకారం ఆర్ ఔ ఆర్ కాలనీలో కల్పించబడే మౌలిక వసతులు మరియు ప్రజా సౌకర్యాల వివరాలను కూడా ఈ సందర్భంగా ప్రజలకు తెలియజేయనున్నట్లు తెలిపారు. తాగునీటి సదుపాయం, సీసీ రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సరఫరా, వీధి దీపాలు, పాఠశాల భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్, ఆరోగ్య కేంద్రం, ప్రార్థనా స్థలాలు, మార్కెట్ ప్రదేశాలు మరియు ఇతర ప్రజావసర సదుపాయాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ లాటరీ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆర్ ఔ ఆర్, ఇంజనీరింగ్ మరియు ఐటిడిఏ శాఖల అధికారులు పాల్గొననుండగా, నిర్వాసిత కుటుంబాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధుల సమక్షంలో లాటరీ నిర్వహించబడుతుంది. ప్రజల్లో ఎటువంటి అనుమానాలు లేకుండా, పారదర్శక విధానంలో ప్రతి దశను అమలు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు కారణంగా ప్రభావితమవుతున్న కుటుంబాలకు కేవలం నివాస స్థలం మాత్రమే కాకుండా, అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన సమగ్ర పునరావాస కాలనీని అందించడం ప్రభుత్వ లక్ష్యమని ప్రాజెక్టు అధికారి తెలిపారు. నిర్వాసిత కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు స్థిరమైన పునరావాస వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చింతూరు గ్రామ ప్రజలు ఈ లాటరీ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై తమకు సంబంధించిన వివరాలను తెలుసుకొని అధికారులకు సహకరించాలని ప్రాజెక్టు అధికారి, నిర్వసితులకు విజ్ఞప్తి చేశారు.

# క్షేత్ర పాలకుడైన సీతారాముల వారికి టేకు సింహాసనం సమర్పణ.

## ఆలయ అర్చకుడు రామ్ కుమార్



**అన్నవరం మే18(ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధానంలో క్షేత్ర పాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీ సీతారాముల వారికి యంత్రాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న కంచిభోట్ల రామ్ కుమార్ టేకు సింహాసనం తయారు చేయించి దేవస్థానం ఈవో నల్లం సూర్య చక్రధర్ రావు కు అందజేశారు. ఈ టేకు సింహాసనాన్ని ప్రతిరోజు జరుగు శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం నందు ఉపయోగించవలసిందిగా కోరారు.

# వాడపల్లి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్, ఈఓ ,నల్లం సూర్య చక్రధరరావు..

## స్వామివారి నిత్యకళ్యాణం, అష్టోత్తర పూజలలో పాల్గొన్న భక్తులు









**ఆత్రేయపురం, మే .18,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆలయ డిప్యూటీ కమిషనర్ ,కార్యనిర్వహణాధికారి,నల్లం సూర్య చక్రధరరావు ,పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు .అలాగే వకుళమాత అన్నదాన భవనం, మజ్జిగ చలివేంద్రం,తదితర అభివృద్ధి పనులను చురుగ్గా చేయాలని సూచించారు. ఉదయం మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం.అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణం, గోపూజ తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా నిర్వహించారు.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం లలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు చలువ పందిళ్లు, చల్లని త్రాగునీరు, మజ్జిగ చలివేంద్రం, ఉచిత పులిహోర, అన్నప్రసాదం తదితర ఏర్పాట్లు చేశారు.

# పెట్రో, గ్యాస్ ధరల పెంపుపై 'వైసీపీ' భారీ నిరసన

## తణుకులో మాజీ మంత్రి కారుమూరి, ముదునూరి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

## కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించాలని డిమాండ్



**ప్రత్తిపాడు మే 18 ( ప్రభాతవార్త)** రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం తణుకులో భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టాయి. పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, తణుకు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తణుకులోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుండి బయలుదేరిన నిరసన ర్యాలీ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం ప్రజాసమస్యలపై స్పందించి తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ?ఈ నిరసన ర్యాలీలో నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు, ఎమ్మెల్సీ వంక రవీంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పరిశీలకులు మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యుడిపై మోయలేని భారం పడుతోందని, పెంచిన ఇంధన, గ్యాస్ ధరల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ధరలను అదుపు చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో తణుకు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధ్యక్షులు, వివిధ విభాగాల అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలపై హై అలర్ట్ - ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ హెచ్చరిక



**అమలాపురం కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త** తీర ఆంధ్రప్రదేశ్ జిల్లాల్లో రానున్న వారం రోజుల పాటు తీవ్ర ఎండలు, ఉక్కపోత వాతావరణం కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం మే 20 నుంచి 26వ తేదీ వరకు మధ్య కోస్తా, ఉత్తర కోస్తా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ శాతం అధికంగా ఉండటంతో సాధారణ ఉష్ణోగ్రత కంటే ఎక్కువ వేడి అనిపించే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఎండలో పనిచేసే కూలీలు, రైతులు, కార్మికులు, డెలివరీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది వంటి వారు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. వడదెబ్బ నుంచి రక్షణ కోసం ప్రజలు తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో టోపీ, గొడుగు, తల కప్పుకునే వస్త్రాలు ఉపయోగించాలని సూచించారు. పిల్లలను వాహనాల్లో ఒంటరిగా వదిలేయకూడదని, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. తలనొప్పి, అధిక దాహం, అలసట, వాంతులు, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి సరఫరా, వైద్య సేవలు, గ్రామాలు మరియు పట్టణాల్లో నీడ ఏర్పాట్లు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ కోరారు.

# అన్నవరానికి పోటెత్తిన భక్తులు..

## భారీగా వచ్చిన భక్తులు.





**అన్నవరం మే 18 (ప్రభాతవార్త)** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధి భక్తులతో సందడిగా మారింది.. సెలవులు కావడంతో శ్రీ స్వామి వారి వ్రతం దర్శనార్థం ఆదివారం రాత్రి నుంచి శ్రీ సత్య దేవుని సన్నిధికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. రద్దీ దృష్ట్యా గమనించిన దేవస్థానం అధికారులు తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి టికెట్లు ఇవ్వడం ప్రారంభించారు.. వ్రత మండపాలు దర్శనం క్యూ లైన్లు వచ్చిన భక్తులతో కిక్కిరి సాయి. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలక్కుండా దేవస్థానం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకున్నారు.. దర్శనానంతరం భక్తులు రావిచెట్టు వద్ద శ్రీ సత్యదేవుని నామస్మరణ చేస్తూ దీపారాధన వెలిగించారు. అనంతరం శ్రీ సత్యదేవ నిత్య అన్నదానం పథకం ద్వారా అన్న ప్రసాదం వితరణ చేశారు..

## పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలపై
# వై సి పి వినూత్న నిరసన

**రిక్షాపై బైక్ ఎక్కించి రిక్షా తొక్కుతూ నిరసన తెలిపిన జిల్లా అధ్యక్షులు జగ్గిరెడ్డి**



**కొత్తపేట,మే18,(ప్రభాతవార్త)** జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కొత్తపేట లో గొల్లపల్లి డేవిడ్ రాజు ఇంటి ఎదురుగా ఉన్న బంక్ వద్ద పెట్రోలు డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోతూ సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందని ఈ సందర్భంగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు అనంతరం అక్కడి నుండి కొత్తపేట ఆర్డీవో కార్యాలయం వరకు జగ్గిరెడ్డి ఒక రిక్షాపై మోటార్ బైకులను ఎక్కించి స్వయంగా రిక్షా తొక్కుతూ వినూత్న ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతూ ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు ప్రజల సమస్యలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పోరాటం చేస్తూనే ఉంటుందని జగ్గిరెడ్డి స్పష్టం చేశారు

## మందుల దుకాణాల బంద్‌పై
# తహసీల్దార్‌కు వినతిపత్రం

**-20న దేశవ్యాప్త బంద్ - అత్యవసర సేవలకు ఒక షాపు అందుబాటులో**



**కాట్రేనికోన, మే 18 (ప్రభాతవార్త):** ఈ నెల 20వ తేదీ బుధవారం దేశవ్యాప్తంగా మందుల షాపుల బంద్ నిర్వహిస్తున్నట్లు, దానిలో భాగంగా రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కాట్రేనికోన మండలంలో కూడా బుధవారం మందుల దుకాణాలు బంద్ నిర్వహిస్తున్నట్లు కాట్రేనికోన మండల యూనియన్ అధ్యక్షుడు వట్టూరి సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) తెలిపారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. బంద్ రోజున వినియోగదారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాట్రేనికోన గేటు సెంటర్‌లో గల శ్రీ శివసాయి కృష్ణ మెడికల్ షాపు తెరిచి ఉంటుందని ఆయన వెల్లడించారు. ఈ బంద్‌కు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వట్టూరి మురళీకృష్ణ, వింజమూరి శ్రీనివాస్, తాతపూడి గోపి, ఆణివిళ్ల మల్లి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చర్యలు.
## -కమిషనర్ రాహుల్ మీనా.



**రాజమహేంద్రవరం సిటీ, మే 18( ప్రభాతవార్త)** పి జి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి కమిషనర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరువ చేసి వారిలో సంతృప్తి స్థాయిని పెంచాలన్నారు. పిజిఆర్ ఎస్ ద్వారా 28 అర్జీలు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగానికి 12 అర్జీలు, రెవిన్యూ కి సంబంధించి మూడు ,వార్డు సచివాలయాలకు సంబంధించిన ఒకటి, టౌన్ ప్లానింగ్ కి సంబంధించి 9 అర్జీలు వచ్చేయని వెల్లడించారు. అర్జీలను సత్వరమే పరిష్కరించి ప్రజల న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గృహ గణన వేగవంతంగా జరగడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సెన్సెస్ సర్వేలో ఏ ఒక్క వీధిని, గృహాన్ని వదలకుండా పూర్తి పారదర్శకత్వం గా పూర్తి చేయాలి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రెటరీ శైలజ వల్లి, ఎస్ ఇ రిట ,సిటీ ప్లానర్ జీవీఎస్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మాలిక్, రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.
రాజమహేంద్రవరం సిటీ ఫోటో ఒకటి

## కొవ్వూరు రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు
## మంత్రి సుభాష్ రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం

**-వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు**



**కాకినాడ రూరల్, మే 18(ప్రభాతవార్త):** కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు బ్రిడ్జి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు మహిళా ఉపాధి శ్రామికుల కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచిరు. 2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్), సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. సోమవారం అమరావతి నుంచి వీడియో కాల్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి వాసంశెట్టి సుభాష్ వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. ప్రతి కుటుంబానికి వ్యక్తిగత సహాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా కూడా సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఎస్ఏఎఫ్ ద్వారా నలుగురు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.2 లక్షలు, మరో దళిత మహిళ కుటుంబానికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.50 వేల సహాయం అందజేశారు.మంత్రి ఆదేశాల మేరకు నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, గుత్తుల శ్రీనివాస్, యనమదల రవి, కడలి శివ, టేకుమూడి శ్రీనివాస్, కొండా వినాయక్, గీసాల శ్రీనివాస్,వాసంశెట్టి భీమరాజు, వాసంశెట్టి అంజిబాబు, అనసూరి సతీష్, వి. మహేష్ తదితరులు చీడిగ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఎస్ఏఎఫ్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ప్రజల పక్షాన నిలిచి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు

## సిద్ధమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్స్!

**-జూన్ 12 నాటికి పాఠశాలలకు పంపిణీ**
**ఎంఈఓ పి. శ్రీనివాసరావు**



**అడ్డతీగల, మే 18, ప్రభాతవార్త** మండల విద్యా కార్యాలయానికి రాబోయే విద్యా సంవత్సరానికి గానూ ఒకటి నుండి పదో తరగతి విద్యార్థులందరికీ ప్రభుత్వం పంపిణీ చేయనున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ అడ్డతీగల మండల స్టాక్ పాయింట్ వద్ద సిద్ధంగా ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఆశ్రమ హైస్కూల్ బాలికల పాఠశాల ఆవరణలోని స్టాక్ పాయింట్ వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు పంపిణీ చేయడానికి మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన 18,211 పాఠ్యపుస్తకాలు టెక్స్ట్ బుక్స్, 5,551 వర్క్ బుక్స్, 546 పిక్టోరియల్ డిక్షనరీలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.వారం రోజుల్లో మిగతా వస్తువుల సరఫరాఈ కిట్లకు సంబంధించిన యూనిఫామ్‌లు, స్కూల్ బ్యాగులు, బెల్టులు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, మరియు నోట్ బుక్స్‌తో కూడిన పూర్తి స్థాయి కిట్లు రాబోయే వారం రోజుల్లో స్టాక్ పాయింట్‌కు చేరుకుంటాయని ఎంఈఓ వివరించారు.జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుంది. ఎంఈఓ పి. శ్రీనివాసరావు అన్నారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీలు రమణ, వాసు, రవి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పై శ్రద్ధ తీసుకోవాలి..

**ఎంపీపీ దొమ్మేటి..అంబాజీపేటలో టిబి ముక్తా భారత్ అభియాన్- 2.0..**



**అంబాజీపేట, మే 18, (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అంబాజీపేటప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని సచివాలయం-1,4లలో టీబీ ముక్తా భారత్ అభియాన్-2.0 కార్యక్రమంలో భాగంగా హై రిస్క్ గ్రామాలలో హ్యాండ్ ఎక్స్ రే మిషన్ ద్వారా ఎక్స్ రే క్యాంపులను సోమవారం నిర్వహించారు. అంబాజీపేట పీహెచ్సీ పరిధిలో స్థానిక జెడ్పీ హైస్కూల్, మాచవరం ప్రాథమిక పాఠశాలల వద్ద నిర్వహించిన ఎక్స్ రే క్యాంపులను సందర్శించిన వైద్యాధికారులు వి.గౌతమి, డి.హేమారెడ్డిలు మాట్లాడుతూ టీబీ లక్షణాలు బయటకు కనిపించిన వారికి, వ్యాధి లక్షణాలు కనబడని వారికి ఎక్రే తీసి వ్యాధి నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసామన్నారు. కమ్యూనికబుల్ డిసీజెస్ లో భాగంగా వారికి కొన్ని రకాల రక్త పరీక్షలు కూడా చేస్తారన్నారు. టీబి టీయు సూపర్వైజర్ ఎన్.శ్రీనివాస్, టెక్నీషియన్ వి.శ్రీనివాస్ల పర్యవేక్షణలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలు, ఎక్సరేలు తీయించుకున్నారని తెలిపారు. ఎక్సరే తీయించుకున్న వారి వివరాలు ఏబీహెచ్ఏ ఐడి నెంబర్ ద్వారా ప్రత్యేక యాప్ లో అప్లోడ్ చేస్తారన్నారు. ఎక్సరే మిషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ)కి అనుసంధానం కావడంతో సుమారు పది నిమిషాలలో మెడికల్ రిపోర్టులు తెలియజేస్తుందన్నారు.14 ఏళ్ళు వయసు పైబడిన ప్రతి ఒక్కరు టీబీ ఎక్స్ రేను తీయించుకోవచ్చున్నారు. అలాగే మంగళవారం (నేడు) గంగలకుర్రు, పుల్లేటికుర్రులలో టీబీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్యశాఖ అధికారిని భరత లక్ష్మి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.మమత, హెల్త్ సూపర్ వైజర్ ఎ.రాధానరసింహం, పీహెచ్ఎన్ భూలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కెవివి.సత్యనారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీవో అడపా శ్రీ వెంకటకృష్ణ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## సంక్షేమ విప్లవానికి నాంది పలికిన కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం సిటీ, మే 18( ప్రభాతవార్త)** రాష్ట్రంలో సంక్షేమ విప్లవానికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త వితంతు పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద అర్హులైన ప్రతి పెన్షన్ దారులకు నెలకు కూటమి ప్రభుత్వం 4000 పెంచి కొండంత అండగా నిలిచిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 1 లక్ష 53 వేల మంది కి లబ్ధి చేకూరుతుందన్నారు. నగర పరిధిలో అర్హులైన వితంతువులు పింఛన్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం త్వరలోనే అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపన జేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటూ ప్రజా రంజక పాలన అందిస్తుందని అన్నారు. నగర ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా తాము నిరంతరం అందుబాటులో ఉంటామని ఆయన స్పష్టం చేశారు.

## 28న సామూహిక వివాహాల లగ్నపత్రికను ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే



**రాజవొమ్మంగి, మే 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం గ్రామ పట్టాలమ్మతల్లి ఆలయం సమీపంలో ఈనెల 28 తేదీన దానధర్మ చారిటబుల్ ట్రస్టు, వికాస తరంగణి సంయుక్తంగా నిర్వహించే సామూహిక వివాహాలకు పందిరిరాటకు పూజలు, లగ్నపత్రిక ఆవిష్కరణ కార్యక్రమాలు సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి చేతులు మీదుగా జరిగింది. ఈ సామూహిక వివాహాలు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి సమక్షంలో జరుగుతాయని ఎమ్మెల్యే అన్నారు. ఒకే వేదికగా 106 జంటలు ఒక్కటి కావడం శుభప్రధమని ఎమ్మెల్యే అన్నారు. పట్టాలమ్మతల్లి ఆలయంలో లగ్నపత్రిక పూజలను ఎమ్మెల్యే చేశారు. ఈకార్యక్రమంలో ఏ.యం.సి డైరెక్టర్ గట్టి మాణిక్యం, ఎంపిటీసీ నల్లా సత్తిబాబు, మాజీ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, మాజీ ఎంపిటిసి కొంగర సావిత్రి, తెదేపా నాయకులు అప్పారావు, గంగరాజు, చలుమర్తి బన్ను, బిజెపి పోలవరం జిల్లా అధ్యక్షులు ఈక బుల్లి కొండలు, ఉమ్మడి అల్లూరి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జుర్రా గౌరీపార్వతి, గంగవరం మండలం పార్టీ బీజేపీ అధ్యక్షులు పుట్టపల్లి నీలాలమ్మ, మండల అధ్యక్షులు లోసుల రాజుబాబు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజం సత్య నారాయణమ్మ. విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన పోలవరం జిల్లా ఇంచార్జి కడబాల సుధ, బిజెపి కార్యకర్తలు మరియు దాన ధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. డి. వి.డి ప్రసాద్, తాము సూరిబాబు, బొరగా రామకృష్ణ పాల్గొన్నారు.

## చెరువుల తవ్వకాలపై కలెక్టర్కు ఫిర్యాదు




**అయినవిల్లి మే 18 ప్రభాతవార్త** నేదునూరు గ్రామానికి చెందిన పంట పొలాల్లో చెరువుల త్రవ్వకాలపై సోమవారం అక్కడ వరి పండించే రైతులు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ కు గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు అయినవిల్లి సరిహద్దు నేదునూరు గ్రామానికి చెందిన వరి పంట పొలాల్లో మురుగు కాలువకి ఆనుకుని ఉన్న భూములు గత కొద్ది రోజులుగా చెరువు త్రవ్వకాలు కాలను సాగించడంతో రైతులు యంత్రాలను అడ్డుకున్నారు నేదునూరుకు చెందిన రైతులు ఈ త్రవ్వకాలు చేపట్టారు అయితే ఆ చుట్టుపక్కల రైతులు పైనుంచి నీరు దిగే మార్గం మూసుకుపోయి వందలాది ఎకరాలు పంట నష్టం సంభవిస్తుందని తమ పొలాలు సౌడు మారుతాయ ని చెరువులు తవ్వకాన్ని అడ్డుకున్నారు అయితే మత్స్య శాఖ రెవెన్యూ పర్మిషన్లు తెచ్చుకుని తవ్వకాలు సాగిస్తున్నామని చెరువుల తవ్వకం రైతులు తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా ఇక్కడ చెరువుల త్రవ్వకాలు అడ్డుకున్నప్పటికీ పర్మిషన్లు ఎలా ఇచ్చారని ఎగువ ప్రాంత రైతులు మండిపడుతున్నారు రైతులు ఇచ్చిన ఫిర్యాదు పై కలెక్టర్ స్పందిస్తూ మత్స్యశాఖ జేఈ ని పిలిచి దీనిపై దర్యాప్తు జరిపి తగిన సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు ఎకరాకు 40. నుండి 50 బస్తాలు పండే సారవంతమైన పొలాలు రొయ్యల చెరువులు కారణంగా చిన్న చిన్న రైతులు పంట నష్టం సంభవించి వందలాది ఎకరాలు నీటిముశీ పుకు గురవుతుందని రైతులు కలెక్టర్కు వివరించారు చెరువు తవ్వకాలను నిలుపుదల చేయించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు

## 20న గొల్లప్రోలులో మెడికల్ షాపులు బంద్



**గొల్లప్రోలు, ప్రభాతవార్త** గొల్లప్రోలు మండల పరిధిలో ఈనెల 20వ తేదీన మెడికల్ షాపులు బంద్ చేస్తున్నట్లు మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ యూనియన్ నాయకులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ లో తహసిల్దార్ రామ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ పిలుపు మేరకు గొల్లప్రోలు పట్టణ,మండల పరిధిలో 19 తేదీ అర్ధరాత్రి నుండి 20వ తేదీ అర్ధరాత్రి వరకు ( బుధవారం) మెడికల్ షాపు బంద్ చేయడం జరుగుతుంది అన్నారు.అపోలో ఫార్మసీ వారు కూడా బంద్ కు మద్దతు తెలిపినట్టు వివరించారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మండల,పట్టణ పరిధిలో ఒక్కొక్క మెడికల్ షాప్ ను తెరవడం జరుగుతుందన్నారు.ఆన్లైన్ లో ఎవరు పడితే వారు మందులు తెప్పించుకోవడం,నకిలీ మందుల అమ్మకాలను తక్షణం అధికారులు నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ ఒక్కరోజు బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ప్రజా శ్రేయస్ దృశ్య ప్రజలు మెడిసిన్ తీసుకునేందుకు ఒక షాపు తెరిచే విధంగా యూనియన్ నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక మెడికల్ షాపు ప్రజలకు అందుబాటులో ఉంచుతామని యూనియన్ నాయకులు హామీ ఇచ్చారు. గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన వారిలో గొల్లప్రోలు మండల డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ నాయకులు గొల్లపూడి శంకర్రావు,గ్రంధి రవికుమార్,వానపల్లి మురళి తదితరులు ఉన్నారు.

## గంగాలమ్మతల్లికి బోనాలుతో పూజలు చేసిన ఎమ్మెల్యే



**రాజవొమ్మంగి, మే 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం తంటికొండ పంచాయితీ సింగంపల్లి గ్రామంలో సోమవారం గంగాలమ్మ జాతర ప్రారంభ సందర్భంగా భోనాలు పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగకి విచ్చేసిన రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవికి గ్రామస్తులు ఘనస్వాగతంతో ఆహ్వానించారు. అనంతరం గ్రామస్తులతో ఎమ్మెల్యే కలిసి గ్రామ గంగాలమ్మ తల్లికి భోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలను చేసి నైవేద్యాన్ని సమర్పించారు. జాతరలో పలు సాంస్కృతిక కార్య క్రమాలు ఆకట్టుకున్నాయి. సింగంపల్లి గ్రామంలో పలు సమస్యలపై గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, మాజీ ప్రజాప్రతినిధులు ఆగూరి సుబ్బలక్ష్మి, కొంగర సావిత్రి,, ఏ. యం. సి డైరెక్టర్ గట్టు మాణిక్యం, మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు బారీగా పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

**-కూటమి ప్రభుత్వంపై వైసీపీ కోఆర్డినేటర్ పొన్నాడ ధ్వజం**



**కాట్రేనికోన, మే 18 (ప్రభాతవార్త):** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని వైసీపీ ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ధ్వజమెత్తారు. పెంచిన పెట్రోల్, డీజిల్, విద్యుత్ రేట్లకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో సోమవారం నియోజకవర్గ స్థాయి నిరసన కార్యక్రమం కాట్రేనికోనలో నిర్వహించారు . స్థానిక గేటు సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు డీజిల్, పెట్రోల్ రెట్లు తగ్గించాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాము అధికారం లోకి వచ్చిన వెంటనే డీజిల్,పెట్రోల్ రేట్లు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక ధరలు పెంచడం దారుణమన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ప్రజలను మోసం చేస్తున్నారు అని విమర్శించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు, రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్,, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైసీపీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై వెంటనే స్పందించి పెంచిన రేట్లను తగ్గించకపోతే భవిష్యత్తులో కూటమికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు రవి కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోపితాని బాలకృష్ణ, నల్లా నరసింహమూర్తి, గంటి వెంకట సుధాకర్, జడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, కాశి బాల మునికుమారి, మోక చంద్ర నాగరత్నం, సందీప్ వర్మ, నాతి సత్యనారాయణ, కోలాటి సత్యం, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నృసింహుని నిత్యాన్నదానానికి లక్ష విరాళం...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఆలయములో ప్రతి నిత్యం నిర్వహించే నిత్యాన్నదానట్రస్ట్ నకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి ఫణి వెంకట తిమ్మరాజు, చందనప్రణతి దంపతులు రూ 1,00,116. విరాళముగా సమర్పించియున్నారు.వారికి సీనియర్ అసిస్టెంట్ ఏం సత్య కిరణ్ శ్రీ స్వామివారి దర్శనం అనంతరం శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదములను అందజేసినారు. ఈ కార్యక్రమంలో తిమ్మరాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


## ఏపీలోనే ఆయిల్ ధరలు అధికం

**-వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గీత**




**యు.కొత్తపల్లి(పిఠాపురం), మే 18(ప్రభాతవార్త) :** భారతదేశంలో మిగిలిన రాష్ట్రాలకంటే ఆంధ్రప్రదేశ్ లోనే ఆయిల్ ధరలు అధికంగా ఉన్నాయని కాకినాడ మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత అన్నారు. ఇటీవల పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంపై సోమవారం పిఠాపురం ఉప్పాడ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వైఎస్సార్ పార్టీ తరపున ర్యాలీ నిర్వహించారు. ప్రజలపై పెంచిన పెట్రో భారాన్ని వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ఆయిల్ ధరలు కారణంగా సామాన్య ప్రజలు పడే ఇబ్బందులు కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా అంటూ నిలదీసారు. మిగిలిన రాష్ట్రాల కంటే కూటమి ప్రభుత్వం నేతృత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం గెలిస్తే ధరలు తగ్గిస్తామన్న ప్రభుత్వ పెద్దలు ఏం చేస్తున్నారంటూ ఎద్దేవా చేసారు. రోడ్డు సెస్సులు ఉండవని, వ్యాట్ తగ్గించి పెట్రో భారం మోపమన్న ప్రభుత్వం ఇపుడేంచెబుతుందంటూ నిలదీసారు. పరిస్థితులను బట్టి ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రజలపై పెట్రో ధరల భారాన్ని వెంటనే తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వర్ధినీడి సుజాత, గండేపల్లి బాబీ, రావుల మాధవరావు, కొత్తెం దత్తుడు, ఆనాల సుదర్శన్, కారే శ్రీనివాసరావు, ఉలవకాయల నాగలోవరాజు, చెట్టుబత్తిని సురేష్ కుమార్, బత్తుల సాయి, అడపా రఘు, బొను నానిబాబు, వెంకటేశ్వర రావు, లలిత, వజ్రపు బాబి, వజ్రపు వీరేష్ ఉలవల భూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెరుగుదలకు నిరసనగా వైసీపీ ఆందోళన



**గోపాలపురం మే 18, (ప్రభాతవార్త):** పెంచిన ఇంధన ధరలపై నిరసనగా గోపాలపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం ఆందోళన చేపట్టారు. నియోజకవర్గ స్థాయిలో గోపాలపురం మండల కేంద్రంలో మాజీ మంత్రి, ఇంచార్జ్ తానేటి వనిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా చెక్ పోస్ట్ సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. అక్కడ్నుంచి మండుటెండలో సీఎం డౌన్ డౌన్ అంటూ, పెట్రో ధరలు తగ్గించాలంటు నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని కొంతసేపు ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ వనిత మాట్లాడుతూ.. పెంచిన ఇంధన ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకే కాకుండా రైతాంగానికి కూడా అధిక భారం అయ్యాయని అన్నారు. ఎన్నికల సమయంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామే తప్పా పెంచబోమని ఇచ్చిన హామీలను గాలికొదిలేసారని మండిపడ్డారు. పెరిగిన ధరల వలన నిత్యవసరాల ధరలు సైతం పెరిగి, సామాన్యులకు గుదిబండలా మారాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఇటువంటి ప్రభుత్వాల విధానాలను ప్రజలు సంఘటితంగా వ్యతిరేకించాలని వనిత కోరారు. మండల వైసీపీ అధ్యక్షులు వెలగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ.. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పడంతో నమ్మి ఓట్లు వేశారని, ఇప్పుడు అదే గ్యాస్ సిలిండర్ ను రూ.3 వేలు పెట్టి కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఇచ్చిన హామీలను సక్రమంగా నెరవేర్చకపోగా, సామాన్యులపై అధిక ధరలతో మొయ్యలేని భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కూచిపూడి సతీష్, వెల్లంకి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు కూసం మోహన్ రెడ్డి, ఎంపీపీ దుర్గారావు, ముల్లంగి శ్యాం సుందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అన్వర్ బాషా, గన్నమని జనార్ధనరావు, కూరుకూరి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్.అండ్.ఆర్ ప్యాకేజి త్వరగా ఇప్పించాలని ఐటిడిఎ పిఒకు వినతి



**వి.ఆర్.పురం, మే 18,ప్రభాతవార్త** పోలవరం ప్రాజక్ట్ నిర్మాణం ద్వారా విలీన మండలాల్లో సింహభాగం నష్టపోతున్న వి.ఆర్.పురం మండల నిర్వాసితులకు, త్వరతగిన ఆర్.అండ్.ఆర్ ప్యాకేజ్ ఇప్పించి పునరావాసం కల్పించాలని చింతూరు ఐటిడిఎ పిఒ శుభం నోక్వాల్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వి.ఆర్.పురం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్, ఆ పార్టీ సీనియర్ నాయకులు బొర్రా.నరసింహారావు, బిజెపి నాయకులు ముత్యాల.రాంబాబు తదితరులు చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో పిఒ శుభం నోక్వాల్ ను కలిసి, వినతి పత్రం అందించారు. వినతి పత్రాన్ని పరిశీలించిన పిఒ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. నిర్వాసితుల ఆర్.అండ్.ఆర్ ప్రక్రియ వేగవంతం చేయనున్నట్లు చెప్పారు.

## బడికి పిలుస్తోందిరా కు అనూహ్య స్పందన



**రాజవొమ్మంగి, మే 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం అమినాబాద్ పంచాయితీలో గల ఏ. బి. కాలనీ, వనకరాయి,తో బాటు రాజవొమ్మంగిలో యం. ఇ. ఓ కె. వి. వి. సత్యనారాయణదొర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బడి పిలుస్తోందిరా కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తోంది. ప్రవేటు పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారని యం. ఇ. ఓ అన్నారు. ఉపాధ్యాయులతో కలిసి చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి ఏ. బి. కాలనీ ఐదుగురు, వనకరాయిలో ముగ్గురు , రాజవొమ్మంగిలో ఒక్కరు పేర్లను నమోదు చేయించుకొన్నారని యం. ఇ. ఓ. కె. వి. వి. సత్యనారాయణదొర వెల్లడించారు. ఈసందర్భంగా యం. ఇ. ఓ. సత్యనారాయణదొర మాట్లాడుతూ 228 మంది లక్ష్యం కాగా, ఇప్పటికి 217 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి పేర్లు నమోదు జరిగిందన్నారు. అంగన్వాడీ. కేంద్రాలు నుండి మొదటి తరగతిలో చేరడానికి 365 మంది సిద్ధంగా ఉన్నారని యం. ఇ. ఓ వివరించారు. ఈకార్యక్రమంలో యం. ఇ. ఓ లు కె. వి. వి. సత్యనారాయణదొర, టి. సూరయ్యరెడ్డి, సిఆర్పీలు శ్రీనివాస్, ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు కోసూరి రాజారెడ్డి, దాసరి పైడిమల్లి, జర్తా లోవరాజు, సి. హెచ్. చిట్టిబాబు, విద్యా కమిటీ చైర్మన్ లు కలింకోట శ్రీను, మాకాడ రామలక్ష్మి, పీసా కమిటీ సెక్రటరీ చిన్నారావు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ రక్తపోటు పరీక్షలు
# చేయించుకోవాలి వైద్యులు



**మామిడికుదురు.మే 18 (ప్రభాతవార్త)** ప్రతీ ఒక్కరూ నిరంతరం రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలని నగరం పీహెచ్సీ వైద్యులు సూచించారు. రక్తపోటు దినోత్సవం సందర్భంగా సోమవారం నగరం పీహెచ్సీ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవం నిర్వహించబడుతుందన్నారు.రక్తపోటు (బీపీ) ఒక "నిశ్శబ్ద హంతకుడు"గా పరిగణించబడుతుంది. చాలా మందికి లక్షణాలు కనిపించకపోయినా, ఇది గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల సమస్యలకు దారితీస్తుంది.రక్తపోటు నివారణకు పాటించవలసిన సూచనలను తెలిపారు. ఉప్పు వినియోగాన్ని తగ్గించాలని,రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలని,ధూమపానం మరియు మద్యపానానికి దూరంగా ఉండాలని,తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని,మానసిక ఒత్తిడిని తగ్గించుకొని క్రమం తప్పకుండా బీపీ పరీక్ష చేయించుకోవాలన్నారు. అందరూ సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా రక్తపోటు పరీక్షలు చేయించుకొని ఆరోగ్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యులు ఐ. జాన్ లెవి,ఆర్.పావని సూపర్ వైజర్లు బి.నరసింహారావు, పి.భాగ్యవతి.ఎంఎల్హెచ్పీలు,సీహెచ్ఓ లు,ఏఎన్ఎం లు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి అశేష భక్తజనం.




**ఆత్రేయపురం, మే ,18,(ప్రభాత వార్త).** అతి పురాతన పుణ్యక్షేత్రం స్వయంభూ ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి ,గోపాల స్వామి వారిని సోమవారం అశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బెంగుళూరు చెందిన కొల్లేరు శ్రీరామ శంకర్ వారు శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10,116/- వేలు, ఆలయ అభివృద్ధి పనులకు రూ.11,116/- వేలు, విశాఖపట్నం చెందిన పొట్నూరి సన్యాసిరావు, జగదీశ్వరి దంపతులు, శ్రీ స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.10.116/- వేలు విరాళంగా అందించారు.దాతలకు ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం చేయించి, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం,ప్రసాదాలు, చరిత్ర పుస్తకం, శేష వస్త్రంతో సత్కరించారు.

## తోటపేటలో వ్యక్తిగత ద్వేషాలే తప్ప వెలి కాదు.

**-శాంతి కమిటీ చే సమస్యకు ఈనెల 20న పరిష్కారం. -తహసీల్దార్ త్రినాధరావు.**



**తాళ్లరేవు, మే18( ప్రభాతవార్త):** మండలం తోటపేట గ్రామంలో పలువురు వ్యక్తుల మధ్య వ్యక్తిగత ద్వేషాలే తప్ప వెలి (సామాజిక బహిష్కరణ) కాదని తాళ్ళరేవు తహసీల్దార్ పి. త్రినాధ రావు స్పష్టం చేశారు. పత్రికలలో వచ్చిన వార్తలపై సోమవారం కోరంగి ఎస్ఐ పి. సత్యనారాయణ, డిప్యూటీ తహసిల్దార్ సూరిబాబు లతో కలిసి ఆయన రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పోలేకుర్రు పంచాయతీ తోటపేట గ్రామంలో వెలి పేరున ఇరు వర్గాల మధ్య జరుగుతున్న వైషమ్యాలను ఈనెల 20వ తేదీన పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో ఇద్దరు వ్యక్తుల సమస్యను రెండు సమూహాల సమస్యగా మార్చారని ఆయన అన్నారు. అది సామాజిక బహిష్కరణ కాదని ఒకే సామాజిక వర్గం, బంధువులలో వచ్చిన విభేదాలన్నారు. దీనిపై గతంలోనే ఇరు వర్గాలను సమావేశపరిచి శాంతి చర్చలు జరిపి అందరూ కలిసి ఉండాలని సూచించినట్లు తెలిపారు. అయినా తిరిగి సమస్య యధాతథంగా కొనసాగిస్తున్నారన్నారు. ఇటీవల మీడియా ముందుకు వచ్చి ఈ సమస్యను మరింత జటిలం చేశారన్నారు. దీంతో తిరిగి మండల శాంతి కమిటీ ఈ సంఘటనపై దృష్టి సారించిందన్నారు. ఈనెల 20వ తేదీ బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో ఇరు వర్గాలతో శాంతి సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు ముగింపు పలుకుతామన్నారు. ఈ శాంతి చర్చలను ధిక్కరించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బి. ఎన్ .ఎస్. యాక్ట్) ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒకే సామాజిక వర్గంలో కొంతమందిని బహిష్కరించడం ఎక్కడా లేనివిధంగా మండలంలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు ఉపేక్షించేది లేదని వాటికి కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. 20వ తేదీన జరిగే శాంతి చర్చలకు గ్రామంలోని ఇరు వర్గాలు తప్పక హాజరై సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు.

## పశువుల వాహనంపై పోలీసులు మెరుపు దాడి

**-32 ఎద్దులు స్వాధీనం -మూగజీవాలను తరలిస్తున్న కంటైనర్ సీజ్-ముగ్గురిపై కేసు నమోదు**



**గొల్లప్రోలు, ప్రభాతవార్త** పశువులను అక్రమంగా రవాణా చేస్తూ కబేళాకు తరలిస్తున్న కంటైనర్ వాహనంపై సోమవారం తెల్లవారు జామున గొల్లప్రోలు పోలీసులు మెరుపు దాడి చేసి 32 ఎద్దులను స్వాధీనం చేసుకున్నారు.ఇందుకుసంబంధించిన వివరాలు పరిశీలిస్తే విజయనగరం జిల్లా గణపతి నగరం మండలం మానాపురం గ్రామం నుండి కృష్ణాజిల్లా విజయవాడ సమీపంలో గల హనుమాన్ జంక్షన్ కు పశువులను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తన సిబ్బందితో మండల పరిధి చెందుర్తి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ నేపథ్యంలో కత్తిపూడి నుండి రాజమండ్రి వైపుగా వెళుతున్న కంటైనర్ వాహనాన్ని గమనించిన పోలీసులు సదరు వాహనాన్ని ఆపి పరిశీలించగా పశువుల అక్రమ రవాణా బండారం బయటపడింది.ఎవరికీ ఎటువంటి అనుమానం రాకుండా అక్రమార్కులు కంటైనర్ వాహనంలో పశువులను తాళ్లతో బంధించి రవాణా చేస్తున్నారు.పశువులు ఒకదానిపై మరొకటి పడి ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా కంటైనర్ లో పశు వధకు తరలిస్తున్నట్లు నిర్ధారణ కావడంతో పశువుల వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషనుకు తరలించారు. మూగజీవాలను బంధించి అక్రమ రవాణా చేస్తున్న డ్రైవర్లు శంఖవరం మండలం కు చెందిన కొల్లా నరసింహమూర్తి,తొండంగి మండలం ఏవి నగరం గ్రామానికి చెందిన నక్క రాజేష్,విజయనగరం జిల్లా కొత్తవలస మండలం సంతపాలెం గ్రామానికి చెందిన గట్టివాడ నవీన్ బాబు లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తెలిపారు.వాహనాన్ని సీజ్ చేసి పట్టుబడిన 32 ఎద్దులను భద్రత నిమిత్తం గో శాలకు తరలించిన

మరిన్ని వార్తలు 6లో

## పెట్రోధరలు పెంపు కేంద్ర పరిధిలోనిది గతంలో మీరు చెప్పిందే



**కొత్తపేట,మే18,(ప్రభాతవార్త):** పెట్రోల్ ధరలు పెంచడం తగ్గించడం కేంద్ర పరిధిలోని అని గతంలో మీరే సెలవిచ్చారు ఇప్పుడేమో చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం పెంపుదలకు కారణం అంటూ ఆందోళన చేస్తున్నారని టిడిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కదలి వీరేశ్వరరావు మండల తెలుగు యువత అధ్యక్షుడు ఇల్ల రాము మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి భూల మనోహర్ ఎంపీటీసీ సభ్యుల చిత్రపు ఆనంద్ సమావేశంలో తెలియపరిచారు వైసీపీ నేతలు రోజుకో రకంగా మాట్లాడటం అలవాటుపడ్డారని పెట్రోల్ ధరలు ఒక ఏపీలోనే కాదు దేశవ్యాప్తంగా పెరిగాయన్నారు ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్ సంక్షోభం ఏర్పడిందని యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో పెట్రోలుకు డిమాండ్ పెరిగిందన్నారు పలు దేశాలు ముందుగానే ధరలు పెంచాయన్నారు ఇండియాలో ఇప్పటివరకు ధరలు పెంచలేదంటే ఒక కేంద్ర ప్రభుత్వం సమస్యను ముందుగానే గుర్తించింది పొదుపు మంత్రం పాటించాలని ప్రజలను కోరిందన్నారు తప్పనిసరి పరిస్థితిలో ధరల పెరుగుదల జరిగిందన్నారు వైయస్సార్ పార్టీ రాజకీయ కారణాలతోనే పబ్లిసిటీ కోసం పెట్రోల్ ధరలు పెంపు పేరుతో ప్రజల దృష్టి ఆకర్షించడానికి చేస్తున్న ప్రయత్నమే నేడు ఆ పార్టీ చేపట్టిన కార్యక్రమమని విమర్శించారు.

## సుందరపల్లిలో గ్రామీణ సంచార వైద్యం



**కె.గంగవరం, మే 18,(ప్రభాతవార్త):** కె గంగవరం మండలం సుందరపల్లి గ్రామంలో సహార (గ్రామీణ సంచార వైద్యశాల( మొబైల్ వ్యాన్) ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు డాక్టర్ అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 55 మంది ని పరీక్షించగా వారికి అవసరమైన వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చినట్లు వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి రాజేశ్వరి, ఏ జ్యోతి, జే అనూష, పాల్గొనగా, స్థానిక గ్రామ ప్రజలతో పాటు ఎంపీటీసీ తాడాల జానకిరామ్ (రాజు), టిడిపి సీనియర్ నాయకులు శీరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

## ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది " విద్య"..ఎమ్మెల్యే గిడ్డి..



**అంబాజీపేట,మే 18, (ప్రభాతవార్త):** ప్రపంచంలో అత్యంత శక్తివంతమైనది విద్యేనని, విద్య ద్వారానే అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పుల్లేటికుర్రులో గుర్రం సత్య వరప్రసాద్ గార్డెన్ ఆవరణలో అంబేద్కర్ సమైక్య సంఘం అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయులు కత్తుల ఆనందరావు అధ్యక్షతన ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో పుల్లేటికుర్రు జడ్పీ హైస్కూల్లో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 36 మంది ఎస్సీ విద్యార్థులను ఘనంగా సన్మానించి, ప్రశంసా పత్రాలు, మెమొంటోలు, మెడల్సును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, విశ్రాంత ఐఏఎస్ అధికారిపిఎస్ఎన్ మూర్తిలు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని, భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు విద్య నేర్పిన గురువులతో పాటు వారికి అన్ని విధాలా సహకరించిన తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కోట బాలకృష్ణ,జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీర ధర్మారావు,శైలజ,మల్లేశ్వరరావు,జల్లి బాలరాజు,బంగార్రాజు,ఎన్ ఎస్ ఎన్ వర్మ,నూకపేయి చిన్న, నీతిపూడి విలసిత మంగతాయారు, పత్తి దత్తుడు,కొర్లపాటి డిల్లీ, మైపాల తాతాజీ,దొమ్మేటి సాయికృష్ణ,నాగాబత్తుల సుబ్బారావు,కత్తుల బాలరాజు, నాగాబత్తుల అన్నవరం, వడలి కృష్ణమూర్తి, చిట్టూరి రాధాభాయి, కోట మురళి తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు రూ.25 కోట్ల 30 లక్షల లబ్ది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు.




**తాళ్లరేవు, మే 18 (ప్రభాతవార్త)-** మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా ముమ్మిడివరం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 12,653 మంది మత్స్యకార లబ్ధిదారులకు రూ. 25 కోట్ల 30 లక్షల 60 వేల రూపాయలు ఆయా మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఒక ప్రకటన ద్వారా సోమవారం తెలిపారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం "మత్స్యకారుల సేవలో" పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హత గల ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.20,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయబడుతుంది. ఈ మేరకు నేడు నెల్లూరు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన 12,653 లబ్ధిదార కుటుంబాలకు వారి బ్యాంకు ఖాతాల్లో నిధులు నేరుగా జమ చేయబడనున్నందున సంబంధిత లబ్ధిదారులు గమనించాలన్నారు.

## దూబాలమ్మ పండుగకు రూ. 50 వేలు ఎమ్మెల్యే సహాయం



**రాజవొమ్మంగి, మే 18, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామంలో జరుగుతున్న దూబాలమ్మతల్లి గ్రామ దేవత పండుగకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రూ. 50 వేలు ఆర్థిక సహాయాన్ని పండుగ కమిటీకి ఇచ్చారు. బావితరాలకు గ్రామ దేవతల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఈకార్యక్రమంలో బారంగి ప్రకాశం, బారంగి రాజబాబు, ముంగారి అమ్మన్న, రావుల నరసింహారావు, బారంగి అనుదీప్ ( మండల తెలుగు యువత అధ్యక్షులు ) పాల్గొన్నారు.

## జనసేన చలివేంద్రం ఏర్పాటు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 18 (ప్రభాతవార్త):** సామర్లకోట పట్టణం బల్ల మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తనియుడు రంగనాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు. సందర్భంగా తుమ్మల బాబు మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా జనసేన--కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని , మండుతున్న వేసవి వడగాల్పులకు చలివేంద్రాలు బాటసారులకు, పాదా చారులకు ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఆయన చేతుల మీదుగా బాటసారులకు మజ్జిగ, చల్లని తాగునీరు పంపిణీ చేశారు. మండే ఎండల నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కూటమి నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సరోజా వాసు, ముసిరెడ్డి శ్రీరాములు, బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే బాబు, యార్లగడ్డ చిన్ని, దాట్ల జయ, తాతపూడి కృష్ణబాబు, గొల్లపల్లి కామరాజు, మద్రి రమణతో పాటు పలువురు కూటమి నాయకులు, జనసేన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రతి అర్జీని ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి - జిల్లా కలెక్టర్



**అమలాపురం కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి అర్జీపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో గోదావరి భవనం నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నైదియా దేవి, డిఆర్ఓ వి సుబ్బారావు అర్జీ. మమ్మిలు సుమారుగా 215 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ ప్రతి సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపి సంతృప్తి స్థాయిలను నూటికి నూరు శాతం చేరుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే ప్రతి అర్జీపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లాస్థాయి అధికారులు నిర్దేశ గడువులోగా అర్జీల పరిష్కారానికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత కలిగి ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైధియాదేవి తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శకత, సమర్థత పాటించడం అత్యంత ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని, నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలు అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పి డి డి రాంబాబు డిఏ ల్డివోలు రాజేశ్వరరావు వేణుగో పాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కాశీవిశ్వేశ్వరరావు, జిల్లాస్థాయి అధికారులు వికాస జిల్లా మేనేజర్ జి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎంసెట్లో 61వ ర్యాంక్ సాధించిన తొస్సిపూడి విద్యార్థి



**బిక్కవోలు 18 మే ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం తొస్సిపూడి గ్రామానికి చెందిన దివంగత సివిల్ ఇంజనీర్ తేతలి పాపారెడ్డి , చంద్రావతి దంపతుల మనుమడు జి ఎన్ అర్ యూత్ సభ్యులైన తేతలి జయధీర్ వంశీ రెడ్డి , తెలంగాణ ఎంసెట్ రాష్ట్ర స్థాయిలో 61 వ రాంక్ , జేఈఈ మెయిన్స్ లో జాతీయ స్థాయిలో 974 రాంక్ సాధించాడని యూత్ అధ్యక్షులు గొలుగూరి నారాయణ రెడ్డి తెలిపారు.. ఈ సందర్భముగా వంశీ రెడ్డి మాట్లాడుతూ తాను శ్రీచైతన్య కేపీహెచ్ ప్రతిభ ఐఐటి క్యాంపస్ లో చదివినట్లు , తన అభివృద్ధికి తన తల్లి తండ్రులు వెంకట రెడ్డి, సృజని, తాత పి ఎస్ ఎస్ రెడ్డి ( విశ్రాంత ప్రిన్సిపాల్), తన కళాశాల అధ్యాపకులు కె వి ఆర్, మోహన బాలాజీ , ప్రిన్సిపాల్ నాగరాజు, అప్పారావు ఎంతగానో ప్రోత్సహించారని తెలిపాడు. బిక్కవోలు మండల పరిషత్ అధ్యక్షులు తేతలి సుమ సూర్య చంద్రా రెడ్డి , గ్రామ ప్రముఖులు డి వి వి రామా రెడ్డి ( తంబీ), ఉమ్మడి రాష్ట్ర యూత్ మాజీ అధ్యఖులు జి ఎన్ ఎన్ రెడ్డి, మల్లిడి జగ్గిరెడ్డి తదితరులు వంశీ రెడ్డి ని అభినందించారు.

## జన్ జాతీయ గౌరవ ఉత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి.



**చింతూరు మే 18 ప్రభాత వార్త.** కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (మోట ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "జన్ జాతీయ గౌరవ ఉత్సవ్" కార్యక్రమాన్ని సోమవారం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమం 18 మే 2026 నుండి 25 మే 2026 వరకు కొనసాగనుంది.ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, గ్రామ స్థాయిలో సేవల అందుబాటును మెరుగుపరచడం, విద్య, ఆరోగ్యం, ఉపాధి మరియు జీవనోపాధి అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పి ఓ తెలిపారు. 19 మే 2026 నుండి 25 మే 2026 వరకు అన్ని అస్కి గ్రామాలలో ప్రత్యేక ఆరోగ్య పరీక్షల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు మరియు క్షయ వ్యాధి (టీబీ ) నిర్ధారణ పరీక్షలు నిర్వహించబడతాయి అని,ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించే "జనసున్వాయి" ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వీలైనంత త్వరగా పరిష్కారం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాలన పరమైన అంశాలకు సంబంధించిన వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు."సబ్‌సే దూర్ -- సబ్‌సే పహలే" అనే భావనను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ సేవలు ప్రతి గిరిజన కుటుంబానికి ప్రాధాన్యతతో చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ పి ఓ (గిరినజ సంక్షేమ శాఖ ), ఐటిడిఏ సి హెచ్ . రామతులసి , నాలుగు మండలాల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ ఆఫీస్ వారి కార్యాలయం


### బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సుబ్రమణ్యం గౌడ్ నియామకం.



**ఆత్రేయపురం , మే,18,(ప్రభాత వార్త).** బీసీ సంక్షేమ సంఘం కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా ఉచ్చిలి గ్రామానికి చెందిన ఉర్రింకల సుబ్రమణ్యం గౌడ్ నియమితులైనట్లు జిల్లా అధ్యక్షులు సంసాని రామకృష్ణ, తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు సంసాని రామకృష్ణ, సుబ్రహ్మణ్యం గౌడ్ ని నియమించారు. ఈ సందర్భంగా కొత్తపేటలోని ప్రముఖ బీసీ సంఘం నేత మట్టపర్తి సూర్యచంద్రరావు నివాసంలో సోమవారం బీసీ నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం గౌడ్ నియామకాన్ని ధ్రువీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సుబ్రహ్మణ్యం గౌడ్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని బీసీ కులాల వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి యాండ్ర శ్రీనివాస్, పి.గన్నవరం నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లంకె ఏసుబాబు, పి గన్నవరం మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొల్లు రాంబాబు తదితరులు సుబ్రహ్మణ్యం గౌడ్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## పెద్దాపురంలో వైసీపీకి భారీ షాక్.. ...

### .జనసేనలోకి అగ్రనేతలు, మాజీ కౌన్సిలర్ల చేరికలి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే 18 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో వైసీపీ పార్టీకి భారీ షాక్ తగిలింది. వైసిపి పార్టీ కి చెందిన పలువురు అగ్రనేతలు, మాజీ కౌన్సిలర్లు జనసేన పార్టీలో చేరారు. పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కాకినాడ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్, పెద్దాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మల రామస్వామి బాబు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ కండువా వేసి జనసేన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా జనసేన పార్టీ ఎదుగుతోందని, ప్రజాసేవే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, యువతకు అవకాశాలు కల్పించే దిశగా జనసేన పార్టీ పని చేస్తోందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, పార్టీ చేపడుతున్న ప్రజా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జనసేన వైపు వస్తున్నారని అన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సులతో పార్టీ విజయపథంలో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో వీర మహిళలు పాల్గొన్నారు.

## చింతూరు యం పి డి ఓ కార్యలయంలో జన్ భగీదరి అభియాన్.యం పి డి ఓ శ్రీనివాస్ దొర.చింతూరులో ర్యాలీ.



**చింతూరు మే 18 ప్రభాత వార్త.** చింతూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సోమవారం జన్ భగీరధి అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు యం పి డి ఓ శ్రీనివాస్ దొర ఒక ప్రకటనలో తెలిపారు.సబ్సే దూర్ సబ్సే పెహలే అనే కార్యక్రమము మండల పరిషత్ కార్యాలయం వేదిక అయింది. మండల పరిషత్ అధ్యక్షురాలు సవలం అమల అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో,పంచాయతీ అభివృద్ధి అధికారులతో జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 పురస్కరించుకొని ఆయా గ్రామాలలో రోజువారి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను అన్ని విధాల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించడం ఆయా గ్రామాలలో ఈనెల 19వ తారీకు నుండి 25వ తారీకు వరకు గ్రామాలను సందర్శించడం ప్రజలకు అవగాహనా కల్పించడం ఆయా గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పన మొదలగు అంశములతో పాటు ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ మరియు ఐ. సి. డి. ఎస్ సమన్వయంతో మెడికల్ క్యాంపులు నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమంనకు అడిషనల్ డిఎంహెచ్వో, జడ్పిటిసి సభ్యులు శ్రీ చిచ్చడు మురళి, ప్రజలకు వేసవికాలం దృష్ట్యా తగు సూచనలు జారీ చేసశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.జరిగింది ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ శాఖ ల అధికారులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులు




**కె.గంగవరం, మే 18,( ప్రభాతవార్త):** గంగవరం మండలం అమూజురు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వినయ్, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్( గురుకుల భూపతి పాలెం, సంధ్య తుని గురుకుల పాఠశాల నందు ప్రవేశం నట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులను , ఎం యు వన్ నాగరాజు ,ఎంఈఓ 2 ఆంజనేయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీను, మాజీ సర్పంచ్ కల్యాణి శ్రీనివాసు, వ్యవసాయ కమిటీ డైరెక్టర్, గ్రామస్తులు అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఐదో తరగతిలో ప్రవేశాల కోసం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణులైన వారిని పదో తరగతి వరకు ఆంగ్ల లో ఉచిత విద్యను,వసతిని,ఆహారం, దుస్తులు, పుస్తకాలు అందిస్తారు.

## మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజుతో ధర్నాలకోట భేటీ



**ప్రత్తిపాడు, మే 18 (ప్రభాత వార్త)** మాజీ కేంద్ర మంత్రి ఎం.ఎం. పల్లంరాజునీ కాకినాడలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి మెంబర్ , డిసిసి వైస్ ప్రెసిడెంట్ ధరణాలకోట శ్రీను అనంతరం పార్టీ శ్రేణులతో పల్లంరాజు సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై వారు సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పల్లంరాజు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోనూ కాంగ్రెస్ పార్టీ కమిటీలను బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలకు అండగా నిలవాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు.ఈ భేటీలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు మల్లిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ జగ్గంపేట పర్యటన రద్దు తాళ్లూరు ప్రాజెక్ట్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన:



**జగ్గంపేట మే 18 (ప్రభాత వార్త)** తాళ్లూరులో అనివార్య కారణాలతో మంత్రి నారా లోకేష్ పర్యటన రద్దైనప్పటికీ, తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి మంగళవారం ఉదయం 9:00 గంటలకు 52 కోట్ల రూపాయలతో చేపట్టే తాళ్లూరు లిఫ్ట్ పనులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం జరగనుందిఈ ప్రాజెక్ట్ పూర్తయితే తాళ్లూరు పరిసర ప్రాంతాల్లోని 31 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల చిరకాల కోరిక నెరవేరనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు, నాయకులకు, జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు

## వేదపండితులు యలమంచిలి సేవలు మరువలేనివి : ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.



**అనపర్తి మే 18 ప్రభాతవార్త** శైవాగమ కిశోర్,ఆగమభాస్కర,యాగ కేసరి,తిరుమల తిరుపతి దేవస్థాన శైవాగమ పరీక్షాధికారి బ్రహ్మశ్రీ యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య చేస్తున్న సేవలు మరువలేనివి అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. నల్లమిల్లిమూలారెడి కళాపరిషత్ 37 వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు ముగింపు సందర్భంగా వాటిని సన్మానించి మాట్లాడుతూ ఈప్రాంతంలో కృష్ణమూర్తి గార్ని తెలియని వస్తుందని ఆయన చేతులమీదుగా వందకు పైగా శివాలయాలకు శంకుస్థాపన చేసిన ఘనత ఆయనకు దక్కుతుందని. ఎంతో మంది ప్రముఖులకు హోమాలు చేసి పలువురి మన్ననలు పొందారని అన్నారు.అనంతరం ఆయన్నిఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పలువురు ఎన్ డి ఏ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.మూలారెడ్డి కళాపరిషత్ 37వ జాతీయ సాంఘిక నాటిక పోటీల విజేతల వివరాలు నాటికపోటీల్లో ప్రథమ బహుమతి ఇంద్రప్రస్థ రెండవ బహుమతి అమ్మచెక్కినబొమ్మ. మూడవ బహుమతో(అ) సత్యం విజేతలుగా నిలిచాయి.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## సామర్లకోట-కాకినాడ కాలువ పూడికతీత పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, మే 18 (ప్రభాతవార్త):** ఇంద్రపాలెం నుండి సామర్లకోట మీదుగా వెళ్తున్న సామర్లకోట కెనాల్ కు కాకినాడ రూరల్ మండలం ఇంద్ర పాలెం లాకులు ఇరిగేషన్ కార్యాలయం వద్ద కెనాలు పూడిక తీత పనులను సోమవారం ఉదయం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గత 15 సంవత్సరాల నుండి పట్టించుకున్న నాధుడే లేడని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల్లో పూడిక తీసే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే పంతం నానాజీ స్పష్టం చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పూర్తిగా వదిలేసిన ఇరిగేషన్ కాలువ పూడికతీత పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందని ఇందులో భాగంగా ఇంద్రపాలెం లాకుల వద్ద నుండి సామర్లకోట కెనాల్ లో కూడిక తీసే పనులను ప్రారంభించామని తెలిపారు సుమారు 40 లక్షల వ్యయంతో సామర్లకోట మండలం వెంకట కృష్ణ రాయపురం వరకు 8కిలోమీటర్ల మేర ఈ పనులు కొనసాగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి పనులతో పాటు రైతులకు పంట నీరు అందే విధంగా కాలవల్లో పూడిక పనులు చేపట్టామన్నారు. ఇరిగేషన్ కాలువల ఆక్రమణలపై శాసనసభలో ప్రస్తావించానని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా పలుమార్లు ప్రస్తావించామనీ అధికారులు చిత్తశుద్ధితో ఆక్రమణలను తొలగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డి ఈ పి ఆనంద్ కుమార్ ఏఈ షైనీ, నీటి సంఘం అధ్యక్షులు కుప్పిరెడ్డి వీరాస్వామి నీటి సంఘం ఉపాధ్యక్షులు వెంకటప్రసాద్ నీటి సంఘం సభ్యులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## దివ్యాంగుల సంక్షేమం, ఉపాధి అవకాశాలు పెంచే లక్ష్యంతో మూడు చక్రాల స్కూటర్లు పంపిణీ ఎమ్మెల్యే నానాజీ

**కాకినాడ రూరల్, మే18 (ప్రభాతవార్త):** ప్రభాతవార్త:కాకినాడ రూరల్ మండల



పరిధిలో ఏడుగురు దివ్యాంగులకు సంక్షేమం ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంగా మూడు చక్రాల స్కూటర్లు ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సహకారంతో విభిన్న ప్రతిభావంతుల స్వయం ఉపాధికి తోడ్పాటును అందించే ఉద్దేశంతో అర్హతలు కలిగి దివ్యాంగులకు సుమారు ఒక లక్ష 25 వేల రూపాయలతో ఉచితంగా ఏడుగురు లబ్ధిదారులకు మూడు చక్రాల స్కూటర్లు అందించడం జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ మంత్రి లోకేష్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గంలో నియోజకవర్గానికి 10 చొప్పున అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్లు పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం దివ్యంగులకు ఇచ్చిన హామీలలో ఇప్పటికే దివ్యాంగ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయగా, బ్యాక్ లాగ్ ఉద్యోగా భర్తీకి గౌరవ సీఎం ఆదేశాల మేరకు అధికారు చర్యలు చేపట్టడం జరిగిందని , రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఈ మూడు చక్రాల స్కూటర్లు దివ్యాంగులు స్వయం సమృద్ధికి దోహదం చేస్తాయని ఎమ్మెల్సీ పద్మశ్రీ తెలిపారు. కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రంభాల వెంకటేశ్వరరావు, పితాని లీలా, రూరల్ మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు కరేడ్ల గోవిందు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, జనసేన పార్టీ నాయకులు, తాటికాయలు వీరబాబు, మాదారపు తాతాజీ, తోటకూర సతీష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలపై ఉక్కు పాదం - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం కలెక్టరేట్, మే 18 ప్రభాతవార్త** ఇసుక అక్రమ రవాణా అక్రమ తవ్వకాలపై ఉక్కు పాదం మోపి అనుమతి లేని ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిపినా, లేదా నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించినా కఠిన చర్యలు తీసుకోవాల ని రాత్రి వేళల్లో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఆర్ మహేష్ కుమార్ కమిటీ సభ్యులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరే ట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు గైకొనాలని హెచ్చరించారు. కోనసీమ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా పంపిణీ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు లోబడి, అత్యంత పారదర్శకంగా జరగాలని ఇసుక అక్రమ తవ్వకాలు రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు గైకొనాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, మరియు పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో 5 రీచ్ లలో ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నాయని వీటిలో నాలుగు రీచ్లు సెమీ మెకానైజ్డ్ కాగా తాతపూడి రీచ్ మాన్యువల్ గా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారన్నారు జిల్లాలో ఐదు రీచ్లు రెన్యువల్ చేయాల్సి ఉందని ఆయన స్పష్టం చేశారు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రుతుపవనాలు సీజన్లో వర్షాకాలంలో డిమాండ్ కు అనుగుణంగా ఏడు లక్షల మెట్రిక్ టన్నులు స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచాలని ఆదేశించినప్పటికీ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని 10 లక్షల మెట్రిక్ టన్నులను స్టాక్ పాయింట్లలో నిల్వలు ఉంచనున్నట్లు తెలిపారు. ఇప్పటికే స్టాక్ పాయింట్లలో 6.65 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని చెప్పారు. కపిలే శ్వరపురం కేదార్లంక లో పట్టా భూములలో (డి-కాస్టింగ్) భూములలో ఇసుక త్రవ్వకాలు జరుగు తున్నాయన్నారు. రావుల పాలెం ఆలమూరు పి గన్నవరం అల్లవరం మండలాలలో అక్రమ ఇసుక మట్టి త్రవ్వకాలు జరుగుతున్నట్లు దినపత్రికలలో కథనాలు వస్తున్నాయని అట్టి వదంతులను కట్టడి చేయడానికి గనులు రెవెన్యూ పోలీస్, రవాణా శాఖల అధికారులను మండల వారి బృందాలుగా విభజించి వారంలో రెండు రోజులు యాదృచ్ఛికంగా సంయుక్త తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జి మమ్మీ డి సరళావతి,గనులు భూగర్భ శాఖ ఏడి డి అశోక్ కుమార్ డిపిఓ శాంతి లక్ష్మీ, జలవనరుల శాఖ హెడ్ వర్క్స్ ఈఈ జి శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ సి బి రాము,పోలీస్ రవాణా శాఖల ఉన్నతాధికారు లు పాల్గొన్నారు

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps